తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

మార్చి 16-31, 2021

సంపుటి 01, సంచిక 11

*Complimentary Copy - 11*



## హోలి- రంగుల కేళి




*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




ఆఫ్రికన్ నోబుల్ సాహిత్య విజేతను పరిచయం చేస్తున్న **బాణాల శ్రీనివాస్** వ్యాసం... 35

సామాజికాంశంగా దేవతలను పాత్రలుగా చేసిన **నూతన కవి సూరన** నాటి కవిత... **ధనము రూపము** 14



25 **హిందీ తెరపై మెరిసిన తెలంగాణ తారాతోరణా**న్ని మన కళ్ళముందు గుదిగుచ్చిన **సి.హెచ్. రమేష్ బాబు**



05 **అంబేడ్కర్ భావ జాలాన్ని** నాటి కాలంలో కూడా ప్రచురించిన రచయితను పరిచయం చేస్తున్న **సంగిశెట్టి శ్రీనివాస్**



37 **సాహిత్య వేత్తగా పీవీ**ని ఆవిష్కరిస్తున్న **డా॥ రేవూరి అనంతపద్మనాభ రావు** వ్యాసం....



11 గ్రామాలలో నాటి కాలంలో నిమ్న స్థాయి వర్గాల మీద చూపే విచక్షణ తెలిపిన **జి. సురమౌళి** నాటికథ.. **అంగుడి పొద్దు**



21 మానవ మమకారంలోని కృతి మత్వాన్ని తెలిపే **ప్రభులింగ శాస్త్రి** ఆంగ్ల కథకు **అచ్యుతుని రాజ్యశ్రీ** తెలుగు అనువాద కథ **అనుబంధం అంతా బూటకం**



17 చిత్తశుద్ది ప్రదర్శన చాటున దాగిన మోసాన్ని తెలియజేసే **పిన్నం శెట్టి కిషన్** కథ... **నాకేం వద్దు**

**కాకతీయుల వైభవం** పద్య కవిత్వ రూపంలో చెబుతున్న **డా॥ సివి జయవీరరాజు** 40

అమానవీయ కోణాన్ని పరిహరించే దారి చూపుతున్న **ఎలనాగ దయావిహీనం** కవిత 13

ఎడతెగని అమ్మ ప్రేమను తెలిపే **మునాస** కవిత **ఎడతెగని వాన** 45

**వాణి - నా రాణి అన్న పిల్లల మర్రి పినవీర భద్రుని** అంతర్యం తెలుపుతున్న **డా॥ వడ్డేపల్లి కృష్ణ** వ్యాసం.. **...15 పేజీలో**

నేటి కవి **కోట్ల వెంకటేశ్వర రెడ్డి**తో మామిడాల ముఖాముఖి.... **...31 పేజీలో**

ఆవుల పిచ్చయ్య కథలో నాటి సాంఘిక పరిస్థితిని ఆవిష్కరిస్తున్న వ్యాసం... **ఆవుల పిచ్చయ కథలో సమాజం ...41 పేజీలో**

మనిషి ఉనికిని మన ముందు పెడుతున్న **గాజోజు నాగభూషణం** కవిత **ఉనికి ...20 పేజీలో**

సామాజిక సమస్య, పరిష్కారం చెప్పే **సామల కిరణ్ నానీలు ...23 పేజీలో**

అమ్మాయిలకు స్వేచ్ఛ ఇస్తే కనిపించే అందలాలు చెప్పే **ఎన్వీ సత్యనారాయణ** కవిత.. **మాటల కెరటాలు ...36 పేజీలో**

మనిషిలోని నిరంతర దు:ఖాన్ని ఆవిష్కరించే **సుంకర రమేశ్** కవిత **నీడలతో నా నడక ...04 పేజీలో**

పూలకు స్త్రీలకు అభేదం చెప్పే **అన్నవరం** కవిత... **పూలు స్త్రీలు ...24 పేజీలో**

స్త్రీల పట్ల వివక్షను వ్యవస్థీకృతం చేసిన సమాజాన్ని మన ముందుకు తెచ్చిన ఏనుగు నరసింహారెడ్డి కవిత... **ఒక వైపు నుండి ఆడే ఆట ...47 పేజీలో**

ఇంకా **కొత్త పుస్తకం, పుస్తక సమీక్ష, సాహితీ శిఖరం, దృశ్య సాహిత్యం, స్వీకారం** మరెన్నో...

# తంగేడు సంచికకు స్పందన...



తేగీ. శ్రీలు విలసిల్లు తెలంగాణ
చిర యశస్వి, రాష్ట్రమై నిల్వ రమ్యమౌ
లక్ష్యములతో, జాతి
మెచ్చిన సంస్థగా జాగృతి
తనె, సేవలన్ జేయు
భావిదౌ శ్రేయ మెంచి.
కం. అదిగో యా
భావనతో, ముదమారగ
రూపు దిద్ది ముచ్చట
గొలిపే, పద సంచయ
"తంగేడే' ఎద ఎదలో నిల్చె నేడు
ఏర్పడకుండన్
**- మడిపల్లి భద్రయ్య, కవి**

తంగేటి జున్ను పంచెడు
"తంగేడు"ను చదివి పాతతర
మీ తరమున్ పొంగుచు
నుండిరి భువిలో నంగూరులు
తిన్న యట్టులను
భూతి మెయిన్
**- డా॥ బొద్దుల లక్ష్మణ్**
**కవి**

తెలంగాణ సాహితీ
సంస్కృతులకు సరియయిన
వేదిక తంగేడు. తెలంగాణ
ప్రజల సాహిత్యాభిలాషకు
సరికొత్త భూమిక తంగేడు
**- దత్తాత్రేయ శర్మ**

తంగేడు రోజు
రోజుకు బాగా
వస్తుంది....
**- నూటెంకి రవీంద్ర**
**కవి**

తంగేడు పత్రిక చక్కగా
తీర్చి తిద్దుతున్నారు.
కూర్పు చాల బాగుంది
**- మహేందర్ రెడ్డి,**
తెలుగు సహాయాచార్యులు,
సిద్దిపేట

తంగేడుకు
అభినందనలు
- బాగా తీస్తున్నారు
**- కపిలవాయి**
**ఆనంద్, రచయిత**

తంగేడు ఆకర్షణీయంగా
ఉంది అభినందనలు
**- శ్రీనివాస్ గౌడ్,**
పి.ఆర్.ఒ., తెలుగు
విశ్వవిద్యాలయం

తంగేడుకు అభినందనలు
- నేను చందా కడుతా.
రెగ్యులర్ గా పంపండి
**- మేక రామ స్వామి**
**రచయిత**

తంగేడు పత్రిక
లో రచనల ఎంపిక
బాగుంటుంది
**- చీదెళ్ల సీతా లక్ష్మి,**
**కవయిత్రి**





సంపాదకీయం


తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 మార్చి, 2021

సంపుటి 01 సంచిక 11





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614


# తెలంగాణ సాహిత్యంలో నవల

తెలంగాణ సాహిత్యం లో నవల పాత్ర చాల విస్తృతమైనది. ఒకనాటి తెలంగాణా పోరాటాన్ని, సామాజిక జీవనాన్ని నవల బాగా ప్రతి ఫలించింది. వట్టికోట ఆళ్వారు స్వామి ప్రజల మనిషి, (1915) దాశరథి రంగాచార్య చిల్లరదేవుళ్ళు, మోదుగు పూలు తొలితరం తెలంగాణ నవలలలో చెప్పుకోదగినవి. తరువాత నవల తెలంగాణ విప్లవోద్యమాన్ని ప్రతిఫలించింది. చెరబండ రాజు మా పల్లె (1974) ప్రస్థానం (1981) అల్లం రాజయ్య కొలిమంటుకుంది (1974) అగ్ని కణం (1983) తుమ్మేటి రఘోత్తం రెడ్డి నల్లవజ్రం, వసంతరావు దేశ్‌పాండే అడవి (1993) జ్వాలాముఖి వ్రేలాడేమందారం (1979) లాంటి నవలలన్నీ విప్లవోద్యమాన్ని ప్రతిఫలించినవి. అంపశయ్య నవీన్ చీకటి రోజులు, రక్త సారం, లాంటి నవలలు కూడా ఈ కోవలో చేరేవే. ఇంకా మాదిరెడ్డి సులోచన, పోల్కం పల్లి శాంతాదేవి, ముదిగంటి సుజాత రెడ్డి లాంటి రచయిత్రులంతా నాటి తెలంగాణ సమాజాన్ని బాగా ప్రతిఫలించారు.

ఇంత విస్తృతంగా వచ్చిన నవల ఈ నాడు ఏమయింది? తెలంగాణ సాహిత్యంలో బిక్కుబిక్కుమంటూ ఎందుకు నిలబడిపోయింది? ఇది సృజన లోకాన్ని కలచి వేయవలసిన ప్రశ్న. నేరళ్ళ శ్రీనివాస్ 'బతుకు తాడు', పెద్దింటి అశోక్‌కుమార్ 'జిగిరి', కెవిఎల్ 'కల్లు మండువా' లాంటివి మినహాయింపు అనుకుందాం.

అదే కవిత్వమైతే చాల విస్తృతంగా వస్తుంది. కవిత్వంలో వచన కవిత్వం, పాట, పద్యం, లాంటి విభాగాలన్నీ కొనసాగుతున్నాయి. కథ కూడా కవిత్వం తోపాటు నడుస్తూనే ఉంది. విమర్శ, దానితో పాటు సాహిత్య చరిత్ర, చరిత్ర పరిశోధన లాంటి ప్రక్రియలన్నీ తమ పరిమళాన్ని వెదజల్లుతూనే ఉన్నాయి.

నిజానికి నవలా రచనకు అవసరమైన ముడిసరుకు మనకెంతో లభించే సందర్భం ఇది. తెలంగాణ ఉద్యమం, దాని తరువాత వచ్చిన తెలంగాణ రాష్ట్రం, అనంతర కాల పరిస్థితులు, ఇట్లా ఎంతో ముడి సరుకు సృజన కర్తల ముందు ఉన్నది. అయినా ఒక అర్థం కాని నిర్లిప్తత తెలంగాణ సాహితీ లోకాన్ని వెన్నాడుతోంది. నవల రాయాలంటే రచయితకు ఒక ప్రత్యేకమైన దృష్టి ఉండాలి. శిల్ప పక్వత సాధించాలి. కుదురుగా నిలకడగా వస్తువును నడిపించగలగాలి. ఏదో ఒకసారి భావావేశం వచ్చినపుడు అట్లా రాసిపారెయ్యడం కుదరదు. గతంలో నైతే ఆంధ్ర ప్రాంత రచయితలకే ప్రచారం అధికం అని తెలంగాణా వాళ్లకు అవకాశం లేదనే మాటుంది. కాని ఇప్పుడు అన్ని ప్రక్రియల్లో తెలంగాణ రచయిత దీన్ని అధిగమించాడు.

వ్యాపార నవల టి.వి. సీరియల్స్‌గా రూపాంతరం చెందాక తన స్థానం నిలుపుకోవలసిన సీరియస్ నవల వెనుకబడడం సృజనలోకం తిరిగి చూసుకోవలసిన అవసరం ఉంది. పైన పేర్కొన్న రచయితలు చాలామంది ఇప్పటికీ సాహితీ లోకంలో కొనసాగుతున్నారు. కాని ఎందుకో నవలా సస్యాన్ని వదలి పెడుతున్నారు. యువలోకం కవిత్వం, కథపైనే దృష్టి పెడుతున్నారు.

సృజన లోకం నవలా ప్రక్రియవైపు దృష్టి పెట్టవలిసి ఉంది. సమాంతర సామాజిక ప్రతిఫలనంగా నవల పునర్వికాసం పొందవలసి ఉంది.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత

# నీడలతో నడక



నీడలు పరుచుకున్న చెట్లు
నేను చెట్ల తలల మీద నడుస్తున్న
నా ముందు నా కన్నా నా
నీడలే రెండు నడుస్తున్నాయి
కీచు రాళ్ళ చప్పుడు
ఆనాటి అపురూప సంగీతం
ఇన్నాళ్లకు వింటున్నా
నా నీడ ఇంత పెద్దగా ఎప్పుడు
ఐనదో
చూసుకునే కాలం ఇదే
నాతో పాటే ఒక బక్క చిక్కిన
కుక్క కూడా నడుస్తోంది
తలపైన చంద్రుడు మబ్బుల్లో
నడుస్తున్నాడు
ఇవి వట్టి ప్రాణం లేని నీడలు
అనుకునేరు
గతంలోకి సర్రున
ఈడ్చుకు పోతాయి
పురాజ్ఞాపకాలు
కల్లోల కెరటాల్లా
తీరం దగ్గర కొండరాయితో
తల పడుతుంటాయి
పైన చీకటి మధువును
తాగుతున్న చంద్రుడు
యుగాల భారాన్ని
మోస్తున్నాడు
కనిపించే పండు వెన్నెల
మాటున కనిపించని బిలాలెన్నో
ఒక సారి ముందుకు నడుస్తున్నాను
మరోసారి వెనుక నడుస్తున్నా
నీడలు రేపిన
గాయాలు గడపదాటి లోపలికి
వస్తున్నాయి
తలుపులు వేసుకున్నా
దుఃఖ స్రావంతో
దిండు నాని పోయింది
కుక్క రాత్రంతా రోదిస్తూనే వుంది



సుంకర రమేశ్

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికకు అగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

వ్యాసం

# అంబేడ్కర్ భావజాలాన్ని ఆచరించి ప్రచారం చేసిన అంతటి నరసింహం

అంబేడ్కర్‌ను ఆనాడే మన ముందు ఉంచిన రచయిత...



సంగిశెట్టి శ్రీనివాస్

**"ఎంతటి వారలైనా నీ అవసరం రానంత వరకే నిన్ను విస్మరిస్తారు"**

ఈ విస్మరణ, వివక్షాపూరిత వైఖరి మూలంగా కొన్ని సార్లు వైయక్తిక నష్టం కన్నా సమాజానికే ఎక్కువ నష్టం జరుగుతుంది. కొంతమంది సాహితీమూర్తులు సృజించిన రచనలను విస్మరించడం వల్ల వారికన్నా ఎక్కువగా మనకే నష్టం జరుగుతుంది. జరిగింది కూడా! అట్లా విస్మరించి ఎందరికో నష్టం చేసుకున్నాము. అట్లాంటివారిలో ఇప్పుడిక్కడ ఒకతన్ని, అతని రచనలను స్మరించుకుందాం. ఆయన పేరు డాక్టర్ అంతటి నరసింహం.

కడపజిల్లా వెంకటరాజు పల్లెకు చెందిన అంతటి నరసింహం కులం రీత్యా గౌడ్. ఈయన కావ్యాలు, సాంఘిక నవలలు, చారిత్రక రచనలు, నాటకాలు, విమర్శ, బాల సాహిత్యం ఇట్లా అనేక ప్రక్రియల్లో ఆరు దశాబ్దాల పాటు రచనలు చేసిండు. ఇప్పుడిక్కడ ఆయన రాసిన 'చీకట్లో కాంతి రేఖలు' అనే నవల గురించి చర్చించుకుందాం.

'చీకట్లో కాంతిరేఖలు' నవల మొదట ఆంధ్రభూమి దిన పత్రిక ఆదివారం అనుబంధంలో సీరియల్‌గా ప్రచురితమయింది. అనంతరం 1982లో పుస్తక రూపంలో వెలువడింది. ఈ నవల 1991లో పునర్ముద్రితమయింది. ఒక



నవల రెండుసార్లు అచ్చవడం అరుదు. రెండోసారి ప్రచురితమైన నవల ఆధారంగానే ఇక్కడ విశ్లేషణ రాస్తున్నాను.

తెలుగునాట 1985లో కారంచేడు సంఘటన తర్వాత దళితోద్యమం పురుడు పోసుకుంది. ఇది సాహిత్యంలోనూ ప్రతిఫలించింది. ఆ తర్వాత 1990లో పూలే శతవర్ధంతి, అనంతరం 1991లో అంబేడ్కర్ శతజయంతి, మండల్ ఉద్యమం, బహుజన సమాజ్ పార్టీ కార్యకలాపాలు, బాబ్రీ మసీదు విధ్వంసం అన్నీ కలిసి దళిత, బహుజన చైతన్యానికి పాదులు వేశాయి. అయితే ఇవేవి లేని సమయంలోనే అంతటి నరసింహం 'చీకట్లో కాంతిరేఖలు' అనే చారిత్రక, రాజకీయ, దళిత చైతన్య నవలను రాసిండు. నవలా నాయకుడు దళితుడు. మాల కులస్థుడు. పేరు కాంతారావు.

ఈ కాంతారావు ప్రాథమిక విద్య నుంచి ఐఎఎస్ అధికారిగా ఎదిగి వచ్చే క్రమాన్ని అంతటి నరసింహం అత్యంత సమర్థంగా చిత్రించిండు. చాలా విషయాలు తాను స్వయంగా చూసినవి కావడంతో వాటికి జీవం పోసిండు. ఈ నవల చాలా రకాలుగా కొత్త పుంతలు తొక్కింది. ఇందులోని కథ 1930-1958 మధ్య కాలంలో గుంటూరు, హైదరాబాద్ రాజ్యం, మదరాసు చదువులూ, అమెరికా రాక పోకలు, దళితులపై దాడులు, పొగాకు కూలీలు, వారిపై అత్యాచారాలు, క్రైస్తవం, మతమార్పిడులు, మాల-మాదిగల విభేదాలు, వారిమధ్య సయోధ్యకు కృషి, కమ్యూనిస్టు, కాంగ్రెస్ రాజకీయాలు, తెలంగాణ-ఆంధ్ర సంబంధాలు, రజకార్లు, సాయుధ రైతాంగ పోరాటం, ఆంధ్రాధిపత్యం, విద్య ప్రాధాన్యత, దళితుల ఆత్మగౌరవం, మదరాసులో దళితులకు కిరాయికి ఇండ్లు దొరకని స్థితి, తెలంగాణలో దొరల దౌర్జన్యాలు, దళితుల ఉన్నత చదువులు, కుల అంతరాలు- ఇట్లా అనేక విషయాలను మేళవించి దళితుల జీవితాలను చిత్రించిండు.

అన్నిటి కన్నా ప్రధానంగా కాంగ్రెస్

వాదిగా బయలుదేరిన వ్యక్తి మధ్యలో కమ్యూనిస్టుగా అదీ తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా తుపాకి పట్టుకున్న వ్యక్తి 1956 నాటికే అంబేడ్కరిస్టుగా, ఐఏఎస్ గా ఎదిగిన తీరు, సమాజంలో వచ్చిన మార్పును పొల్లు పోకుండా కండ్ల ముందుంచిండు. మొదట్లో గాంధీ-అంబేడ్కర్ ఇద్దరినీ అభిమానించిన వ్యక్తి ఆఖరికి అంబేడ్కర్ దగ్గర వచ్చి ఆగిన తీరుని ఇందులో రాసిండు.

ఇదొక విశిష్టమైన నవల. ఎందుకంటే నవలాకారుడిది రాయలసీమ. కథా నాయకుడు గుంటూరు వాసి. ఈయనకు స్ఫూర్తి, గురువు తెలంగాణకు చెందిన కమ్యూనిస్టు, మాలదాసరి. అనంతరం ఈ మాలదాసరి 1952 ఎన్నికల్లో గుంటూరు జిల్లా రిజర్వుడు నియోజక వర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిండు. ఇట్లా ఎన్నికల్లో ఈయన విజయానికి తోడ్పడింది తెలంగాణలో రజకార్ల దోపిడీలో సర్వం కోల్పోయిన భూస్వామి కూతురు. ఈమె పేరు శశి. ఈమె తర్వాతి కాలంలో అంటే 1952-53 నాటికే అమెరికా వెళ్ళి అక్కడ చదువుకుంటుంది. అక్కడ ఉద్యోగం కూడా చేస్తుంది. దళిత కథానాయకుడు - శశి మధ్యన ప్రేమ, ఆత్మాభిమానం గురించి రచయిత చక్కగా అక్షరాలుగా చెక్కిండు. కాంతారావు అమెరికా వెళ్ళినపుడు అక్కడి హెూటల్ యాజమానులు 'కుక్కలు- ఇండియన్లకు' ప్రవేశం లేదు అని రాయడాన్ని వ్యతిరేకిస్తాడు. ఇట్లా రచయిత కథానాయకుడు ఇండియాలోనూ, అమెరికాలోనూ ఎదుర్కొన్న వివక్షను అక్షరబద్ధం చేసిండు.

"కాంతారావుది గుంటూరు ప్రక్కన పల్లె. పల్లెగాదు, పల్లె ప్రక్కన హరిజనవాడ. (హరిజన పదం వాడకాన్ని ఇప్పుడు నిషేధించారు) ఇతరుల దృష్టిలో హరిజన వాడేగాని అది రెండుగా చీలి వుంది. ఒకటి మాలవాడ, రెండవది మాదిగవాడ. మాల వాడకు చెందిన వాడు కాంతారావు" అని కథా నాయకుడి గురించి చెబుతాడు.

అదే సమయంలో కథా నాయకుడు కాంతారావు తన ఊరు (గుంటూరు పక్కనే ఉండే ఊరు)లో యువకుల కోసం రాత్రి పాఠశాల నిర్వహించడం, మాల-మాదిగ మధ్యన మైత్రి కోసం ప్రయత్నించడం, దళిత బాలికల విద్య కోసం కృషిచేయడం, గ్రంథాలయోద్యమంలో నేరుగా పాల్గొనడం కూడా రాసిండు.

దళితులే ఎక్కువగా కమ్యూనిజం వైపు మళ్ళిన విషయాన్ని కూడా నరసింహం గారు రాసిండ్రు. "మనదేశంలో హరిజనులు కమ్యూనిజం వైపు మొగ్గు చూపినంతగా మరే జాతీ చూపదు. కమ్యూనిజంలో సమతాభావం వుంది. అది బీద వర్గాల పక్షం వహిస్తుంది. కర్షక కార్మిక పక్షంగా వుంటుంది. కుల మతాలుండరాదని ఆచరణ రీత్యా చూపుతున్న పార్టీ అది అప్పట్లో" అని ఆనాటి కమ్యూనిస్టు పార్టీ గురించి చెప్పిండు.

> **పుండు మీద కారం చల్లినట్లుగా పాలకుల దుర్మార్గం కూడా తోడయింది. నిజాం రాజ్యాన్ని సైన్యాలు మూడు దినాల్లోనే స్వాధీనం చేసుకోగానే యూనియన్ ప్రాంతాల నుండి, ముఖ్యంగా మద్రాసు రాష్ట్రం నుండి అడ్మినిస్ట్రేషన్ కోసం కొందరు డిప్యూటి తహసిల్ దార్లను తహిసిల్‌దార్లుగాను, తహసిల్‌దార్లుగా వున్న వారిని డిప్యూటి కలెక్టర్లుగానూ, సబ్ ఇన్‌స్పెక్టర్లను ఇన్‌స్పెక్టర్లుగానూ, ఇన్‌స్పెక్టర్లను డిప్యూటి సూపర్నెంట్లుగాను ప్రమోషన్ ఇచ్చి తెలంగాణాకు పంపారు. నిజాం రాష్ట్ర ఉద్యోగుల్లో అధికాంశం ముస్లిములే గాబట్టి వారి చేతుల్లో అణగారిపోయాం అనుకుంటున్న గ్రామీణ హిందూ ప్రజానీకం యీ అడ్మినిస్ట్రేటర్లను చూచి ఎంతో ఆనందించి హృదయత: స్వాగతం పలికారు. దేవుళ్ళను చూచి మొక్కినట్లుగా నమస్కారం చేస్తూ, ఇక తమ కష్టాలు శాశ్వతంగా తొలగి పోయాయని భావించారు.**

అట్లాగే గాంధీ హత్య గురించి కూడా ఇందులో రాసిండు.

"త్వరగా భోంచేసి పాఠశాలకు వెళ్ళాలని భోజనం ముందు కూర్చున్నాడు. అన్నం కలిపి ముద్ద నోటికెత్తబోతున్నాడు. సోమన్న గసపెట్టుకుంటూ పరుగెత్తుకొని వస్తున్నాడు. కన్నీళ్ళు కారుతున్నాయి. ఏడుస్తూ గాద్గదిక స్వరంతో చెప్పబోతున్నాడు. మాట పెగిలి రావడం లేదు. కాంతారావు గాభరాగా "ఏమిటిది సోమన్నా?" అన్నాడు. అతి ప్రయత్నంతో "గాంధీజీ హత్య" అన్నాడతను. ఏం వింటున్నాడో కాంతారావు అన్నం అట్లానే వదిలేసి లేచాడు. "ఏమిటంటున్నావ్?" అన్నాడు నమ్మనట్లుగా.

"గాంధీజీని హత్య చేశాడు ఒక మత మూర్ఖుడు?"

"ముస్లిమేనా"

"ఛీ! ఛీ! హిందువే. ఒక కులతత్త్వవాది."

అంతే! చెయ్యి కడుక్కొని యాంత్రికంగా మౌనంగా గుంటూరు పరుగెత్తారు. గుంటూరులో ప్రతి రేడియో కూడా విషాద సంగీతం వినిపిస్తున్నది. 'రఘుపతి రాఘవ' అని ఆలాపన చేస్తున్నది." (చీకట్లో కాంతిరేఖలు: 56) అని గాంధీ హత్యను రికార్డు చేసిండు.

★ ★ ★

1948లో తెలంగాణలో సాయుధ పోరాటం ఊపందుకోవడంతో తన స్ఫూర్తిప్రదాత 'దాసు పంతులు'తో పాటు స్వయంగా తుపాకి పట్టిండు. నైజాం సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. ఈ సందర్భంగా దాసుపంతులు పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాయపడిండు. అట్లాగే సూర్యాపేటకు దగ్గరలోని జగన్నాథపురంలో రజాకార్లు దోపిడికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకొని సాయుధ కమ్యూనిస్టులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే రజాకార్లు గడీలో దొరను చంపేసిండ్రు. ఆయనతో పాటు ఇంట్లో

వ్యాసం

ఉన్నవారినందరిని చంపేసింద్రు. అయితే కాంతారావు సాహసంతో వ్యవహరించి అక్కడ చిక్కుకు పోయిన భూస్వామి కూతురు శశిని రక్షిస్తాడు. తర్వాత ఆమెను సంస్కరణ భావాలు గల పోలీసు దంపతులు గుంటూరులో తమ దగ్గరే ఉంచుకొని చదివిస్తారు. స్థూలంగా ఇదీ కథ. అయితే ఇందులోనే ఎన్నో ఉపాంగాలను అంతటి నరసింహం చేర్చిండు.

సాయుధ పోరాట కాలం నాటి తెలంగాణ ప్రజల జీవితాలను చాలా చక్కగా అక్షరబద్ధం చేసిండు. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని, ఆంధ్రా అధికారుల దోపిడీ మనస్తత్వాన్నీ చిత్రించిండు. తెలంగాణ ప్రజల పట్ల పూర్తి సానుభూతి, సహానుభూతితో రాసిండు. పోలీసు చర్య నాటి జీవితాలను ఇట్లా చిత్రించిండు. "తెలంగాణ ప్రజానీకం చాలా వెనుకబడిన సమాజం. దారిద్ర్యంలో అజ్ఞానంలో మునిగి ఎన్నెన్నో కష్టాలను తమ పూర్వజన్మ కర్మ అనుకుంటూ అనుభవించిన అమాయక జనం. కమ్యూనిస్టు అండా, వారు స్థాపించిన గ్రామ రాజ్యమూ కొంత ఊరట కలిగించినా ఎప్పుడూ సింహ వ్యాఘ్రాది క్రూర జంతువుల భయంచేత నిత్య జాగరూకతతో ప్రవర్తించే జింకల్లాగా భూస్వాములా రజాకార్లా దాడులను శంకిస్తూ వుండే నిస్సహాయ జనం. సైన్యాన్ని చూచి ఆనందించిన యీ జనం వారి ఘాతుక చర్యలను చూచి నిర్వేదం పొందింది.

పుండు మీద కారం చల్లినట్లుగా పాలకుల దుర్మార్గం కూడా తోడయింది. నిజాం రాజ్యాన్ని సైన్యాలు మూడు దినాల్లోనే స్వాధీనం చేసుకోగానే యూనియన్ ప్రాంతాల నుండి, ముఖ్యంగా మద్రాసు రాష్ట్రం నుండి అడ్మినిస్ట్రేషన్ కోసం కొందరు డిప్యూటి తహసిల్ దార్లను తహిసిల్‌దార్లుగాను, తహసిల్‌దార్లుగా వున్న వారిని డిప్యూటి కలెక్టర్లుగానూ, సబ్ ఇన్‌స్పెక్టర్లను ఇన్‌స్పెక్టర్లుగానూ, ఇన్‌స్పెక్టర్లను డిప్యూటి సూపరిండెంట్లుగాను ప్రమోషన్ ఇచ్చి తెలంగాణాకు పంపారు. నిజాం రాష్ట్ర ఉద్యోగులలో అధికాంశం ముస్లిములే గాబట్టి వారి చేతుల్లో అణగారిపోయాం అనుకుంటున్న గ్రామీణ హిందూ ప్రజానీకం యీ అడ్మినిస్ట్రేటర్లను చూచి ఎంతో ఆనందించి హృదయత: స్వాగతం పలికారు. దేవుళ్ళను చూచి మొక్కినట్లుగా నమస్కారం చేస్తూ, ఇక తమ కష్టాలు శాశ్వతంగా తొలగి పోయాయని భావించారు. కాని వ్యక్తి, వ్యక్తి స్వార్థ చిత్తుడై, వ్యక్తి స్వార్థం కులస్వార్థం అనే మురికి గుంటల్లో నివసిస్తూ యీ అధికారి మండూకాలు నాలుకలు చాచి చిన్న చిన్న కీటకాల్లాంటి యీ జనంపై బడి భక్షించసాగారు.

ఇదివరకటి వారు దండయాత్రలాగా వచ్చి పాడు చేసి వెళ్ళిపోయారు. ఇపుడు వచ్చిన వీరు స్థిరంగా ఒక చోట వుండి నిదానంగా భక్షింపసాగారు. లంచగొండితనం ఎంత పరాకాష్ఠ నందుకుందో ఆ ప్రజలకు అర్థమయింది. యూనియన్ అడ్మినిస్ట్రేటర్ల ధనదాహం చెప్పనలవి కానిది. అక్కడ వున్న భూస్వాములపైనా బలహీనవర్గాలపైనా వివక్ష లేకుండా పడి దోచుకోవడమే వారి పని! ప్రతివాడూ వాడికి తగిన విధంగా దోచుకోవడమే. సర్వభక్షకుల్లాగా తయారైపోయారు. ఇక వీరి కామదాహం వర్ణనాతీతం. హిందూ ముస్లిం భూస్వాముల యిండ్లలో వచ్చి పసుపు కొమ్ముల్లాంటి అందమైన ఆడవాళ్ళనూ తటస్థపడిన ఆడవాళ్ళనూ బొమ్మల్లాగా వుపయోగించుకున్నారు.

ఇది వరకు రజాకార్ల క్రౌర్యానికి తట్టుకోలేక యూనియన్ ప్రాంతాలకు పారిపోయిన వాళ్లంతా తిరిగి తెలంగాణలోకి నిర్భయంగా ప్రవేశించారు. తీరావచ్చి ఇక్కడి పరిస్థితులు చూచి విస్తుపోయారు. యూనియన్ ప్రాంతాల్లో ముఖ్యంగా గుంటూరు బెజవాడ మొదలైన పట్టణాల్లో ప్రాణాలను అరచేత బట్టుకొని పారివచ్చిన తెలంగాణ వారినుండి బాడుగలు అధికంగా లాగడం ద్వారా

**"త్వరగా భోంచేసి పాఠశాలకు వెళ్ళాలని భోజనం ముందు కూర్చున్నాడు. అన్నం కలిపి ముద్ద నోటికెత్తబోతున్నాడు. సోమన్న గసపెట్టుకుంటూ పరుగెత్తుకొని వస్తున్నాడు. కన్నీళ్ళు కారుతున్నాయి. యేడుస్తూ గాద్గదిక స్వరంతో చెప్పబోతున్నాడు. మాట పెగిలి రావడం లేదు. కాంతారావు గాభరాగా "ఏమిటిది సోమన్నా?" అన్నాడు. అతి ప్రయత్నంతో "గాంధీజీ హత్య" అన్నాడతను. ఏం వింటున్నాడో కాంతారావు అన్నం అట్లానే వదిలేసి లేచాడు. "ఏమిటంటున్నావ్?" అన్నాడు నమ్మనట్లుగా.**

అధిక ధరలకు మోసంగా వస్తువుల నమ్మడం ద్వారా దగా చేయడం చూచిన యీ శరణార్థులు తిరిగి వచ్చి, తమ వారంతా అధికార్ల చేతుల్లో అనుభవిస్తున్న కడగండ్లను చూచి విస్మయం చెందారు. అదే అప్పటి నుండే ఆంధ్ర ప్రాంతం వారంటే తెంగాణ వారికి మంటలెత్తడం మొదలు.'' (చీకట్లో కాంతిరేఖలు: 110-111)'' దీన్ని బట్టి ఆనాటి ఆంధ్రాధికారుల అఘాయిత్యాలు, దోపిడి, దౌర్జన్యం తెలుసుకోవచ్చు. ఇట్లాంటివే అనేక సంఘటనలు అంతటి నరసింహం గారు ఈ నవలలో రాసింద్రు. మదరాసు పట్టణంలో దళితులకు కిరాయికి ఇండ్లు ఇవ్వని విషయాన్ని, దళితులకు బుద్ధి చెప్పడం కోసం పొగాకు రైతులు సమ్మె చేస్తున్న వారిని బెదిరించడం. అత్యాచారాలకు ఒడిగట్టడం, అత్యాచారాలు చేసి అనివార్య పరిస్థితుల్లో దండుగలు కట్టి ఎట్లా దొరలు లైంగిక దాడికి దిగేవారో రాసిండు. కుల, మత తారతమ్యాలు, అవి పోవడానికి చేయాల్సిన కృషి, కులాంతర వివాహాల ప్రసక్తి ఇట్లా అనేక విషయాలు ఈ నవలలో ఆయన చిత్రించిండు.

★ ★ ★

వ్యాసం

**దళిత సాహిత్యంపై చరిత్ర, పరిశోధన, విమర్శ, పరామర్శల్లో ఈ నవల గురించి ఏ ఒక్కరిద్దరో తప్ప ఎవ్వరూ పేర్కొనలేదు. అదే సమయంలో ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపల్లి' నవలను ఇటు బ్రాహ్మణులు, అటు దళితులూ ఇద్దరూ చాలా చర్చ చేసింద్రు. అయితే బహుజనుడు ఒక గౌడ కులస్థుడైన అంతటి నరసింహం రాసిన నవలకు అటు దళిత సాహిత్య చరిత్రలోనూ, ఇటు విమర్శలోనూ పెద్దగా చోటు దక్కలేదు.**

"సమాజాన్ని నడిపించేది నీతి. నీతి అంటే, అదేదో పాతచింతకాయ పచ్చడి అనీ, వేదాంతులకు అవసరమైన పదం అనీ, అనుకోగూడదు. అది ప్రతినిత్యమూ సంఘావసరాన్ని బట్టి మారుతూ సమాజాన్ని ముందుకు నడిపించే చుక్కాని లాంటిది. నిత్యగమనం గలది.

ప్రతి వ్యక్తి జీవితమూ, సంఘర్షణమయమే. స్వార్థమయమే! స్వార్థం యెప్పుడూ అసూయా ద్వేషాలకూ, అక్రమ ప్రవర్తననూ, దారితీస్తూనే వుంటుంది. తత్ఫలంగా సంఘర్షణ జనిస్తుంది. ధనసంచయమూ, కామతృష్ణ, పరిశ్రమ చెయ్యకుండా సుఖజీవిత వాంఛా, భావితరాల సుఖజీవనం కోసం ఆస్తి కూడబెట్టడం వగైరాలు ఈ స్వార్థానికి ఆలంబనాలు" అని అంతటి నరసింహం ఈ నవలకు రాసిన ముందుమాటలో చెప్పిండు. అట్లాగే "ఈ సమాజంలో మనం జీవిస్తున్నాం. సమాజంలోని అందరికీ సమజీవనం అనుభవించాల్సిన హక్కుంది. అందుకు అవాంతరాలు యేర్పడితే వాటిని తొలగించుకోవలసిన హక్కుగూడా అందరికీ వుంది. అయితే అంత చైతన్యం అందరికీ వుండదు. అందుకే రచయితలు ఆ బాధ్యత వహించాలి. రచయితలు ఎప్పుడూ దూరదృష్టి గలవారు. వారికి బాధ్యతున్న విషయం వారు మరువరాదు." అంటూ రచయిత కర్తవ్యాన్ని కూడా చెప్పిండు.

ఆయన కర్తవ్య బోధనే గాకుండా ఆచరించి చూపించిండు. గాంధీ - అంబేడ్కర్ రాజకీయాలను, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్, ఎన్నికలు, కాంగ్రెస్, కమ్యూనిస్టు రాజకీయాలు, ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఇట్లా అనేక రాజకీయ విషయాలను ఈ నవల చిత్రికగట్టింది. కచ్చితంగా ఇది రాజకీయ నవలే. అయితే దళితులకు న్యాయమైన ప్రాతినిధ్యం కోసం కొట్లాడిన రాజకీయ నవల. ఆత్మగౌరం కోసం తండ్లాడిన నవల. ఏ జిల్లాలోనైతే సాయుధ పోరాటంలో తుపాకి పట్టుకొని పోరాటం చేసిండో అదే జిల్లాకు ఓ ఎనిమిదేండ్ల తరువాత ఐఎఎస్ అధికారిగా సబ్‌కలెక్టరుగా వచ్చిండు. దళిత ఐఎఎస్ దగ్గర అగ్రవర్ణాలకు చెందిన ప్యూను సైతం పనిచేయడానికి నిరాకరించిన వైనాన్ని అంతటి నరసింహంగారు రాసింద్రు. ఇట్లా నిజాయితీగా పనిచేసే అధికారులను శశి చిన్నాన్న ఎమ్మెల్యే జగన్నాథం లాంటి వారు అడ్డుకోవడం, ఆఖరికి అక్కడి నుంచి కాంతారావుని తబాదలా చేయించడంతో కథా నాయకుడు అంబేడ్కర్ మార్గమే సరైనది. కుల వివక్ష పోవాలంటే కులాంతర వివాహాలు జరగాలని అంతకు ముందు నుంచి చెబుతూ వచ్చాడు. అందుకే కాంతారావు ఇట్లా అభిప్రాయపడ్డాడు. "ఈ దేశంలో అంబేద్కర్ వాదమే బాగుందనుకున్నాడు. ప్రతీకారాగ్ని ప్రజ్వరిల్లింది. ప్యూనుపై కసిదీర్చుకోవాలనుకున్నాడు. డిస్మిస్ చేయాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా అనుకున్నాడు. వాడి వెనుకవున్న కులవ్యవస్థా, కుల పెద్దలు కారణంగాని వాడు గాదనుకున్నాడు. అయినా క్రమశిక్షణ కోసం చర్య తీసుకోకపోతే ఆ అవమానానికి తల ఒగ్గినట్లవుతుందని, ఎందుకు డిస్మిస్ చేయరాదో సంజాయిషీ యివ్వవలసిందిగా ప్యూనుకు వ్రాయించి పంపాడు" అని ఆనాటి తీరుపై రాసిండు.

స్వాతంత్ర్యం వచ్చిన పదేండ్ల తర్వాత కూడా సమాజంలో ఆశించిన మార్పు లేక పోవడంతో "ఈకుల వ్యవస్థ పాత కుబుసాన్ని విడిచి కొత్త రూపాన్ని ధరిస్తున్నట్లుగా కనిపిస్తున్నది. ఏ స్వార్థంతో అయితే యిది పుట్టిందో ఆ కారణాన్ని సమూలంగా నిర్మూలించాలి. రాజకీయ వ్యవస్థ ద్వారానే దీన్ని దెబ్బకొట్టాలి. మహిళా కళాశాల స్థాపన జరగ్గానే రాజీనామా యిచ్చి అయినా కులవ్యవస్థను దెబ్బతీయాలి. ఈ వ్యవస్థ వల్ల ఏ కులానికీ ఏ వర్ణానికీ మేలు లేదు కాబట్టి యిది వుండరాదు" అని అంబేడ్కర్ ఐడియాలజీ పట్ల అభిమానాన్ని కథానాయకుడి ఆఖరి మాటల్లో తన అభిప్రాయంగా అంతటి నరసింహం చెప్పిండు. దళిత సాహిత్యంపై చరిత్ర, పరిశోధన, విమర్శ, పరామర్శల్లో ఈ నవల గురించి ఏ ఒక్కరిద్దరో తప్ప ఎవ్వరూ పేర్కొనలేదు. అదే సమయంలో ఉన్నవ లక్ష్మినారాయణ రాసిన 'మాలపల్లి' నవలను ఇటు బ్రాహ్మణులు, అటు దళితులూ ఇద్దరూ చాలా చర్చ చేసింద్రు. అయితే బహుజనుడు ఒక గౌడ కులస్థుడైన అంతటి నరసింహం రాసిన నవలకు అటు దళిత సాహిత్య చరిత్రలోనూ, ఇటు విమర్శలోనూ పెద్దగా చోటు దక్కలేదు. ఇప్పటికైనా ఈ నవలను పునర్ముద్రించి దీనిలోని విషయాలను దళితులు, బహుజనులు అందరూ పట్టించుకోవాల్సిన అవసరమున్నది. అంబేడ్కర్ భావజాలం ఇంత విస్తృతి చెందిన తర్వాత కూడా అంతటి నరసింహంను విస్మరించడం అన్యాయం. అంబేడ్కర్ భావజాలాన్ని ప్రచారం చేయడం కోసం 1980లోనే రాసిన ఈ నవలను ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు.

అంతటి నరసింహం ఆదర్శాలు రాయడమే కాదు స్వయంగా ఆచరించిన వాడు. తాను కులాంతర వివాహం చేసుకోదలిచి అదే విషయాన్ని పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించాడు. ఆయనకు ఆ కాలంలో మూడు ఆదర్శాలుండేవి.

ఒకటి అస్పృశ్యతా నివారణ, రెండోది స్త్రీ విద్య, మూడోది కులాంతర వివాహం. ఆఖరికి అపరాజిత అనే అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నాడు.

అంతటి నరసింహం తాను రాసిన (కం)కాళరాత్రి అనే పద్య కావ్యాన్ని హైదరాబాద్ వాసి భాషా సేవకుడు ఉన్నతాధికారి, బహుజనుడైన మాటేటి రామప్పకు అంకితమిచ్చిండు. దీనికి తిరుమల రామచంద్ర ముందుమాట రాసిండు. ఈయన రాసిన ఆదర్శం నవల కూడా దళితుల జీవితాలను చిత్రించినదే!

1925 నవంబర్ 24వ తేదీన కడప జిల్లా కోడూరు తాలూకాలోని వెంకటరాజు పల్లిలో అంతటి సుబ్బమ్మ, పెంచలయ్య దంపతులకు జన్మించిన అంతటి నరసింహం తెలుగులో ఎం.ఎ చదవడమే గాకుండా 'ప్రబంధాలలో ప్రకృతి వర్ణనలు' అనే అంశంపై వెంకటేశ్వర యూనివర్సిటీలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. 1946 నుంచి 1976 వరకు అనేక కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ సెక్రెటేరియట్‌లో సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శిగా 1976లో నియమితులయిండ్రు. 1982 నుంచి వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సహాయ సంస్థ అభివృద్ధి అధికారిగా, అనంతరం ఎ.పి. వాషర్‌మెన్ ఫెడరేషన్ మొదటి చైర్మన్‌గా వ్యవహరించారు. హైదరాబాద్ మెహదిపట్నంలో నివసించిన ఈయన అక్టోబర్ 20, 2010 నాడు చనిపోయిండు. ఈయన (కం)కాళరాత్రి, నవసృష్టి, తాడితవ్యాఘ్రి, ఇప్పుడే, కాలవేదం, ఉషస్స్వప్నం, ఇరవై ఒకటో శతాబ్దంలోకి, అవతారాలమోసాలు అనే కావ్యాలు, ఆదర్శం, భావం, ప్రేమ భిక్ష, లేడి లెక్చరర్, స్వాగతం, శంపాలత, చీకట్లో కాంతిరేఖలు, శోభాదేవి, 'ఆప్ బీ తీ' (హిందీ) నవలలు రాసిండు. సహజీవనం, సమరసత్వం, మానవత్వం, పరిష్కారం, ఎక్కడి గొంగడి అక్కడేనా, మహిళా మహస్సు, వేలం వెర్రి, భువన విజయం, ముక్కంటి ముక్కోణం, నిత్య కళ్యాణి, ముల్లును ముల్లుతోనే ఆనే నాటకాలనూ రాసిండు. ఇంకా ఎంతో బాల సాహిత్యాన్ని సృజించాడు. తెలుగు సాహిత్యానికి ఇంతటి విశిష్టమైన సేవలందించిన అంతటి నరసింహం గురించి ఇప్పుడైనా విశ్వవిద్యాలయాల్లో పనిచేసేవారు దళితోద్యమకారులు, రాయలసీమ సాహితీవేత్తలు, బహుజనులు పూనుకొని ఏదయినా యూనివర్సిటీలో ఈ పుస్తకాన్ని పాఠ్యాంశంగా పెట్టించినట్లయితే ప్రాధాన్యత వస్తుంది. ఈ స్ఫూర్తితో మరింత మంది ఐఎఎస్‌లు తయారయ్యే అవకాశముంది. ఈ 312 పేజీల నవల త్వరలోనే పునర్ముద్రణ కావాలని కోరుకుంటూ..






# ఆర్గో

చిత్రం: **ఆర్గో** దర్శకుడు : **బెన్ అఫ్లెక్** భాష : **ఆంగ్లము**

దర్శకుడు బెన్ అఫ్లెక్ అర్గో చిత్రం 1979 లో జరిగిన ఇరాన్ నుండి అమెరికా దౌత్యవేత్తలను రక్షించే యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు.ఇరాన్ లోని టెహ్రాన్ లో చిక్కిన ఆరుగురు దౌత్యవేత్తలను రక్షించడానికి అమెరికా ఏజెన్సీ CIA రహస్యంగా చేసే ఆపరేషన్ పేరే ఈ ఆర్గో. ఆ ఆరుగురిని కాపాడడానికి చాలా ఆలోచనలు చేసి అనేక మార్గాలను అన్వేషించి విఫలమైన తర్వాత... ఒక సరికొత్త ఆలోచనతో ది ప్లానెట్ అనే చిత్రం తెరక్కెక్కిస్తున్నట్టు అందరిని నమ్మించి చిత్రం షూటింగ్ లొకేషన్స్ చూడటానికి వచ్చానని చెప్పి ఆరుగురిని వేరే పేర్ల ద్వారా విమానాశ్రయంలో ఎవరికి అనుమానం రాకుండా ఆ ఆరుగురికి సినిమాపై అవగాహన కల్పించి టెహ్రాన్ నుండి రక్షిస్తారు. ఈ మొత్తం కథలో ప్రతి సన్నివేశం ఉత్కంఠ భరితంగా ఉంటుంది. ప్రతి ప్రేక్షకుడు కథలో లీనమవుతారు చివరి వరకు ప్రేక్షకులు ఆందోళనకు లోనయ్యేలా అద్భుతమైన స్క్రీన్-ప్లేతో చిత్రం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తుంది. అలాగే ఈ చిత్రంలో సంగీతం ప్రత్యేక ఆకర్షణగా ప్రతి ధ్వని ప్రేక్షకులను ఆకట్టుకుంది. దర్శకుడు బెన్ అఫ్లెక్స్ ఈ చిత్రంలో ప్రధాన కథానాయకుడిగా నటించారు. తన నటనతో ఉత్తమ నటుడిగా కూడా ఆస్కార్ అవార్డ్ పొందారు.

**ప్రతి ప్రేక్షకుడు కథలో లీనమవుతారు చివరి వరకు ప్రేక్షకులు ఆందోళనకు లోనయ్యేలా అద్భుతమైన స్క్రీన్-ప్లేతో చిత్రం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తుంది.**




## Joe Biden:
### American Dreamer

జో బైడెన్...అమెరికా అధ్యక్షుడిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించాడు. గతేడాది జరిగిన ఎన్నికల్లో ప్రత్యర్థి డోనాల్డ్ ట్రంప్ ను ఓడించిన జో బైడెన్, అమెరికా 46 వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. జో బైడెన్ వ్యక్తిగత, రాజకీయ జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను Joe Biden: American Dreamer రూపంలో వివరించారు రచయిత ఇవాన్ ఓస్నోస్. తను కుటుంబ నేపథ్యం, కష్టనష్టాలు, రాజకీయ ప్రయాణం గురించిన అనేక ఆసక్తికర అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

## M. Rajshekar
### Despite the State

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యం, పరిపాలన, రాజకీయ వ్యవస్థ ఏవిధంగా ఉందనే అంశాలపై Despite the State అనే పుస్తకాన్ని రచించారు రచయిత ఎం. రాజశేఖర్. దాదాపు 33 నెలల పాటు మిజోరాం, తమిళనాడు, ఒరిస్సా, గుజరాత్, పంజాబ్, బీహార్ రాష్ట్రాల్లో పర్యటించిన రచయిత, క్షేత్రస్థాయి వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజల జీవన విధానాలు, మౌలిక వసతులు, రాజకీయ వ్యవస్థ పనితీరు వంటి అంశాలను ఈ పుస్తకంలో వివరించారు.







## Her Right to Equality:
### From Promise to Power

Rethinking India series లో ఆరవ భాగంగా Her Right to Equality: From Promise to Power పుస్తకాన్ని రచించారు నిషా అగర్వాల్. భారతదేశంలో లింగ సమానత్వం, మహిళా స్వేచ్ఛ అంశాలను ఈ పుస్తకంలో చర్చించారు. దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల్లో మహిళల పాత్ర చాలా తక్కువగా మాత్రమే ఉండటానికి గల కారణాలను ఈ పుస్తకంలో విశ్లేషించారు రచయిత నిషా అగర్వాల్. లింగ అసమానతలకు గల కారణాలను ఈ పుస్తకంలో చర్చించారు.




## The Automobile:
### An Indian Love Affair

భారతదేశంలో ఆటోమొబైల్ ఇండస్ట్రీ చరిత్ర, వాటికున్న ఆదరణను The Automobile: An Indian Love Affair పుస్తకంలో వివరించారు జర్నలిస్ట్, రచయిత గౌతమ్ సేన్. గత వందేళ్లుగా, దేశ ఆటోమొబైల్ రంగంలో వస్తున్న మార్పులు, ప్రజల జీవన విధానంపై దాని ప్రభావాన్ని ఈ పుస్తకంలో ఆసక్తికరంగా వివరించారు. దేశ ఆటోమొబైల్ రంగంపై తన అనుభవాలను, క్షేత్ర స్థాయిలోని వాస్తవ పరిస్థితులను రచయిత ఈ పుస్తకంలో పొందుపరిచారు. దేశ ప్రజలకు వాహనాలపై గల అమితాసక్తికి గల కారణాలను సైతం ఇందులో చర్చించారు.

నాటి కథ

# అంగుడు పొద్దు

నాటి సమాజంలో వివక్షను చెప్పిన కథ....

జి. సురమౌళి

"ఏమోయ్ మల్లయ్యా! పట్నం బోయినవేమో? ఎప్పుడస్తివి? ఏమేం జూసచ్చినవు? మీ సబలెట్ల జరిగె గింత జెప్పవ్?" పనిదీరి కూకున్న పటేలు మల్లయ్య నడిగిండు.

"ఏం జెప్పమంటవ్ పటేలయ్యా, మా పెద్ద సబ జెప్పిందు! అబ్బ ఏం జనం ఏం జనం! ఓ పెద్ద తీరుతమోలె ఉన్నదనుకో"

"ఎంత సేపాయె నువ్వచ్చి, బుక్కెడంత సల్లపడె వత్తన్నావా."

"ఇంటికోయి సల్లపడే వత్తాన్న బుక్కెడు. గింతగ్గిపుల్లుంటిత్తారు సుట్టేసుకుంట"

పటేలయ్య అగ్గిపుల్ల యియ్యంగనే సుట్టమీద అగ్గి పెట్టుకొని. మోకాల్లకు రుమాలు జుట్టుక కచ్చీర్ల కూకున్న మల్లయ్య సుట్టదాక్కుంట చెప్పుతాండు. తాను పట్నంల జూసివచ్చిన పెద్ద సబ సంగతి.

"నాలుగు రోజుల ముందుగనే నేనీ ఊల్లకెల్లి ఎల్లిపోయిన్నా? నా అసుంటోల్లు - ఓ యాభైమందచ్చింద్రు... మేమందరం గలిసో రెండెకరాల మైదానం సాపుజేసుట దలిగినం. అన్నిన్న ముల్ల పల్లేరుగాయలు ఏరి. గడ్డి జెక్కి ఊడ్చి ఆ మైదాన్ల ఓ పెద్ద పందిరేసినం.

పెద్ద పెద్ద బొమ్మలు పటాలు పరదాలు గట్టి సర్గమోలిగి జేసినమా మైదానాన్ని అంతకు ముందాడ పందులు మేసేటియి. పందిర్లేసిన మోలె బంగలాల్లగూడ అంత సుకముందడ నిపించింది. సర్గమే అనుకో. రాత్రనక పగలనక, యాల్లపూట నిద్దర్లేక యాలక్కూడులేక పనిజేత్తె రేపు సబనంగ అన్ని తయారైపోయినయి. ఆనాడు మాత్రం కంటికి కూరుకు రానిచ్చిందా? ఆగుల పంటుర్కి పర్రెల్దీయ మనిరి. ఎండాకాలమాయె. అచ్చెటోల్లందరికి నీల్లెట్ల? ఇంజనపెట్టి పంపుల్లోని పల్లెల్లనుంచి పాకల్లకు నీల్లు దెస్తిమి. ఇగ సబ నాడు ఆ పందిట్ల కూకుండి ఆల్లు జెప్పే మంచిమాటలేమన్న ఇందామంటే సాగనిచ్చింరా? అచ్చిన పెద్ద పెద్ద దొరలు ఆ నల్లలకెల్లి పంపుల్లచ్చిన ఉడుకునీల్లు దాగెటోల్లు గాకపోయిరి. పెద్ద పెద్ద కడవలు దెచ్చి నీల్లు నింపి పెట్టినం. ఓ నూరు కొత్త కడవలు నింపుదుం రోజు తెల్లారంగనె. ఇగ సబ మొదలయితదనంగ మాత్రం మమ్ముల్నందర్ని పనిడిసి పెట్టి అల్లతోని ఊరవలిదాంక మేమూ ఊల్లున్నోల్లు, అందరం గలిసిపోయినం. అయిన పేరేందో ఆ పెద్ద దొరచ్చిండు. ఆనాడు మన కచ్చీర్ల కాయిదం గొట్టలే? ఆ కాయిదంల ఉన్న దొర. ఆయన్ని పందిట్లదాంక "జై" "జై" అనుకుంట దెచ్చినం. పందిట్ల కాయినె అడుగు పెట్టంగనే మమ్ములను దోలుకొని అంటకాడికి దిసుకపోయిరి. ఆడ నీల్ల నింపుడు, ఇత్తార్లేసుడు. ఊడ్చుడు. దీంతోనే సరిపాయె. ఒక్కమాట సబల జెప్పిందింటె ఒట్టు. రోజు ఎంతమంది తింటాండిరో ఏమొ? అంతమంది యాడ్నుంచి అచ్చింరో ఎమో?, ఒక్కొక్క బంతికి మున్నూరుమంది దాంక లేత్తాండిరి. అసుంటియు పూటకు ఇరువయి బంతుల్లేసెటియి. బంతికి కూకుండగనే ఇత్తార్లేసుడు. అల్లందరికి నీల్లుపోసుడు, అల్లు లేవంగనే ఆ ఇత్తార్లు దీసుడు. మల్లా ఇంకొగబంతి. ఇట్ల యిరువయి బంతుల్లేసెటాల్లకు పొద్దంగు. మేం బుక్కెడు దిని లేస్తుం, సుట్ట ఓ బుక్కు దాగుదుమొ లేదా మల్ల మొదటి బంతోల్లు ఇంకో పూటకు తయార వుదురు. ఇగెప్పుడు దీరాలె, అందరు రెండుపూటలు తినెటాల్లకు నాత్తిరి రెండు జాములౌ. ఇట్ల సబ జరిగిన మూడు రోజులు పెద్ద పెద్ద దొరలచ్చి మంచి మంచి మాటలు జెప్పుతాంరనేగాని, ఒక్క మాటిన్న పాపాన పోలేదు. అన్నందుకు ఆకరునాడు. అదేం సబనో రెండు జాముల్నాత్తిరికి మొదలు పెట్టింరు. ఆ నాత్తిరి వొదామన్నా పందిట్లకు పోనియ్యకపోయిరి. కట్టెపట్టుకొని ఎవడో లోపలకు పోయె పోరగాడు అడ్డగిచ్చె, లోపలికెల్లి ఎవరో ఉరికచ్చి నన్నాడజూసి బల్ల మీద జంపుకానాలు దులుపాల్నని, నన్ను దోలుకపాయె. న్యాలమొ

అన్యాలమొ, జంపుకానాలు దులుపవోయినోన్ని ఇగాన్నే కూకున్న. మొట్టమొదటు ఎవలో ఒకాయినె కన్లకద్దాలు బెట్టుకున్నడు, హరిదాసోలిగే శెల్లాగప్పుకున్నడు: లేసి పుత్తకాలు రాసెటోల్లకని ఏమేమొ జెప్పిండు. పుత్తకాలల్ల దరిద్రుల కతలుండాల్నట. ఎవడు జదువతడు పటేలా? మరి మాకేమొ సదువే రాకపోయె. సదువచ్చినోల్లెమొ దరిద్రులెగాకపోయిరి. అయినాయినె, పుత్తకాలు రాసెటోల్లకు చెప్పిండు. ఇని ఆల్లు సప్పట్లుగొట్టింరు. నడుమ నాకెందుకు, ఆ మాటజెప్పి అయినె గూకుండగనే ఇగ పాటలు జదువుడు మొదలు పెట్టింరు. సుక్కవొడిసెందాంకా దెగలేదు. ఒక్కొక్కలేరా వత్తరు. ఒకటో రెండో పాటలో పదాలో జదువుతరు. దిగుతరు. దిగినోడు మల్ల ఎక్కడు. ఇట్ల తెల్లారగట్లదాక జదివినోడు మల్ల జదువకుండ జదివింరె పాటలు, నాత్తిరాయె ఏం పనిలేకపాయెనని పోయికూకున్న తపుల, తాలం ఆర్మొని, మద్దెల, ఏది లేకుండగనె జదువుతాంరు. ఒగలో రాగంల జదివితే ఇంకోలింకో రాగంల జదివిరి. అయ్యన్ని ఆల్లు గట్టిన కయిత్తాలట. అయితే రాగం లేకుండ జదువాన్నా? మనూరు పొట్టిలింగడు కయిత్తం గడితె ఏం కమ్మగ జదువుతడు. తాళం లేకపోతే మానాయె. చేతులున్నయిగదా? చప్పట్లు గొడితే అరిగిపోతాయి? పాటలంతా అయిపోయినాంక అందరు గొడ్తరేమొ చప్పట్లు? తాలం గలిసెటట్లు ఆల్లకు గొట్టరాదా?'' ఎరుకలేని మల్లయ్య పటేలయ్యకేమన్న ఎరుకనేమొ అని అడిగిండు.

"కాదోయి పిచ్చిమల్లయ్య. అంతయిపోయినమాలిగె చప్పట్లు గొడితె, ఆల్లు చదివింది మంచిగున్నదన్నట్లు'' పట్నం పోయిన మల్లయ్యకు తెలువజెప్పిండు పల్లెటూరి పటేలు. "గట్లనా. మరె అన్నిటికి గట్లనె కొట్టింరు. అన్ని మంచిగున్నయనేనా ? ఏమొ అల్లుగొట్టిన కొద్ది నేను గొట్టిన. దొమ్మరాట జూడంగ గొట్టినట్లు, తెల్లారగట్లదాక అట్లనే పాటలిను కుంటగూకున్న. ఇగ తెల్లారినమోలె అందరు ఎల్లపోతాంరు. అందరికి బిస్తర్లు కట్టాలె. ఆల్ల బిస్తర్లన్ని లారీలల్లనింపి ఆల్లందరిని శేసనకు సాగదొలెదాంక నిద్దురవోలె. ఆల్లందరెల్లిపోంగనే ఆనాడు నాత్తిరి దాక పందిల్లిచ్చుట్ల బెట్టింరు. ఒక్కపూటల అంత ఇచ్చపెట్టినం. నాలుగు రోజులు కట్టపడి తయారుచేసిన పందిరి ఇచ్చుడుకుదప్ప మాకెందుకక్కరి కచ్చినట్టు..? మల్లయ్యడిగిన ఈ పెద్ద ప్రశ్న. వేడుక బొమ్మరిండ్లసుకలో బాగొప్ప నిర్మించి'' పటేలయ్య నీ పద్దెం జదివెటట్టు జేసింది. "ఏదో మనకోసం రజాకారోల్లను ఎదుర్కొని రాజ్జం సంపాయించి పెట్టి సబలు జేసుకుంటున్న పెద్ద పెద్దగ సదువుకున్నోల్లకు మే చేయగలినంత రెక్కలకట్టం జేత్తనే ఉన్నం. పనంత అయిపోయినమోలె నాలుగు జొన్న రొట్టెలు సద్దిగటిచ్చి సాగదోలింరు?'' మల్లయ్య చెప్పిన సబ సంగతి పటేలయ్య బాగానే ఇన్నడు. కాని పటేలయ్య యినాలనుకున్నది, సబల జెప్పిన మాటల సంగతి. అది మల్లయ్య కేమెరుక? ఇంతలకె "ఏం పంతులుగారూ? అంతా బాగేనా?'' అనుకుంటచ్చిండు ఆ వూరి ఎంకయ్య అయ్యో అయ్యోరెంకయ్యగూడ సబ జూడ వోయిండు పట్నం. మల్లయ్యంత ముందగపోలేదుగాని, మల్లయ్యకంటే ముందుగనే వచ్చిండు. "ఎంకయ్య పంతులు తోటి ఇయ్యాలీపు మాటే బంగారమై పోయింది. మల్లయ్యా,

**రాత్రనక పగలనక, యాల్లపూట నిద్దర్లేక యాలకుాడులేక పనిజేతే రేపు సబనంగ అన్ని తయారైపోయినయి. ఆనాడు మాత్రం కంటికి కూరుకు రానిచ్చిందా? ఆగుల పంటుర్కి పరైర్దీయ మనిరి. ఎండాకాలమాయె. అచ్చెటోల్లందరికి నీల్లెట? ఇంజనపెట్టి పంపుల్లోని పలెల్లనుంచి పాకల్లకు నీల్లు దెస్తిమి. ఇగ సబ నాడు ఆ పందిట్ల కూకుండి ఆల్లు జెప్పే మంచిమాటలేమన్న ఇందామంటే సాగనిచ్చింరా? అచ్చిన పెద్ద పెద్ద దొరలు ఆ నల్లలకెల్లి పంపుల్లచ్చిన ఉడుకునీల్లు దాగెటోల్లు గాకపోయిరి. పెద్ద పెద్ద కడవలు దెచ్చి నీల్లు నింపి పెట్టినం.**



నాటి కథ

పట్నాలకు పోతాండు సబలల్ల దిరుగుతాండు. మన సంగతి మరిచిపోతాండు.'' పటేలయ్య తాను ఎంకయ్యపంతులు కిచ్చిన దానాలన్ని యాదికచ్చెటట్టున్నడు "మీరు గూడా అలాగే అంటెట్ల పటేలుగారూ? మీ నీడన్నే మేం బతుకులు వెళ్ళబోసుకుంటు ఉంటిమి. మీరేంది మల్లయ్య ఏంది . మీరందరి క్షేమము మా బతుకు, మిమ్ములను మరిచిపోతే ఎట్ల?'' నక్కవినయం జూపిచ్చుకుంటున్నడు అయ్యోరు. "ఏదో అట్లన్నగని, పట్నం సబకు పోతివి సంగతులు జెప్పవు. మల్లయ్య నడుగుతె ఇంతసేపు ఏమేమో జెప్పిండు. ఆల్లు చెప్పిన మాటలు ఒక్కటి జెప్పలేదు.'' కోరికదీరని పటేలు ఎంకయ్య నడిగిండీమాట.

"ఐతే అయ్యగారూ మీరుగూడచ్చి నారుంట్రి సబలకు?'' ఊరోడు వచ్చి కలువకుంట పోతడా అనుకునే మల్లయ్య అడిగిండు. ఆ ఆ నిన్నుగూడ జూచిన, నువ్వు నాకు మా కనుపడ్డవు. నువ్వే నన్ను జూల్లేదు.'' అయ్యగారు మల్లయ్యమీదనే తప్పంత మోపాల్నని జూసిండు. "నేను సూడకుంటే సూడకపోతి. సూసినోల్లు మీరన్న పిలుత్తే మాట్లాడకపోదునా?'' మల్లయ్యడిగిన సవాలుకు అయ్యోరెంకయ్య దగ్గర జవాబులేదు. అయ్యో రెంకయ్య పాపం పట్నంల మల్లయ్యను మాట్లాడియ్యాలని మా అనుకున్నడు. కాని తన చుట్టున్న సోపతిగాన్లు నల్లబట్టలతోనున్న మల్లయ్యతోని మాట్లాడుతాంటే జూసి నవ్వుతరేమొ ననిపిచ్చి ఊరుకున్నడు. ఆ సంగతి మల్లయ్యకు కొంత అనుమానమే అయింది. తనను తనూరి ఎంకయ్యనే చిన్నచూపు జూసిండనుకునెటాల్లకు మల్లయ్యకాడుండ బుద్ధిగాలె. పొద్దంగుతుంది. మల్లయ్యకు ఇంట్ల నాగండ్లు గట్ట జూసుకోవాలె. ఈడుంటే ఇగ ఎంకయ్య చెప్పే సంగతి ఇనాలె. పట్నం వేటికోసం బోయిండో ఆ సబల

**పుత్తకాలల్ల దరిద్రుల కతలుండాల్నట. ఎవడు జదువతడు పటేలా? మరి మాకేమొ సదువే రాకపోయె. సదువచ్చినోల్లైమొ దరిద్రులెగాకపోయిరి. అయినాయినె, పుత్తకాలు రాసెటోల్లకు చెప్పిండు. ఇని ఆల్లు సప్పట్లుగొట్టిరు. నడుమ నాకెందుకు, ఆ మాటజెప్పి అయినె గూకుండగనే ఇగ పాటలు జదువుడు మొదలు పెట్టిరు. సుక్కపొడిసెందాంకా దెగలేదు. ఒక్కొక్కలేరా వత్తరు.**

సంగతే. ఆడికిబోయినా అందని సబలసంగతి మల్లయ్యకీడెందుకు? మల్లయ్య అన్నుంచెల్లిపోయిండు. పొద్దు అంగుతుంది. తల్లి కడవులకు ఎత్తువడుకుంట.

కవిత



# దయావిహీనం

సొంత సుఖాల నెమరువేత
స్వీయ విజయాల ఆలాపన
ఒక్క నిట్టూర్పు మీదికైనా
ఆర్తితో వంగని అంతరంగం
ఇవేనా మన ప్రస్థాన పరమార్థానికి చిహ్నాలు

చెమ్మకు దూరమైన కన్ను
మందభాగ్యుల మీద
మమతను వర్షించలేని పెన్ను
చెలరేగుతున్న విలయం నడుమ

వికలం కాని కరుణలేమి
ఇవేనా మన ధ్యేయానికి
నిలువెత్తు సూచికలు

మన సంక్షేమమే బరువు
పేదల బాధలకు స్పందన కరువు
సమాధి అవుతున్న న్యాయానికి
సాక్షిగా నిలుస్తున్నా
సంతృప్త మానసంతో మనుగడ
ఇవేనా మానవజీవన లక్ష్యసాధనకు
అవసరమైన ఆచరణలు



ఎలనాగ

# ధనము - రూపము

## నూతనకవి సూరన - ధనాభిరామం

ధనాభిరామం అనేది కొత్తగా కల్పిత కావ్యం. నూతనకవి సూరన క్రీ.శ.1450 ప్రాంతం. తల్లిదండ్రులు పార్వతమ్మ తిప్పన. దేవరకొండ పరిసరాలలో ప్రాంతం. తిక్కన వంశస్థులు బంధువులు. ఆరాధ్యులు వీరభద్రులు గురువులు. నూతనకవి అనేది బిరుదం. సమాజంలో మనిషికి కావలసింది ధనమా? రూపమా? అనే అంశంపై దేవతలకు చర్చ జరిగింది. అది తెల్చుకోవడానికి రంభను ధనవంతుల దగ్గరకు, రూపవంతుల దగ్గరకు పంపించారు. చివరికి ద్రాక్షారామ భీమేశ్వరుడే ప్రత్యక్షమై రెండూ అనవసరమేనని ఈ విషయమై తగవువద్దని చెప్పాడు. ఒక సామాజికాంశంగా దేవతలను పాత్రలుగా చేసిన సరికొత్త కల్పన. పద్యాలు సరళంగా అందరికీ అర్థమయ్యే విధంగా ఉండటంతో పాటు ఆలంకారికంగా ఉన్నాయి.

రూకగలవారు విద్యల రూఢిమించి
నట్టి వారును కులజులు నధమ వృత్తి
ధనముగలవారి వాకిండ్ల ధైర్యముడిగి
కొలిచి యుండుట యెరుగవా కుసుమబాణ

చుట్టములుగాని వారలు
చుట్టాలము మీకు ననుచు సొంపుదలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు చాలగలరే బంధుల్

కాదనరు ధనముగలిగిన
మేదిని నెటువంటివారి మెలకువ మనుజుల్
శ్రీదొలగిన నూరంచుల
కైదువ గలజోదునైన గైకొనరెందున్

రూపంబు దనముచ్చును
రూపంబటు తనకులంబు రూఢిగ జేయున్
రూపంబు లోకవశ్యము
రూపములేనట్టి వరుని రోతురు భామల్

రూపులేకను జగములో రూఢిలేదు
ధనము లేకను మఱియు నంతకను గొఱత
వలయు రూపంబు ధనము నవశ్యమఖిల
మానవులకను సురలకు మానకిపుడు

వ్యాసం

# “వాణి - నా రాణి”యన్న పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు - అతని ఆంతర్యం

నాటి కవి ఆత్మ విశ్వాసం...



డా॥ వడ్డేపల్లి కృష్ణ

నన్నయాదుల పురాణయుగం, పెద్దనాదుల ప్రబంధయుగం మధ్యన సంధి కాలంలో జన్మించి రాణించిన కవుల్లో పేర్కొనదగిన ప్రౌఢకవి సార్వ భౌముడు శ్రీనాథుడు కాగా యువకవి కిశోరంగా నిలిచి ‘వాణి నారాణి’యని కీర్తిగాంచిన వాడు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. 15వ శతాబ్ది మధ్య కాలంలో పినవీరన తెలంగాణ సూర్యాపేట సమీపమందలి పిల్లల మఱ్ఱిలోనే జన్మించిన కారణాన తెలంగాణ కవిగానే పరిగణించాలి. కాని ఆయన చిరకాలంగా ఇక్కడ నివాసమున్నట్లు ఏ ఆధారాలూ లేవు. అతని అన్నయైన పెదవీరన సాళువ నరసింహరాయల సామ్రాజ్యంలో పెద్ద పదవిలో వున్నందున తన సాహితీ జీవన ప్రాభవంకై పినవీరన విజయనగరం వెళ్లివుంటాడు. రాజాశ్రయం పొంది, అతని కిష్టమైన “జైమిని భారతం” రచించి అంకిత మొసగి సకల సౌఖ్యాలతో జీవించి వుంటాడు. అట్టి సౌఖ్యాల వల్లనే అలసత్వం ఏర్పడి, రాజు నిర్దేశించిన గడువులో జైమిని భారతాన్ని ఆంధ్రీకరించక, చివరకు రాత్రికి రాత్రి పూర్తి చేసివుంటాడు, శారదాదేవి కటాక్షంతో. కావున అందరూ ఆశ్చర్యచకితులై అతన్ని ప్రశ్నించగా “వాణి నారాణి” యని వెల్లడించి వుంటాడు. వెంటనే అది విస్తృత వ్యాప్తి చెంది వుంటుంది.

**తమ తాతముత్తాతలు రాజమండ్రి ప్రాంతమందలి మడికి గ్రామానికి చెందిన వారు కాగా, సింగన (కరీంనగర్) సబ్బి నాటి మండల మందలి రామగిరి రాజుల నాశ్రయించి తెలంగాణ కవిగా తేజరిల్లినట్లుగా, పినవీరభద్రుడు సూర్యాపేట ప్రాంతమందలి పిల్లలమఱ్ఱిలో జన్మించి, విజయనగర ప్రభువులనాశ్రయించి విఖ్యాతిగాంచాడు.**

కాని పినవీరన ఉద్దేశ్యం, లోక వ్యవహారంలోని తన రాణియన్న భావం కాదు - తన భారతీమంత్రాధిష్ఠాన దేవతయైన సకల సారస్వత రాజ్ఞియని. పినవీరన గురువు భారతీ తీర్థులు. (శృంగార శాకుంతలంలో స్తుతి పద్యముంది) కావున శారదోపాసకుడై వాగ్దేవిని ఆరాధించి, అలవోకగా కవితలల్లగలిగిన నైపుణ్యం గడించి వుంటాడు. అందుకే తన వాణికి ఆ విద్యలరాణి అనుగ్రహమే కారణమన్న భావంతోనే “వాణి నారాణి” యని సభక్తిగానే చాటి వుంటాడు. అందుకు నిదర్శనంగా ఆయన అల్లిన ఈ శారదాస్తుతి పద్యంనే చూపవచ్చు.

సీ. ప్రణవపీఠమున మంత్ర పరంపరలు గొల్వ నుండు నేదేవి పేరోలగంబు
భావజ్ఞులకు బరాపశ్యంతి మధ్యమా వైఖరులేదేవి వర్ణసరణి
జపహార, కీర, పుస్తక విపంచి సమంచి తంబు లేదేవి హస్తాంబుజములు
కుందేందు మందార కందళీబృందంబు చందమే దేవి యానందమూర్తి
తే. కాంచె నేదేవి కాంచన గర్భచతుర
పూర్వదంత కవాట విస్ఫుట మనోజ్ఞ
చంద్రకాంత శిరోగృహస్థల విహార
మమ్మహాదేవి వాగ్దేవి నభినుతింతు
(1-5)

ఈ విధంగా పినవీరన వాణిని వాగ్దేవిగా స్తుతించినా, తర్వాత కవులంతా పొరపాటున అతని రాణిగానే అతడు పలికినట్లు భావించి అంటగట్టారు. పినవీరభద్రుడు రచించినట్లు పేర్కొనబడిన అవతారదర్పణం, నారదీయం, మాఘమాహాత్మ్యం, మానసోల్లాససారం ఏమైపోయాయో కాని మనకు లభ్యమైన కృతులు రెండే రెండు. అవి. 1. శృంగార శాకుంతలం 2. జైమిని భారతం

మొదటి “శృంగార శాకుంతలం” కావ్యాన్ని సోమరాజుపల్లి రాజైన చిల్లర వెన్నయామాత్యునికి అంకిత మిచ్చినట్లు తెలుస్తున్నది. నాలుగు ఆశ్వాసాలుగా విరచితమైన ‘శాకుంతలం’లోని ప్రథమాశ్వాసంలో హస్తినాపుర వైభవం,

దుష్యంతుని మృగయా వినోదం మొదలగునవి; ద్వితీయాశ్వాసంలో దుష్యంతునివేట, శకుంతలావృత్తాంతం - ఆమెను దుష్యంతుడు గాంచి మోహించటం మొదలగునవి చోటుచేసుకున్నాయి.

తృతీయాశ్వాసంలో దుష్యంతుడు - శకుంతలలకు కలిగిన విరహావస్థలు, ఆ తర్వాత వారి గాంధర్వ వివాహం, దుష్యంతుడు రాజ్యానికి తిరిగివెళ్లడం వర్ణించబడ్డాయి. మచ్చుకు ఇందలి పద్యమొకటి, దుష్యంతుడు శకుంతలను దర్శించిన సందర్భంగా, గమనించ వచ్చునిలా -

సీ. సురకన్య కాబోలు,
సురకన్యయయ్యేనే -
తీవమైతెప్పలాడించుటెట్లు?
పుత్తడి కాబోలు, పుత్తడి యయ్యెనే -
హంసీగతుల నడయాడుటెట్లు?
వనలక్ష్మి కాబోలు, వనలక్ష్మియయ్యెనే
- గటివల్కలంబులు గట్టుటెట్లు?
రతిదేవి కాబోలు, రతిదేవి యయ్యెనే
- వలరాజు నెడబాసి వచ్చుటెట్లు?
తే.గీ. కన్నుగవయార్పుటకును
సుకన్యకాదు
నడచి యాడెడుగాన బుత్తడియుగాదు
లలిద పశ్చిన్నామునవనలక్ష్మి కాదు
ప్రసవశరముక్తయైనది రతియుగాదు
(2-56)

తన కావ్యంలో శ్రీనాథుని 'సదసత్సంశయగోచరోదరి' పద ప్రయోగాన్ని ఆదరంతో స్వీకరించడమే గాక పినవీరన శ్రీనాథుని సీసపద్య రచనా విధానాన్ని కూడ అనుసరించి నట్లుతోస్తుంది. తుమ్మెద శకుంతల వదనారవిందాన్ని, అధరామృతాన్ని ఆస్వాదించనెంచి ఆమెను వేధిస్తుంటే, దుష్యంతుడు ఆ తుమ్మెదను నిందించక తిలకిస్తూ

మ. వనితం జంచదపాంగ జేసి
కనుగ్రేవల్ ముట్టుచుంజేరి మం
తనముం జెప్పెడు భంగి నొయ్య జెవి
చెంతన్ ద్రోయుచున్ మెల్లమె
ల్లన మోవిన్ రతి సౌఖ్య సంపదల
గొల్లల్ గొంటి ధన్యుండ వీ
వనఘా! తుమ్మెద! నేను వెల్వడితి
దత్త్వాన్వేషముంజేయుచున్!

అంటూ తనకు లభించిన ఆ అదృష్టము తుమ్మెదకు దక్కినట్లుగా భావిస్తాడు.

లభ్యమైన పినవీరన రెండవ కృతి 'జైమిని భారతం'. దీన్ని రచించి, తన వంశస్థులైన పాండవుల ప్రశస్తిని

> **15వ శతాబ్ది మధ్య కాలంలో పినవీరన తెలంగాణ సూర్యాపేట సమీపమందలి పిల్లల మఱ్ఱిలోనే జన్మించిన కారణాన తెలంగాణ కవిగానే పరిగణించాలి. కాని ఆయన చిరకాలంగా ఇక్కడ నివాసమున్నట్లు ఏ ఆధారాలూ లేవు. అతని అన్నయైన పెదవీరన సాళువ నరసింహరాయల సామ్రాజ్యంలో పెద్ద పదవిలో వున్నందున తన సాహితీ జీవన ప్రాభవంకై పినవీరన విజయనగరం వెళ్లివుంటాడు. రాజాశ్రయం పొంది, అతని కిష్టమైన "జైమిని భారతం" రచించి అంకిత మొసగి సకల సౌఖ్యాలతో జీవించి వుంటాడు.**

ప్రస్తుతించవలసిందని సాళువ నరసింహరాయలు నాటి రాజరాజ నరేంద్రుని వలె కోరగా, నన్నయ్యలా పినవీరన కురుక్షేత్ర విజయానంతర గాథయైన అశ్వమేధ వృత్తాంతముతో కూడిన 'జైమిని భారతం'ను 8 ఆశ్వాసాల ప్రబంధంగా ఆంధ్రీకరించి అంకితమిచ్చాడు. పాండవ మధ్యముడైన అర్జునుడి దిగ్విజయ యాత్ర ఇందులో వర్ణించబడింది. అర్జునుడు అన్ని దిక్కులా విజయం సాధించినా, మహిళా రాజ్యాధినేత్రియైన ప్రమీలను మాత్రం జయించలేకపోతాడు. అప్పుడామె చేత పినవీరన పలికించిన పద్యం -

చ. కనుగొని నన్ను నా హవ
ముఖంబున మార్కొని నిల్వనీక కా
దనిమిష సిద్ధ సాధ్యులకునైన
నసాధ్యము కార్యకాంక్ష నె
మ్మనమున గల్గెనే దురభిమానము మాని
ప్రియంబేలర్వన
న్నెనసిన వేడ్కతోడ వరియింపు
హయంబు బరిత్యజించెదన్ (5-116)

తే. సోమపానంబు నీయ
గ్రజుండొనర్చి
యిష్ట ఫలభోగముల బొందనిమ్ము
నీవు
నిటమదీయ ధరామృతం బెలమిగ్రోలి
యువతి మండలమున
కెల్లనొడయడగుము (5-117)

అని ప్రమీల అర్జునుడు తనను పరిణయ మాడి అధరామృతం గ్రోలనెంచినచో, గుఱ్ఱాన్ని వదిలెదననగా ఆకాశవాణి సూచనమేరకు అర్జునుడు ప్రమీల పాణిగ్రహణం చేస్తాడు. గుర్రాన్ని చేబూని ముందుకు సాగుతాడు.

చివరలో అశ్వమేధయాగానంతరం, అతివలు భీమపాకాల్ని అతిథులకు వడ్డిస్తుంటే, అమాయక విప్రులు తెగిన జంధ్యపు పోగులు మాకెందుకు? అని ప్రశ్నిస్తుంటే వాళ్లు నవ్వి అవి జంధ్యపు పోగులు కావు - కమ్మని 'సేమియాలు' అంటూ బదులివ్వడం, అలాగే మోదకముల (లడ్డూల) గూర్చి వివరించడంలో పినవీరన మన తెలుగు వంటకాల్ని సీసపద్యంలో పొందుపరచడం విశేషం!

తమ తాతముత్తాతలు రాజమండ్రి ప్రాంతమందలి మడికి గ్రామానికి చెందిన వారు కాగా, సింగన (కరీంనగర్) సబ్బి నాటి మండల మందలి రామగిరి రాజుల నాశ్రయించి తెలంగాణ కవిగా తేజరిల్లినట్లుగా, పినవీరభద్రుడు సూర్యాపేట ప్రాంతమందలి పిల్లలమఱ్ఱిలో జన్మించి, విజయనగర ప్రభువులనాశ్రయించి విఖ్యాతిగాంచాడు. పుట్టుకతో జన్మహక్కు ఏర్పడుతుంది కాబట్టి, పినవీరభద్రుడిని తెలంగాణ వాడిగా చెప్పక తప్పలేదు యిలా. 'వాణి - నారాణి' అన్న ఆయన అసలు ఆంతర్యం కూడ విశ్లేషించవలసి వచ్చింది విధిగా.

కథ

# నాకేం వద్దు!

మోసాన్ని తిరస్కరించిన పసి హృదయం



పిన్నంశెట్టి కిషన్

దుబాయ్ నుండి పోశెట్టి బామ్మర్ది వచ్చిండు. రెండు రోజులు అయింది. బావ బావమరిది కర్రోల్ల వాడకట్లనే ఉండేది. తమ్ముడు వచ్చినప్పటి నుండి పగలంతా తల్లిగారింట్లనే ఉంటుంది పోశెట్టి భార్య రామక్క. వచ్చి పోయేటోళ్ల సందడి తగ్గిందని, అత్తగారి ఇంటి నుండి దావత్కు పిలుపు వచ్చింది.

ఇంట్లకు పోయేసరికి, తెచ్చిన వస్తువులన్నీ అట్టపెట్టల నుండి తీసి గడంచె మీద, నులక మంచం మీద, సర్దుతున్నరు అక్క, తమ్ముడు. అత్తా మామ పక్కన నిలవడి, "ఇదేంది! ఇదేంది?" అని అడుగుతున్నరు. పోశెట్టిని చూడంగనే, "రా... బావ రా! ఇండ్లకెల్లి ఏం కావాల్నో తీసుకో బావా... నీ ఇష్టం" అన్నడు.

బ్లాంకెట్లు, వాచీలు, టేప్ రికార్డులు, ట్రాన్సిస్టర్, ఆడియో క్యాసెట్లు, కరెంటుతో నడిచే టార్చి లైట్లు, జీన్స్ ప్యాంట్లు, టీ షర్టు, అంగీలు, అత్తరు-సెంటు సీసాలు, బంగారు నగలు- డిస్కో చెయిన్లు, గాజులు. అంగడి అంతా ఇంట్లోకి వచ్చినట్టు! ఆగమాగంగా ఉంది. ఇంకా... ఇంకో బ్యాగు ఎయిర్పోర్టులో పోయిందట... ఎవడో కొట్టేసిండట... అండ్ల ఇంకెన్ని సామాన్లు ఉండెనో!

ట్రాన్సిస్టర్ చూడంగనే మనసు పారేసుకున్నడు. పాటలంటే ప్రాణం పోశెట్టికి. వేములవాడ గ్రామపంచాయతీ రేడియోలో అద్దెంకి మన్నార్, మా ఊరి సురమౌళి, వార్తలు చదువుతుంటే కళ్లముందు బొమ్మ కట్టేవి. రేడియో సిలోన్ లో అమీన్ సయానీ స్వరంతో బినాకా గీత్ మాల, మీనాక్షి పొన్నుదురై మీరు కోరిన పాటలు వినుకుంట "ఎట్లన్న రేడియో కొనాలని" అనుకునేడిది. ఎప్పుడు ఏదో ఇబ్బంది. కొనలేక పోయిండు.

ఊర్లో రేడియోలు వేళ్లమీద లెక్క పెట్టేన్ని ఉండేవి. ట్రాన్సిస్టర్లు రాకముందు, డబ్బున్నోళ్ల విలాసం రేడియో. ఇంట్లోకి వెళ్ళగానే కనిపించేట్టు, అలంకరించిన టేబుళ్ళ పైన దర్పంగా దర్శనమిచ్చేది. జాలి-జాలి పొడవాటి ఏరియల్ నెమలి పింఛమై మెరిసేది.

గరీబోళ్ల వినోదం గ్రామ పంచాయతీ రేడియో. లౌడ్ స్పీకర్లో వినిపించేవారు. రేడియో స్టేషన్లో ప్రసారాలు ముగిసే వరకు పంచాయతీ రేడియో పలకడం ఆపేది కాదు. రాజన్న గుడి నుంచి వినిపించే ప్రకటనలు, రేడియో మాటలు కలిసిపోయి యుగళ గీతం పాడేవి. ఒక్కోసారి జుగల్బందీ జరిగేది.

చిన్న రేడియోలు వచ్చాక, పెద్దవి అలంకరణ వస్తువులుగా మిగిలిపోయి.. ఏరియల్ దుమ్ము పట్టి, వర్షాకాలంలో బట్టలు ఆరేసుకునే దండెంగా రూపాంతరం చెందాయి. ఈ రేడియోలకు లైసెన్సులు ఉండేవి. పోస్ట్ ఆఫీస్కు పోయి, డబ్బులు కట్టి రెన్యువల్ చేసుకునేది. అలా అవి, మధ్య తరగతి ఇళ్లలోకి చేరినయి. ఎప్పుడైతే గల్ఫ్ దేశాలకు వెళ్లడం మొదలైందో, ట్రాన్సిస్టర్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు బీదోళ్ల దరికి చేరినయి.

అప్పటి ఆ కోరిక ఇప్పుడు నెరవేరుతుంది!

"రేడియో కావాల్నేయ్" అన్నడు.

"సూడు సూడు మని... గదే అడిగితివి బావ! నేను దేశం పోయేటప్పుడు ఇచ్చి పోతాలే!!" అన్నడు.

'నోరు విడిచి అడుగుతే కాదనె' అని, 'ఊరికే నన్న అడిగితి, అడుగక పోయినా పోయేది' అని, పోశెట్టి ప్రాణం కలి కలి అయింది.

బావ 'నారాజ్' అయింది చూసి, సరే బావ తీసుకో! పరాష్కానికి అన్న. నీ కంటే ఎక్కువనా! మా అక్కనే ఇచ్చినం ఇదో లెక్కనా!" అని తీసి, చేతికి ఇచ్చి దండం పెట్టిండు. ఇంకోటి-ఇంకోటి అయితే అలిగి తీసుకోకపోయేడిది. రేడియో కదా! నవ్వుకుంట తీసుకున్నడు.

★ ★ ★

పోశెట్టికి రేడియో లోకం అయింది. మనుషుల్లోని వికారాల్లా అనేకానేక భావాలతో కొలువైన పాటలు... విన్న

కథ

**ఆ రోజు వచ్చిన ఆదాయాన్ని క్యాష్ కౌంటర్ లోంచి తీసి లెక్కపెడుతుంటే, "ఇదేమి రాజ్యం! ఇదేమి రాజ్యం! దోపిడి రాజ్యం! దొంగల రాజ్యం!" అంటూ నినాదమై పగులుతూ, వరద నదిలా ప్రవహిస్తూ, జనం. ముందు అన్నలు కూర రాజన్న, చలపతిరావు, లలితక్క, పక్కన కూర దేవన్న. "షటర్ గుంజురా పిలగా! జల్ది గుంజు" అంటూ రూపాయలు జేబుల కుక్కుకొని బయటకు వచ్చి, సగం మూడుపాళ్లు కిందికి దించి, బాబ పక్కకు వచ్చి నిలవడ్డడు రాములు సేటు.**

సమయంలో ఉన్న మూడును బట్టి ఆనంద విషాదాల్లో విహరింపజేస్తాయి. నెత్తిపైన ఆకాశమై... చుట్టూ అలుముకున్న సమీరమై... సుమధుర పరిమళమై... రోజంతా వెంటాడుతూ వేటాడుతూ ఉంటాయ్. మరునాడు మళ్ళీ ఒకటి... పాట ఊపిరై పాడుతుంది రోజంతా.

తిన్నా పడుకున్నా పక్కనే రేడియో. పొలంకాడ చింతచెట్టుకు ఉయ్యాల ఊగేది. నడుస్తున్నప్పుడు భుజాన మోగేది. ఇంట్ల అడాప్టర్‌తో, బయట బ్యాటరీతో నడిచేది. మంచె మీద పాడుతున్న రేడియో ఉన్నట్టుండి ఆగిపోయింది ఆ సారి. 'ఏమైందో!'నని హైరానా పడ్డడు. అడుగుదామంటే బామ్మర్ది వీసా పర్మిట్ అయిపోయిందని వెల్లిపాయే! సక్కగ ఇంటికి పోయి అడాప్టర్ పెట్టి, ఆన్ చేసిండు. మోగవట్టింది. "హవ్వల్ల! బతికిచ్చిండు దేవుడు" అని బయటికే అన్నడు. బ్యాటరీలు అయిపోయుంటయని, హరి దుకాండ్లకు పోయి కొత్తవి కొనుక్కొచ్చి వేసిండు. పలుకుత లేదు. 'ఏమాయె!' అనుకుంట, కరెంటు పెట్టిండు. హవ్వల్దారుగా వస్తుంది. "ఎం ఖరాబు అయిందో లోపల... రేడియోలు మంచిగజేసే రాములు దగ్గరికి కొంటవోతానని" భార్యకు చెప్పి, బజారుకు బయలుదేరిండు. "మల్ల ఏ జాముకు వస్తావో? బుక్కెడంత బువ్వ తినిపోరా"దని అంటున్న భార్యను వినిపించుకోకుండా గల్మ దాటి వచ్చేసిండు. రేడియోకి ఏమయిందో తెలిస్తేగాని నిమ్మలమయ్యేట్లు లేడు మనిషి. జప్పు-జప్పు నడుసుకుంట దుకాండ్లకు వచ్చిండు.

రాములు లేడు. రాములు ఇంటిపేరు ఏందో తెలువదు. వట్టి రాములు అంటే ఎవరో ఎవరికీ తెలువదు. 'రేడియో రాములు' అంటే సుట్టు పక్కల ఊర్లల్ల సుత గుర్తు పడతరు. ఆయిన చెయ్యి పడిందంటే ఎంతటి మొండి రేడియో అయినా పలుకుతదని పేరు పడ్డది.

పని జేసే పిలగానికి అప్పజెప్పి ఎటో పోయినట్టున్నడు. ఒకటికో! రెంటికో! మొదటిది లఘు శంక. దానికి రాధాకృష్ణ లాడ్జి వెనుక వైపు తూముకాలువలో పోవచ్చు, లావు దూరం కాదు. రెండోది దీర్ఘ శంక. చెరువుకట్ట ఎక్కాలె. పేరుకు తగ్గట్టు దూరం దండిగానే ఉంటది. మనిషి తీరునువట్టి దూర భారం!

ఇనుప ర్యాకుల్లో, రిపేరింగ్ కౌంటర్ టేబుల్ల పైనా, ఎక్కడ చూసినా చిన్నా-పెద్ద, తీరొక్క సైజుల్లో రేడియోలు, ట్రాన్సిస్టర్లు. రిపేర్ అయినవి. కావలిసినవి. అయినా తీసుకుపోనివి. అసలుకే పనికిరానివి. ఎటు చూసినా దుకాణం నిండా దుమ్ము-ధూళితో పడి ఉన్నయి, దేశ జనాభాల! కొత్తవి, అద్దాల అల్మారాల్లో అమ్మకానికి పెట్టిండు.

ఎండల పడి వచ్చిన పోశెట్టికి నెత్తిలకెల్లి చెమట కారుతుంది. 'ఎప్పుడొస్తాడో' అని బీరిపోయి నిలవడ్డడు. రేడియో పని నేర్చుకుంటున్న బాబకు, తనను చూసి పాపమనిపించి "లోపలికి వచ్చి, ఇట్ల ఫంక కింద గాలికి కూసో బాపు" అన్నడు.

'చదువుకునే వయసుల పనిజేయవట్టె పిలగాడు!' అని మనుసుల తండ్లాడుకుంట, "బడికి పోతలేవా? బిడ్డా!" అని, కూసుండుకుంట మాట కలిపిండు.

"లేదే బాపు! పోతున్న. తొమ్మిదోది అయిపోయింది. ఎండాకాలం తాతిల్లు కదా, పని నేర్చుకుంటున్న" అన్నడు.

★ ★ ★

పిలగాన్ని జూస్తే ముద్దుగనిపిస్తున్నది, "గాలి తిరుగుడ్లు లేకుండ, ఇంటికి ఇంత ఆసర అయితున్నవు" అన్నడు పోశెట్టి.

"లేదే... ఇంట్ల కష్టం ఏం లేదు!? నేనే దాచిపెట్టుకుంట. సెలవుల్ల రెండు నెలలు పొద్దుట పూట పేపర్లు వేస్తా. రాత్రి పూట బెస్త దేవన్న దగ్గర కట్టే తింపుడు నేర్చుకుంటున్న. పెండ్లి బారాత్ల కట్టెసాము జేస్తే మా వస్తాదుకు పైసలు ఇస్తరు. అండ్లకెల్లి మాకిన్నిపంచుతడు. పైన బోర్డులు రాసుడు సుత వచ్చు. ఆర్టిస్టు కె. కొండయ్య దగ్గర నేర్చుకున్న. ఈ పైసలతోటి కరెంటుది ఇస్త్రీ పెట్టె కొనుకున్న. జెండా పండుగలకు ఇత్తడి చెంబుల నిప్పులు పోసి ఇస్త్రీ చేసుకునే బాధ పోయింది. ఇంకా.. చదువుకునే టేబుల్-కుర్చీ కొనుక్కున్న.." గల గలా బాబ మూలవాగై పారుతుంటే ఆనందాశ్చర్యాలతో వింటున్నడు పోశెట్టి.

బడి మొఖం తెలియకుండ, బాల్యం పొలంలనే గడిచిపోయింది పోశెట్టికి. ఇంత ఇగురంతో ఉన్న పిలగాన్ని చూసుకుంట 'గిటువంటి కొడుకు కలగక పాయె'నని, లోలోపల మురిసిపోతుండు. తనకు లేనిది ఇతరుల్లో చూసుకుని ఆనందించే వాళ్ళు, అసూయపడే వాళ్ళు, ఇద్దరూ మనుషులే మరి!

ఇంతట్ల రాములు వచ్చిండు.

"డబ్బ రాజయ్య దగ్గర పాన్ కట్టిచ్చుకోను పోయిన. ఏమైంది రేడియోకి" అనుకుంట పోశెట్టి చేతులకెల్లి తీసుకుని, స్క్రూ డ్రైవరుతో విప్పవట్టిండు.

"పాడుతూ పాడుతూ ఆగిపోయింది. కరెంటు తోటి నడుస్తుంది. సెల్లుల తోటి నడుస్తలేదు. కొత్తవి వేసి జూసినా అంతే!" అన్నడు పోశెట్టి.

మాటల్లోనే-యాట కడుపు కోసి పేగులు బయటికి తీసినట్టు, రేడియోని రెండు ముక్కలు జేసిండు. అటు ముట్టి

ఇటు ముట్టి, “మంచిగ చెయ్యడానికి ఓ దినమంత పడుతది”

“అయ్యో... ఎట్లన్న ఇప్పుడు జేసి ఇయ్యరాదే!”

నవ్వుకుంట, “ఈడ జూసినవా... ఎన్ని ఉన్నయో! నీకంటే ముందుగాల రిపేరు చేయాల్సినవి, వారం పది రోజుల కింద ఇచ్చి పోయినవి. అవ్వి చేయడానికే నెలన్న పడుతది. కొత్తగ వచ్చినయి పట్టద్దనుకున్న. మనూరోడివని ఒప్పుకున్న.”

“ఎట్లనన్న సూడరాదే! అది లేకపోతే మనుసున వట్టదు. దుకాణం బందు జేసే యాల్లకన్న చెయ్యే!”

“నువ్వు అంతగనం తండ్లాడుతున్నవని చెపుతున్న, అండ్ల ఏదన్న పార్టు పోతే దొరుకుడు కష్టం. ముందే ఇంపోర్టెడ్ ది. కరీంనగరుకో హైదరాబాదుకో పోవాలే! గట్లయితే వారం దినాలయిన పడుతది. నీ అదృష్టం కొద్ది నా దగ్గర దొరికితే మాపటీలికి ఇస్త.”

“మంచిదాయె! రాత్రికి వస్తగని, ఖర్చు ఎంత అయిద్దో చెప్పక పోతివి.”

“అరే! అన్న, నీదగ్గర ఎక్కువ తీసుకుంటానే నువ్వు రాపో!”

★ ★ ★

సాయంకాలం అయింది. పొద్దు గూకింది. పొట్టవిప్పి పెట్టిన పోశెట్టి ట్రాన్సిస్టరును ముట్టుకోనేలేదు! పక్కన పెట్టిన బ్యాటరీలు వెయ్యనేలేదు! వేరే రేడియోను ముందువేసుకు కూర్చున్నడు. సరిగ్గా దుకాణం బందు జేసే యాల్లకు పోశెట్టి వచ్చిండు.

“రా అన్న! రా... నీ కోసమే చూస్తున్న. ఇయ్యాల్ల జల్ది ఇంటికి పోయెడిది ఉండే. నీ పనికోసమే ఆగుడయింది” అనుకుంట, రేడియో బిగించిండు. పక్కనున్న బ్యాటరీలు తీసి వేసిండు. లెదర్ కవర్ తొడిగి, తుడిచి, ఆన్ చేసిండు. బ్యాండ్లు మారుస్తూ, స్టేషన్లు మార్చుతూ, వినిపించిండు.

పోశెట్టి సంబురపడిపోతూ “రాములన్న! అన్న టయింకు ఇచ్చినవ్. ఎంత ఇయ్యాల్నే!” అన్నడు.

“దాందేముందే, నా దగ్గర పార్టు ఉండెపటికె జల్ది ఇచ్చిన”, పోశెట్టి చేతిల పట్టుకున్న నోట్లను చూసుకుంట, “ముప్పై పార్టు వేసినందుకు. రిపేరుకు ఇరువై. మొత్తం యాభై రూపాయలు అయితది గని, నీ దగ్గర రిపేరింగ్ చార్జీలు తీసుకుంటానే!” అన్నడు.

**తిన్నా పడుకున్నా పక్కనే రేడియో. పొలంకాడ చింతచెట్టుకు ఉయ్యాల ఊగేది. నడుస్తున్నప్పుడు భుజాన మోగేది. ఇంట్ల అడాప్టర్‌తో, బయట బ్యాటరీతో నడిచేది. మంచె మీద పాడుతున్న రేడియో ఉన్నట్టుండి ఆగిపోయింది ఆ సారి. ‘ఏమైందో!’నని హైరానా పడ్డడు. అడుగుదామంటే బామ్మర్ది వీసా పర్మిట్ అయిపోయిందని వెల్లిపాయె! సక్కగ ఇంటికి పోయి అడాప్టర్ పెట్టి, ఆన్ చేసిండు. మోగవట్టింది. “హవ్వల్ల! బతికిచ్చిండు దేవుడు” అని బయటికే అన్నడు. బ్యాటరీలు అయిపోయుంటయని, హరి దుకాండ్లకు పోయి కొత్తవి కొనుక్కొచ్చి వేసిండు.**



“గింతయితదా! గంతయితదా!” అని అనకుండా, చేతుల నోట్లు పెట్టి, చేయి కలిపి, నవ్వుకుంట నమస్తే చెప్పి, పసిపోరడిలా రేడియోని చంకన పెట్టుకుని, వెళ్లిపోయిండు.

ఆ రోజు వచ్చిన ఆదాయాన్ని క్యాష్ కౌంటర్ లోంచి తీసి లెక్క పెడుతుంటే,

“ఇదేమి రాజ్యం! ఇదేమి రాజ్యం! దోపిడి రాజ్యం! దొంగల రాజ్యం!” అంటూ నినాదమై పగులుతూ, వరద నదిలా ప్రవహిస్తూ, జనం. ముందు అన్నలు కూర రాజన్న, చలపతిరావు, లలితక్క, పక్కన కూర దేవన్న.

“షటర్ గుంజార పిలగా! జల్ది గుంజు” అంటూ రూపాయలు జేబుల కుక్కుకొని బయటకు వచ్చి, సగం మూడుపాళ్లు కిందికి దించి, బాబ పక్కకు వచ్చి నిలవడ్డడు రాములు సేటు. జులూసు పూర్తిగ కదిలిపోయి... గుడి ముందర పాటలు పాడుతున్నరు. గాలి భుజానికి ఎత్తుకుంది. ఒక చైతన్య పూరిత వాతావరణం నెలకొంది.

ఉన్నట్టుండి .., “గా.. పోశెట్టి ట్రాన్సిస్టర్‌ల రిపేర్ ఏం వచ్చింది సేటు?” అనుమానంతో ప్రశ్నించిండు బాబ.

“ఏం లేదురా! ఆ పిసోడికి ప్లస్-మైనస్‌లు తెలువక, బ్యాటరీలు కరెక్టుగా వేసుడు చేతకాలే!”.

“అట్లయితే రిపేరు చేసినాని, పైసలు ఎందుకు తీసుకున్నవ్?”

కథ

"పుక్కటుకు చేస్తే మన కడుపు ఎట్ల నిండాలె!?".

"దానికి అమాయకుల్ని మోసం చేయాలా?"

"అది మోసం కాదు, బతుక నేర్పుడు. రిపేరింగ్‌తో పాటు బతుకు పాఠాలు నేర్పుత, ముందు షెటర్ ఎత్తుదాం, ఆసర పట్టరా!" అన్నడు సేటు. గుంజే టప్పుడు అల్కగనే పడుతది ఎత్తేటప్పుడు ఒక్కని తోటి లేపుడు కాదు.

"నేను లేప!" అన్నడు బాబ.

"అగొ... ఏమయిందిరా! మజాకులు చేస్తున్నావ్?"

"రేపటి నుంచి పని బందు వెడుతున్న. ఇగ రాను" అన్నడు.

ఇప్పటికిప్పుడు కొత్తోన్ని ఎంకులాడాలంటే ఏడయితదిని, గావురాలు పోతూ "ఏమైంది బేటా!?" అన్నడు.

"నీతాన నామోసాలు నేర్వడానికి రాలే! దాని కంటే గుడి ముందర బిచ్చం ఎత్తుకోవడం నయం! నీ సంగతి పోశెట్టికి చెప్పుతా!"

"ఏంరో! ఎక్కతక్క మాట్లాడుతున్నావ్? ఒక్కటి పీకితే... అవ్వ దగ్గర చిన్నప్పుడు తాగిన పాలు కక్కాలె... ఏమనుకున్నవో!"

"అట్లనా! నువ్ చెయ్యెత్తి చూడు. పోయి కూర దేవన్నకు చెపుతా. అన్నది మా స్కూలే! సీనియర్. ఏమనుకున్నవో.." అనుకుంట దుకాణం ముందరి తంతెలు దిగుతున్నోని, "సినిమాకు పైసల్ ఇస్తరా"ని, బుదరికిచ్చ పోయిండు.

"నాకేమద్దు ఫో!" అనుకుంట, 'తెడ్డు' సంజ్ఞ చూపించి, గుడి దిక్కు నడిచిండు బాబ.

---

కవిత

# ఉనికి

**గాజోజు నాగభూషణం**

మౌనమొక్కటే అంగీకారమైన చోట
మాటలు నిషేధిత నిశ్శబ్ద స్వరాలు
వాక్కుపై వల విసిరే వేటగాళ్లకు
నాలుకలు లేని నోళ్లే కావాలిప్పుడు

కలలపై కత్తులు కాపలా కాస్తున్న సమయాన
చూపులు సత్యావిష్కరణకు
సంశయించే చీకటి తెరలు
వాస్తవాలను వక్రీకరించే అంధమతులకు
కంటిపాపలు లేని కళ్ళే కావాలిప్పుడు

నిజాలు చెవికెక్కని రుజాగ్రస్త వ్యవస్థలో
నచ్చినా, నచ్చకున్నా
చచ్చినట్లు వాళ్ళు చెప్పిందే వినాలి
హేతువును నిరాకరించే నియంతలకు
సీసం పోసుకొని,సీలువేసుకున్న చెవులే కావాలి

నోళ్లు, చెవులు, కళ్ళేం ఖర్మ...
కాలనాగై కాటేస్తున్న కాలానికిప్పుడు..

తలలు లేని మొండాలు కావాలి
మొండాలు తలెత్తుకోక
వంగి వంగి నడవాలి
వేళ్ళు లేని చేతులుండాలి
వాటిలో పిడికిళ్ళు మొలవని పిరికి నిండాలి

కదలికలుడిగిన కాళ్ళుండాలి..అవి
కదనానికి కదల లేక స్థాణువవ్వాలి

మనుషులు మరలైనప్పుడే
అధికారం అరచేతి స్వర్గమౌతుంది
దుర్భేద్య దుర్గమౌతుంది

భయం మన ఇంగితాన్ని
పొరలు పొరలుగా తొలుస్తున్న పురుగైనప్పుడు
అంగాలన్నీ చచ్చుబడిన పుచ్చు గింజలే

బ్రతికే ఉన్నామని చెప్పుకోనేందుకైనా
స్పందనల స్పందనగా నాడీ కొట్టుకోవాలి
సచేతనమై మన ఉనికి రెక్క విప్పుకోవాలి

ఒక్కడు బహువచనమై
వేల బాహువుల అలలై పోటెత్తాలి
సాగరాన్ని సెలయేరు సవాలు చేస్తే ఎలా?



అనువాద కథ

# అనుబంధం అంతా బూటకం (ఏరుదాటాక)

కూతురు లాంటిది అనుకుంటే గుండెల మీద తన్నిన యువతి కథ....

శ్రీ ఆర్.ఎం. ప్రభులింగ శాస్త్రి
– ఆంగ్ల కథ తెలుగు
అనువాదం – అచ్యుతుని రాజ్యశ్రీ

"ఏమయ్యోయ్! ఆడపిల్లకిక పైసదువు ఎందుకంట? ఆ రాత్రి కూతురి ప్రయాణం కోసం కావాల్సిన వస్తువుల్ని సర్దుతున్న వంగడు మల్లయ్యతో అంది లోలమ్మ. తెల్లారితే మహబూబ్ నగర్ ప్రయాణం. భార్య మాట విన్పించు కోకుండా "బిడ్డా సరోజా! నీ సర్టిఫికెట్స్, నీకు కావాల్సినవన్నీ సరుదుకున్నావా?". అని కూతుర్ని కేకేశాడు. "తెల్లగ తెల్లారకుండానే ఆరు గొట్టంగ బస్సుంది".

"నీవు చెప్పినట్టు చేసినా నాయనా!" సరోజ అంది. "ఏందీ! నా మాట నీసెవి కెక్కటం లేదా?". మగడ్ని గదమాయించింది లీలమ్మ". "ఏహే! నోర్ముయ్యవే. ఊరికే ఎందుకు లొల్లి జేసి బేజారు సేత్తుండావు?" అంతకన్నా గట్టిగానే మల్లయ్య అరిచాడు. నేనా సూత్తె! మీ పని గిట్ల గాదు" అంటూ ఆమె కూతురి సూటుకేసు, బ్యాగు తీసుకుని బెడ్ రూంలోకి వెళ్లింది. 'ఏందీ! ఇనపడటం లేదా? పెట్టె తీసిన కాడనించి రెచ్చిపోయాడు భర్త.

ఒక్క క్షణం బిత్తరపోయి, మగడి కోపం తెల్సుకనక మళ్లీ వాటిని యధాస్థానంలో ఉంచింది.

ఏంది నీ కథ. సరోజకు నేను తల్లిని గదా? ఆ మాత్రం నాకు తెలిదా నా బిడ్డ పైసదివి తీరాలా. ఆమెను బుగులు పెట్టి నిరాశ పరచకు ఆజ్ఞ జారీ చేశాడు వయస్సులో ఉన్న పిల్ల గదా! మన జాగ్రత్తలో మనం ఉండాలే ఒకసారి చెయ్యి జారినాక మొత్తుకోనుడు, ఏడుసుడు అంత వృధా పైగా హాస్టల్‌లో పెడుతుండావు భర్తను రెట్టించింది.

"సూడే లీలమ్మా! మహబూబ్‌నగర్‌లో నా దోస్తు, దూరపు సుట్టం శరణయ్య ఉండాడు. ఆడికి పిల్ల జెల్ల లేదు ఆరింట్లో నా బిడ్డ ఉంటాది. దాని మంచి చెడ్డలన్ని ఆ మగడు పెళ్ళాం చూసుకుంటారు. మూడేళ్ళు అల్లా కాడ బరిన వాని ముత్తెంలా మన బిడ్డ కడుపులో సల్ల కదులకుంటా సదువుకుంటాది. బుగులు పడకు". "ఈ ముచ్చట ముందుగల్లనే నా సెవిన ఎందుకు పడవేయలేదయ్య? జారింత సెప్తే నేమి? నేనింత లొల్లి చేసేదాన్ని కాదుగా?" ఆనందం తృప్తితో నిట్టూర్చింది ఆ తల్లి.

★ ★ ★

"అంకుల్!" సరోజ పిలుపుతో ఒక్క క్షణం ఆగి "బిడ్డా! నన్ను పెద్దనాయన అని పిలువమ్మా మీ ఆ అప్ప (తండ్రి) కంటే నేను జర పెద్దోడిని వయసుల!" అన్నాడు.

"అట్లనే పెదనాయనా! మరే.. నేను జరసేపు ట్రాన్సిస్టర్ వినవచ్చునా?". "మరి నీకు హోంవర్క్, సుదువుకునేడిది ఏం లేదా బిడ్డా!". "నాకు రేడియో వినుకుంటా చదువుకునే అలవాటుండాది".

"మరి సదివెడెది నీ దిమాగులోకి ఎక్కుతదా సరోజా?" "మంచిగా! చిన్నప్పటి సంది అలా అలవాటైంది పెదనాయనా!". మంచిది బిడ్డా! మీ అమ్మ నాయనల తాన గెట్లుంటివో ఈడ కూడా బుగులు పడకుండా మా బిడ్డలెక్కనే ఉండు, సరేనా?". శరణయ్య మాటలకు పొంగి పోయింది సరోజ. "సరోజా! ఏంది బిడ్డా! గిట్ల సేస్తుండావు? మంచిన పెయ్యినిండా పొద్దుగల టిఫిను ఎందుకు తినవు?" శంకరమ్మ ఆందోళనకరంగా ఆప్యాయంగా అడిగింది.

"మంచిగనే పొట్టనిండా ఎక్కించినా పెద్దమ్మా!". "అమ్మా! నా కడుపున బిడ్డలు పుట్టలేదు. తల్లిప్రేమ మమకారం నాకు ఎరుకనే సరోజా! నేను తల్లి గాకున్నా బిడ్డ ఆకలి గుర్తిస్తనమ్మా!". "లేదు పెద్దమ్మా! నీవు ఆలోచించి మనసు ఖరాబు చేసికోకు".

"సరోజా! నా వంట మంచిగ ఉండట్లేదా? మరి మూడే ఇడ్డీలు (ఇడ్లీలు)తో పెయ్యి నిండతదా? వయసులో ఉండ పిల్లవి, పూరీలు మంచిగ తినకుంటే ఎలా?". "ఆంటీ! నేను ఎన్ని తిన్నాననేది లెక్కపెట్టను. నాకు మస్తుగ పొట్ట నిండింది". "అమ్మా! నేను చేసేటివి నీకు నచ్చకుంటే, రుసిగా లేకుంటే నోరు

అనువాద కథ

యిప్పి చెప్పమ్మా!". అలా పదే పదే తనను గుచ్చి గుచ్చి శంకరమ్మ అడుగుతుంటే సరోజ మెల్లగా నసిగింది.

'పెద్దమ్మా! నాకు చిరుధాన్యాల్తో చేసే రొట్టెలు మంచిగ అన్పిస్తయి. రోజూ రెండు మూడు గనే తింటా".

"అయ్యో, అట్లనా నా బిడ్డా! మరి సెప్పవేంది? మేము రోజూ అవే తినేటోల్లం. నీ కోసమని ఇడిలీలు సేసినా. రేపటి సంది నీకిష్టమైన రొట్టెలు చేస్తాతియ్!". శంకరమ్మ వెర్రి ఆనందంతో భరోసా ఇచ్చింది.

"పెద్దమ్మా! నా క్లాసుమేట్ సుకన్యకి ఆమె బావతో పెళ్లి నిశ్చయం అయింది. ఈ రోజు నేను ఆ ఫంక్షన్‌కి వెళ్ళి తీరాలి". "ఏడమ్మా! సరోజా! ఫంక్షన్ హాలా?".

"ఆ.. మన మహబూబ్‌నగర్‌లోనే, సుదర్శన్ ఫంక్షన్ హాల్!".

ఏ టైమ్‌కి నీవు ఆడ ఉండాలి?".

"మధ్యాహ్నం 12.45కి విందు భోజనం అక్కడే. నీవు తినేసెయ్యి". "మరి నీ కలాసు(క్లాసు) పిల్లోండ్లు అంతా వస్తుండారా?".

శంకరమ్మ ప్రశ్నకి చిర్రెత్తు కొచ్చింది. యాభై ఏళ్ళు దాటినా ఆమెకి తను గొడ్రాలు అనే భావం సదా బుర్రను తొలిచివేస్తూనే ఉంటది. పెల్లిపేరంటాలు తాంబూలాలు పుచ్చుకునే వేడుకలు చేసే తోటి స్త్రీలను చూసి ఎక్కడో ఆమె ఎదలో ముల్లు గుచ్చుకునంత బాధ పడుతుంది. మరి మాతృత్వం పొందలేక ఆ ఆడ మనసు పడే బాధ ఆ బ్రహ్మకేమి తెలుసు? "పెద్దమ్మా! ఈయల ఐతవారం(ఆదివారం) కదా? మా క్లాసు వారంతా వస్తున్నారు", మొహం చిట్లించిన ఆ పిల్లను తల్లిగాని ఆ తల్లి శంకరమ్మ పాపం గుర్తించలేదు.



"మరి పెయ్యిపై నగానట్రా లేకుండా అట్లనే ఎల్తావా బిడ్డా? "నగలు అడిగేసుకురావాలా పెద్దమ్మా?"

"అదేందీ తల్లి ! శుభకార్యాలప్పుడు బోసి మెడతో ఆడోల్లు ఏల్లకూడదే తల్లి! నీకు తెల్వదేమో? జర నే జెప్పుందాగా, ఇనుకో"

"నాతో పాటు నగ నట్రా తెచ్చుకోలేదు గదా పెద్దమ్మా? ఇప్పుడెలా?"

"అయ్యో నా తల్లే! నా కడుపున పుట్టకున్న నీవు నా బిడ్డవే, మా ఇంటి లచ్చిమివి" కన్నకూతురిగా లాలిస్తూ మెటికలు ఇరిచింది శంకరమ్మ.

"ఎందయ్యా! నీ చేతి సంచీ బస్తా లేగా బరువుగా ఉందేంటి? శంకరమ్మ ప్రశ్నకు "ఆ.. మన బిడ్డ సరోజ పుట్టినరోజే ఎర్రి మొగమా! ఈ కొత్త సీరె, మిఠాయిలు అన్నీ ఆమెకే.. అన్నాడు శరణయ్య.

"నీకెట్టా ఎరుకయింది? కూపీలాగింది. అమ్మాయి ఆమెని కాలేజీలో చేర్పించేందుకు మల్లయ్యతో పోయి ఉంటిని గదా! ఆమె సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీ చూసి యాదికుంచుకున్నాను. "సరోజకు ఈ సంగతీ ఎరుకేనా?" భార్య ప్రశ్నకు "ఏమో మనం తమాషా చేద్దాం, సరేనా అన్నాడు" "అయితే నేను అమె కిష్టమైనది ఏమన్నా చేస్తా" అని ఆమె అంటుండగానే సరోజ ఇంటిలోకి అడుగెట్టింది. ఏంది, ఈ రోజు జల్దీ వచ్చినావు పెద్దనాయిన? పెద్దమ్మకి పెయ్యి సుస్తుగా ఉన్నదాని కంగారుగా అడిగింది. నీకేమన్న బాగలేదా?

"నాకేం బిడ్డా! మంచి గుండాను ఇయ్యాల బేరాలు ఏమీలేవమ్మా! అందుకే దుకాణం కట్టేసి బేగ వచ్చిన బిడ్డా! జర చాయ్ తాగుదువు" అని వంటింటి కేసినడిచింది శంకరమ్మ. అరగంట తర్వాత మొహం కడిగి వచ్చిన సరోజ

**"నీవు చెప్పినట్టు చేసినా నాయనా!" సరోజ అంది. "ఏందీ! నా మాట నీసెవి కెక్కటం లేదా?". మగడ్ని గదమాయించింది లీలమ్మ". "ఎహే! నోర్ముయ్యవే. ఊరికే ఎందుకు లొల్లి జేసి బేజారు సేత్తుండావు?" అంతకన్నా గట్టిగానే మల్లయ్య అరిచాడు. నేనూ సూత్త! మీ పని గీట్ల గాదు" అంటూ ఆమె కూతురి సూటుకేసు, బ్యాగు తీసుకుని బెడ్ రూంలోకి వెళ్లింది. 'ఏందీ! ఇనపడటం లేదా? పెట్టె తీసిన కాడనించి రెచ్చిపోయాడు భర్త. ఒక్కక్షణం బిత్తరపోయి, మగడి కోపం తెల్సుకనక మళ్లీ వాటిని యధాస్థానంలో ఉంచింది.**

అనువాద కథ

**"పెదనాయనా! అంత డబ్బు నీకు సర్దలేను. ఒక వెయ్యి అయితే ఇవ్వగలను. అంతకన్నా ఒక్కపైసా ఎక్కువ ఇచ్చుకోలేను". కచ్చితంగా, ఖరాఖండీగా అనేసింది. "నాకు నీ బిచ్చం వద్దు తల్లీ! నా బిడ్డ కాడికి వచ్చాను అనుకున్నాను కానీ ముష్టివాడికి విదిల్చినట్లు నన్ను పురుగులా వదిలిస్తావని అనుకోలేదమ్మా" అని అంటూనే, వెనక్కి తిరిగి చూడకుండా ఆ అభిమాన ధనుడు నీరసంగా అడుగులేస్తూ ముందుకి సాగాడు.**

చేతిలో చీర పాకెట్ ఉంచింది. పుట్టినరోజు కదా బిడ్డా ఈ రోజు ఈ చీర కట్టుకో తల్లీ! "అరే మా ఇంటి కాడ గిట్ల ఎప్పుడు నేను పుట్టినరోజు చేసుకున్నది లేదు. మా ఇంటి అనవాయితి లేదు"

'అవును బిడ్డా! మన కుల గురువుల పుట్టిన రోజులనే మనం ఆచరిస్తాం. కానీ ఈ ఏడాది నీవు మా ఇంటికి నడిచి వచ్చిన లచ్మివి, మాకు ఆసరాగా ఉండే బిడ్డవి".

"మీ ప్రేమ, ఆప్యాయత ఎన్నటికీ మరవలేను పెద్దమ్మా! మీ కాల్మొక్కుతా" అంటూ ఆ దంపతుల పాదాలకి తలవంచి ప్రమాణం చేసింది.

★ ★ ★

"ఏంటీ సరోజా! కాలింగ్ బెల్ అలా ఆగకుండా మోగుతుంటే విన్పడటం లేదా?". హరనాధ్ హెచ్చరికతో "మీరు చూడొచ్చు గదా?". ఎదురు ప్రశ్నించింది. "నేను అన్నం తింటున్నా. కన్పడటం లేదా నీకు? భర్త చిరాకుని అర్థం చేసుకున్న సరోజ "సారీ! చూడలేదు" అనుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. "అరె పెదనాన్నా! అబ్బ... పదేళ్ల తర్వాత కన్పడ్డావు. ఎక్కడున్నావు?". ఆశ్చర్యంగా శరణయ్యను ప్రశ్నించింది. చాలా బలహీనంగా ముడతలు పడ్డ దేహం, పీక్కుపోయిన కళ్లతో ఎంతో వయసున్న వాడిలా కన్పడుతున్నాడు శరణయ్య. సరోజ ఆదేశంతో స్నానం ముగించి ఆబగా అన్నం తినసాగాడు ఆ వృద్ధుడు. "తల్లీ! నీ పెద్దమ్మకి కాన్సరు వచ్చింది. ఆమె నగలు, మన ఇంటి ఒక భాగం కూడా అమ్మి వైద్యం చేయించినా. అయినా ఆమె దక్కలేదు. దుకాణాన్ని నెలకి ఐదు వందలకి కిరాయికి ఇచ్చినాను. ఆ పైసల్తో బతుకుతుండాను. అమ్మా! నేను కంటి కాటరాక్టు ఆపరేషను చేయించుకొని తీరాల. ఐదు వేలు తక్కువ బడినాయి. కాస్త డబ్బు సర్దగలవా తల్లీ!". సరోజ నిమ్మకు నీరెత్తినట్లు ఉలక్క పలక్క బొమ్మ లెక్క కూచుంది. "అమ్మా! సరోజా! నా బిడ్డా! నా కంటి ఆపరేషన్‌కి కాస్త సర్దమ్మా పైసల్ని. నా చుట్టాలు స్నేహితులంతా దాటేశారు తల్లీ ఈ లోకాన్ని! నీవే నాకు అన్నీ. నేను ఒంటరి పక్షినమ్మా! దిక్కులేని దివాలా తీసిన ముసలోడిని బిడ్డా". ఆయన గొంతు వణుకుతోంది. వెక్కిళ్లు పెడ్తూ ఏడుస్తున్నాడు ఆ వృద్ధుడు.

"పెదనాయనా! అంత డబ్బు నీకు సర్దలేను. ఒక వెయ్యి అయితే ఇవ్వగలను. అంతకన్నా ఒక్క పైసా ఎక్కువ ఇచ్చుకోలేను". కచ్చితంగా, ఖరాఖండీగా అనేసింది. "నాకు నీ బిచ్చం వద్దు తల్లీ! నా బిడ్డ కాడికి వచ్చాను అనుకున్నాను కానీ ముష్టివాడికి విదిల్చినట్లు నన్ను పురుగులా వదిలిస్తావని అనుకోలేదమ్మా" అని అంటూనే, వెనక్కి తిరిగి చూడకుండా ఆ అభిమాన ధనుడు నీరసంగా అడుగులేస్తూ ముందుకి సాగాడు.

# నానీలు

**సామల కిరణ్ (సాకి)**



సమత్వం
సాధించాలనుకుంటే
సంఘర్షణ కాదు
సమన్వయం దారి

కులాల కొట్లాటలన్ని
ఒక్కరి వల్లే
ఆ ఒక్కరు "నేను"లో
సమ్మిళితులే

వృత్తిని బట్టి
పుట్టింది.. కులం
ప్రవృత్తిని బట్టి
ఉంటుంది.. గౌరవం

విడగొట్టటమే
కొందరి సిద్ధాంతం
వేలెత్తామా!?
మళ్ళీ రాద్ధాంతం

పక్కవాడు తొక్కేయటం
పాతమాట
అంతకన్నా ప్రమాదం
ఆత్మన్యూనత

ఆత్మన్యూనత
ఒక్కరినే బంధిస్తుంది
అహంభావం
అందర్నీ కాల్చుతుంది

'నేను' 'ఎక్కువ'
అనుకున్నావా!
నీ ఎదుగుదల
నీవే అడ్డుకున్నట్లు!

సమతా హృదయం
సాధించాలంటే
సమరసమైన
టానిక్ తాగాల్సిందే

సమాజవృక్షం
బలపడాలంటే
గుండెవేర్లు
సామరస్యంతో తడవాలి

కవిత

# స్త్రీలు పూలు

అరొక్క పూలకు రంగు రంగుల
సొగసులు నయనాల నిండా
వెన్నెల వెలుగులు
ప్రకృతి చుట్టూరా
అల్లుకున్న సౌందర్యం
మనసంతా విశాల పరిమళ దృశ్యం

అసలు ఆహార్యమే ఇంపైన
పరపరాగం
మొగ్గల  నుంచే మొదలైన
రెక్కల నునుపు వర్ణం

పుష్పాలను పలకరిస్తేనే
మనసుకు వికాసం
పందిరి తీగలన్నీ గాజుల
సవ్వడే  వింటాయి
పడతులకూ పద్మాలకు అనేక
అనుబంధాలు
పుడమి సృష్టించిన పురాతన
వారసత్వం

పూలకు స్త్రీలకూ పూర్వ
పుప్పొడి బంధం

అలంకారం లోనూ పుష్పరాగాల
సర్వస్వం

మందార గన్నేరు బంతీ చామంతి
శత పత్రాలన్నీ అచ్చం ఆ
కిలకిల నవ్వులెక్కనే

అరచేతుల్లోని మైదాకు
ఎర్రని పొద్దుపొడుపు
పాదరక్షల గూడల మీద మొగ్గల
అల్లిక
వ్యానిటీ బ్యాగుల మీదా
కనకాంబరాలు
తాళంచెవి గొలుసుకు చిక్కిన
గులాబీ రూపం
సెల్ ఫోన్ కవర్ మీద నవ్వే
తెల్లని లిల్లీ
నొసటి బొట్టు లోనూ మెరిసే
పోక బంతి
గాజుల గలగలలోనూ నందివర్ధనం
శబ్దాలు

గోర్ల పెయింట్ లోనా అంటిన
గోరంటలు

పట్ట గొలుసుల్లో
పట్టుకుచ్చుల మెరుపులు
కాళ్ల మట్టెలకు మామిడి
పిందెలు కాత
పతానపు ఉంగరం, ముక్కు పోగు
మీదా
లతలు లతలుగా అల్లుకున్న
చెక్కనాలు
సిగపువ్వు ,జడ పువ్వు పేర్ల
లోనే రాజీవం
నడుమున ఒడ్డాలానికి బటాని
తీగల వయ్యారం
విశ్వకర్మ కొలిమి పుత్తడి
పూల కుండి

ఆరు గజాల చీర  నక్షత్రాల ఆకాశం
లతలు లతలుగా అల్లుకున్న
అవని చందం చీర అంచుల మీద వన్నె వన్నెల
కమలాలు వస్త్రం నిండా మామిడి
పిందెల బూటాలు
కొంగు మీదా పసందైన కొంగల
అల్లికలు రైక చేయ్యించున చిత్ర
చిత్రాల ముద్రలు
మొగ్గం గుంట నుంచే పుష్పాల పుట్టుక

పుష్పక విశ్వమంతా మనుషుల
కండ్ల పండుగ
సగం ఆకాశానికి అదొక
ప్రాకృతిక పర్వం

పూల వికాసం ఒక కళాత్మక భావన
నవ్య ఆలోచనలు విరబూసిన సారం
సొగసు మనసు కలిసిపోయిన
తేజస్సు.



అన్నవరం దేవేందర్



సంస్మృతి

# హిందీ తెరపై తెలంగాణ తారా తోరణం

హిందీ చిత్ర ప్రపంచంలో తెలంగాణ కథా నాయికలు...



హెచ్. రమేష్ బాబు

భిన్న జాతులు, మతాలు, సంప్రదాయాలు, సంస్కృతుల సమ్మేళనంగా చెప్పుకునబడే భారతదేశంలో ఏ రంగానికి సంబంధించిన చరిత్రైనా ఒక్కటే విధంగా ఉండదు. దానికి భిన్న పార్శ్వాలుంటాయి. అట్లాగే సినీ చరిత్రకి కూడా భారతీయ సినిమా చరిత్రలో హిందీ సినిమా చరిత్రదే ప్రధాన స్రవంతిగా చెప్పుకుంటారు. దానికి మూకీ చరిత్ర అనుసంధానమై ఉండటం ఒక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఒక శతాబ్దం పాటు నిర్లక్ష్యపు చెదల నడుమ మగ్గిపోయిన తెలంగాణ చారిత్రక దృష్టి తో చూసినప్పుడు హిందీ చిత్ర సీమతో హైదరాబాదు అనుబంధం మూకీల కాలంలోనే వేళ్లూనుకున్నది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ దృష్టి లేకపోవడంతో ఎందరో సినీ ప్రముఖులు తెరమరుగునే కాలగర్భంలో కలిసిపోయారు. అయితే తెలంగాణ ఉద్యమం మూలంగా వారందరినీ దేవులాడుకుని మన వారని చెప్పుకునే సందర్భం ఒకటి వచ్చింది. ఆ పరంపరలోనే హిందీ చిత్రరంగంలో తెలంగాణ నటీమణుల ప్రస్థానం పై ఒక పిట్టచూపు.

మన దేశంలోకి సినిమాలు 1896 జూలై 7 బొంబాయి లోని వాట్సన్ హోటల్ లూమియర్ బ్రదర్స్ ప్రదర్శనతో పరిచయమైతే 1896 సెప్టెంబర్ మొదటి వారంలో సికింద్రాబాదు నుండి చిన్న సినిమాలతో (షార్ట్ మూకీలు) కూడిన సీప్ హెరాల్ షోస్ మద్రాసుకు వెళ్లినట్లుగా స్టీఫెన్ హ్యూస్ అనే సినీ చరిత్రకారుడు 2010లో లండన్ నుండి వెలువడే సేజ్ అర్థ వార్షిక సంచిక. "బయోస్కోప్"లో రాశారు. ఇంకా మద్రాసుకు సికిందరాబాదు నుండి ముడి ఫిల్మ్ కూడా సరఫరా అయినట్లు రాశారీయన. అంతే గాకుండా స్టీవెన్ సన్ అనే ఆంగ్లో సినిమాటోగ్రాఫర్ దక్షిణ భారతదేశం అంతటా పర్యటిస్తూ మద్రాసు మీదుగా హైదరాబాదు వచ్చి జంట నగరాలలో మూకీలను ప్రదర్శించినట్లు స్టీవెన్సన్ రాశారు. When film came to Madras అనే అధ్యాయంలో పై విషయాలను ఉటంకించారు. ఈ ప్రదర్శన వివాలనీ 1896 సెప్టెంబర్ 2, 1897 ఆగస్టు 31 నాటి మద్రాస్ మెయిల్ డైలీలో రిపోర్టు అయినవి కూడా. ఇవి హైదరాబాదులో మూకీల ప్రదర్శనకు ప్రబల నిదర్శనాలు.

ఈ క్రమంలో 1912లో రాజా హరిశ్చంద్ర తొలి భారతీయ మూకీ తీసిన దాదాఫాల్కే భారతీయ సినిమా పితామహుడైనాడు. దాంతో హైదరాబాదు, మద్రాసు కన్నా బొంబాయినే ఎక్కువగా ఆకర్షించింది. అది మూకీల కాలంలోనే ప్రారంభమైంది. అది సరోజినీ నాయుడు కుటుంబంతో. అప్పటికే సినిమాల్లో నటించడానికి సంప్రదాయ కుటుంబాలలోని మహిళలెవరూ ముందుకు రాని పరిస్థితి. ఈ పరిస్థితిని చేధించి కమలాబాయి గోఖలే (1914), పెషెన్స్ కూపర్ (1918), గౌహర్ జాన్ (1919), సుల్తానా సీతాదేవి, ఫాతిమా బేగం, మోహిని (1922), జిల్లో (1924) వంటి వారు సినిమాల్లో నటిస్తున్న కాలం అది. అటువంటి పరిస్థితుల్లో తొలుదొలుత హైదరాబాద్ నుండి వచ్చి కెమెరా ముందు నిలిచిన వారు ఇరువురు సునాళినీ దేవి - మృణాళినీ దేవి. వీరు సరోజినీ దేవి చెల్లెండ్లు కావడం గమనార్హం. వారి తరువాత జుబేదాబేగం, రాం ప్యారీ, టి.లలితాదేవి, నిగార్ సుల్తానా, మాధవి, షబానా అజ్మీ, టాబూ, దియామీర్జా, అదితీరావు హైదరీ, కిరణ్ రావు, కీర్తి రెడ్డి తదితర హైదరాబాదీలు బాలీవుడ్‌ను ప్రభావితం చేశారు. తమదైన ముద్ర వేశారు.

**సునాళినీ దేవి- మృణాళినీ దేవి**

హైదరాబాదు నగర సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో సరోజినీ దేవి కుటుంబానిది కీలకమైన పాత్ర. కవులు, కళాకారుల నిలయమైన కుటుంబం నుండి వచ్చిన సునాళినీ దేవి, మృణాళినీ దేవి ఇరువురూ సరోజినీ నాయుడు చెల్లెండ్లు. మృణాళినీ దేవి 1883లో

సంస్మృతి



సునాళినీ దేవి

జన్మించగా, సునాళినీ దేవి 1890లో జన్మించారు. కవిత్వం, ఆంగ్ల నాటకాలతో మమేకమైన వారి కుటుంబంలో సరోజినీతో బాటు, హరేంద్రనాథ చటోపాధ్యాయ కళారంగంపై పట్టు సాధించి ఉన్నారు. వీటి ప్రభావం చేత సరోజినీ మరో సోదరి లీలామణి, హరీన్, పద్మజనాయుడులతో కలిసి నాటకాలలో పాల్గొనేవారు. హరీన్‌కు బొంబాయితో ఉన్న పరిచయాలు వీరిని సినిమాల వైపు మళ్లించినవి.

మూకీల కాలంలోనే హిమాంశ్‌రాయ్, దేవికా రాణిలు భారతీయ సినిమా వికాసానికి దోహదపడిన వారిలో ప్రముఖులు. బాంబే టాకీస్ బానర్‌పై చాలా చిత్రాలు తీశారు. 1925లో వారు తీసిన 'లైట్ ఆఫ్ ఆసియా'లో మొదటిసారిగా వీరిరువురూ నటించారు. ఈ చిత్రం తరువాత మృణాళినీ బొంబాయి నుండి మద్రాసు వెళ్లి 'షమా' అంతర్జాతీయ త్రైమాసిన పత్రికకు సంపాదకురాలైంది. కళలు, సంస్కృతి, నాగరికతాంశాలకు అధిక ప్రాధాన్యత నిచ్చే ఈ పత్రిక 1931 వరకు వెలువడింది. ఆ తరువాత మృణాళినీ హరీంద్రనాత్ చటోపాధ్యాయ రచనలను ముద్రించారు. 'ద మాజిక్ ట్రీ', 'పర్ఫ్యూమ్ ఆఫ్ ఎర్త్ (1922)', సక్కుబాయి (1924), క్రాస్ రోడ్స్ (1934) వంటివి వాటిలో కొన్ని. ఇదిలా ఉండగా ఆ తరువాత హరీన్‌చటోప్‌ని పెళ్లాడిన కమలాదేవి చటోపాధ్యాయ బెంగుళూరులో తీసిన మూకి 'వసంత సేవ (1931)'లో నటించింది.

ఇక మిగిలిన సునాళిని విషయానికి వెళ్దాం. బొంబాయిలోన స్థిరపడిపోయిన సునాళిని టాకీ చిత్రాలు వచ్చాక (1931), వీర్ కునాల్ (1932), పూజా (1940), మొహబ్బత్ (1943), మహాకవి కాళిదాసు, ఉమంగ్, ముజ్రిమ్, గాలీ (1944), ఫిర్ బి అప్నా హై (1946) శాంతి, నౌకాడుబి (1947), షికాయత్, ఆజాద్‌కి రాహేపర్ (1946), దిల్ రుబా (1950) నాదాన్, మల్హార్, బుజ్ దిల్ (1951), నౌబహార్, జల్ జలా, తమాషా, కఫీలా (1952), బాప్ బేటీ (1954) వంటి పాతిక చిత్రాల్లో కారెక్టర్ రోల్స్ చేసింది. దాంతో హైదరాబాదు స్టేట్ నుండి తొలిసారిగా బాలీవుడ్ వెళ్లిన తారలుగా సునాళినీ, మృణాళినీ చరిత్రతో నిలిచిపోయారు.

**ర్యాంపారీ...**

ముంబాయి మూకీలలో నటించిన మలి తార ర్యాంపారీ. చాలా కొత్తగా వినిపిస్తుంది ఈ పేరు. అసలు ఎవరీ ర్యాంపారీ. హైదరాబాదుకు చెందిన అచ్చ తెలుగు కుటుంబానికి చెందిన నర్తకి ర్యాంపారీ. ఆమె కుటుంబమంతా సంగీత, నాటక రంగాలలో కలిగి ఉండేది. వారంతా కళావంతుల సామాజిక వర్గానికి చెందిన వారు. వారి ముందు తరాల వారంతా తారామతి ప్రేమామతికి చెందిన వారు. వీరంతా గోలకొండ తనాషా తమ అతిథులు వచ్చినప్పుడు ఆ స్థానంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడానికి ఆహ్వానింపబడేవారు. నిజాం సంస్థానం నుండే గాక ఇతర రాజస్థానాల నుండి కూడా సంగీత, నృత్య కార్యక్రమాలు ప్రదర్శనలు చేయడానికి వీరికి ఆహ్వానం అందేది. అయితే గోలకొండ ప్రభుత్వం పాలన అంతమైన తర్వాత ఈ కుటుంబాలన్నీ చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురై పోయినవి. అలా విడిపోయిన వారంతా మాదన్నపేట, హయత్ నగర్ వంటి ప్రాంతాలకు వెళ్లగా మరికొందరు మద్రాసు ప్రెసిడెన్సీ ప్రాంతానికి వలస వెళ్లారు. వీటిలో కొన్ని కుటుంబాల సమూహం హైదరాబాదు పాత నగరంలోని నాగుల చింతకు వెళ్లి అక్కడ స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. ఇక్కడంతా చింత తో పూలతో నిండి నాగుపాముల నిలయంగా ఉండేది. అందుకే ఈ ప్రాంతానికి 'నాగుల చింత' అనే పేరు వచ్చింది. ఈ నాగుల చింతలోనే ర్యాంపారీ పుట్టింది. అది 1908 డిసెంబరులో. ఇదే సంవత్సరం హైదరాబాదు నగరానికి భారీ వరదలు వచ్చినవి. ఈ వరద బీభత్సాన్ని ఆ కాలంలో బొంబాయి నుండి జె.ఫ్.మదన్ తన బృందాన్ని డాక్యుమెంటరీగా చిత్రీకరించారు.

ఇదంతా వుంచితే ర్యాంపారీ తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్ల, మరాఠీ, కన్నడ భాషల్లో మంచి ప్రవేశం కలిగి వుండి పాడటమే కాదు నాట్యం కూడా నేర్చుకున్నది. 1918లో పదేళ్ల వయసులో తమ బంధువుల ఇంటికి మద్రాసు వెళ్లింది. అక్కడ తన పెద్ద తల్లి పెంపకంలో నాలుగేళ్ల పాటు భరత నాట్యం నేర్చుకుని మద్రాసులో పేరున్న



ర్యాంపారీ

**హైదరాబాదులో పుట్టి బొంబాయి చిత్రసీమలో నాయికగా ఎదిగిన రామ్ ప్యారీ బొంబాయిలోనే చివరి రోజులు గడిపింది. హైదరాబాదు నుండి ఎవరైనా అభిమానులు వెళితే స్వచ్ఛమైన తెలంగాణ యాసలో తెలుగులో మాట్లాడేవారామె. ఇంకా దఖని ఉర్దూ ఆమె స్పష్టంగా పలికే వారు.**

నాట్యకారిణిగా ఎదిగింది. 1926 లో మద్రాసులో ఒక నాట్య ప్రదర్శన ఇస్తుండగా చూసిన బొంబాయికి చెందిన కోహినూర్ ఫిలిం కంపెనీకి చెందిన నిర్మాత ఒకరు చూసి సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని బొంబాయికి ఆహ్వానించాడు.

ఆ కాలంలో బొంబాయిలో పెద్ద సంఖ్యలో మూకీ చిత్రాలు తయారవుతున్నవి. వెంటనే అవకాశం వరించి చందూ లాల్ షా తీసిన గుణ సుందరి (1927) మూకీలలో తొలిసారిగా ఒక సపోర్టింగ్ రోల్ చేసి వెండి తెరకు పరిచయమైంది. రెండో చిత్రం వైల్ విమెన్ (1928)లో కూడా చిన్న పాత్ర పోషించిన ర్యాంపారీ ఆ తరువాత మరో 20 చిత్రాల్లో (మూకీ) హీరోయిన్ గా నటించింది. 1930 నాటికి బొంబాయిలో అత్యధిక జనాదరణ పొందిన హీరోయిన్ గా ఎదిగింది. ఆ తరువాత సిల్వర్ క్లౌడ్, నీలం మవేక్, కుంజ్ కిషోరీ, హామ్లెట్, డ్రీమ్ లాండ్, డిటెక్టివ్ కుమార్ (1928), రెవల్యూషన్, రాజ్ హంస, మిస్ డాలీ, జై సోమనాథ్, హతీం తాయి, ఫిమేల్ ఫీట్, ఫ్రెండ్ ఆర్ ఫెయిండ్ (సన్మిత్ర్ కి శైతానీ), డేరింగ్ రాథోడ్ (1929), యాస్మినా ది వాయిలెంట్, డేర్ డెవిల్, ఇమ్మోర్టల్ గ్లోరి (1930), లయనెస్, డాషింగ్ యూత్ (1931) ఆమె నటించిన మూకీ చిత్రాలు.

టూకీలు వచ్చిన 1931లో మూడు చిత్రాల్లో నటించిందంటే రామ్ ప్యారీకి ఉన్న జనాదరణ ఏపాటిదో తెలిసిపోతుంది. అవి పాక్ దామన్, లైలా మజ్నూ, ఘర్ కీ లక్ష్మి. ఈ నేపథ్యంలో ఆమె గుణ సుందరి (1934), మీఠీ నజర్, జీవన్ నాటక్, ఆజాద్ అబల, అపరాధి (1935), సునెహరా సంసార్, జాన్ బాజ్ మాలిక్ (1936), మిలాప్, సముందీశ్వరి (తమిళ), ఖుదాయి, ఖిద్మత్ దార్ (1937) ప్రేమ్ సాగర్ (1939), బారాత్ (1942), ఆశీర్వాద్ (1943), ఘజల్ (1945), గీత గోవింద్, కౌన్ పరదేశి (1947) వంటి టాకీల్లో పృథ్వీరాజ్, మాధవ్ కాలే, జైరాజ్ వంటి అగ్రశ్రేణి హీరోలతో కలిసి నటించిందామె. హైదరాబాదులో పుట్టి బొంబాయి చిత్రసీమలో నాయికగా ఎదిగిన రామ్ ప్యారీ బొంబాయిలోనే చివరి రోజులు గడిపింది. హైదరాబాదు నుండి ఎవరైనా అభిమానులు వెళితే స్వచ్ఛమైన తెలంగాణ యాసలో తెలుగులో మాట్లాడేవారామె. ఇంకా దఖని ఉర్దూ ఆమె స్పష్టంగా పలికే వారు. మూకీల కాలంలో తెలుగునాటనే గాకుండా దేశమంతా పర్యటించి నృత్య ప్రదర్శనలు ఇచ్చిన రామ్ ప్యారీ సిలోన్ లో కూడా పర్యటించింది. సిలోన్ లేబర్ యూనియన్ ఆమెను బంగారు జ్ఞాపికతో సత్కరించింది. ఆమె చివరికి బొంబాయిలోనే కాలధర్మం చెందింది.

**తొలి టూకీ నాయిక జుబేదా బేగం...**

భారతీయ సినిమా చరిత్ర మొదటి రోజుల నుండీ సినిమా వ్యాపార రీత్యా హైదరాబాదు స్టేట్ ప్రాంతమంతా కూడా బొంబాయి రీజియన్ లోనే ఉంటున్నది. బొంబాయిలో ఎంత సినిమా వ్యాపారం జరిగేదో హైదరాబాదు స్టేటు (నైజాం) కూడా ఇంచు మించు అంతే వసూళ్లు చేసేది. ఈ అనుబంధమే జుబేదా బేగంని హైదరాబాదుకు చేరువ చేసింది.

ఇంతకీ ఈ జుబేదా బేగంకి మన హైదరాబాదుకు ఏమిటీ సంబంధం అనే అనుమానం రావచ్చు. అది తెలుసుకోవాలంటే 110 ఏండ్ల వెనక్కి వెళ్లాలి. బాంబే ప్రెసిడెన్సీలోని సూరత్ లో 1911లో జన్మించిన జుబేదా బేగం తల్లి ఫాతిమా బేగం మూకీల కాలంలోని నటి, నిర్మాత, దర్శకురాలు. తండ్రి ఇబ్రహీం యాకూత్ ఖాన్. సంప్రదాయ ముస్లిం కుటుంబమే అయినా కళాభిమానం గల కుటుంబం కావడం తల్లి ప్రోత్సాహంతో సినిమాల్లోకి ప్రవేశించి 1924లో 'గులేబ కావళి' చిత్రం ఆమె నటించిన తొలి మూకీ. ఆ తరువాత 1933 వరకు సాగిన మూకీల నిర్మాణ సమయంలో 37 మూకీలలో నటించిన నటి జుబేదా. మనోరమ, పృథ్వీ వల్లభ్, కళ్యాణ్ ఖజీనా (1924), దేవదాసి, దేశ్ కా దుష్మన్, ఇంద్ర సభ (1925), కాశ్మీరా, బుల్ బులే

**ముంబాయి మూకీలలో నటించిన మలి తార ర్యాంపారీ. చాలా కొత్తగా వినిపిస్తుంది ఈ పేరు. అసలు ఎవరీ ర్యాంపారీ. హైదరాబాదుకు చెందిన అచ్చ తెలుగు కుటుంబానికి చెందిన నర్తకి ర్యాంపారీ. ఆమె కుటుంబమంతా సంగీత, నాటక రంగాలలో కలిగి ఉండేది. వారంతా కళావంతుల సామాజిక వర్గానికి చెందిన వారు. వారి ముందు తరాల వారంతా తారామతి ప్రేమామతికి చెందిన వారు.**


జుబేదా బేగం

ఫరిస్తా, సతీ మహాదేవి (1926), లైలా మజ్నూ, ననంద భోజై (1927), హీర్ రాంఝూ, చమక్తీ చందా (1928), కనక్ తార్, మిలాన్ దినార్ (1929), నూర్ ఏ పంజాబ్, దేవదాసి, వీర్ రాజ్ పుత్ (1930), రొమాంటిక్ ప్రిన్స్ (1931) వాటిలో కొన్ని.

1931లో టాకీల నిర్మాణం మొదలైనపుడు తొలి భారతీయ టాకీ చిత్రం ఆలంఆరాలో నాయికగా జుబేదా బేగంని ఎంపిక చేయడంతో ఆమె తొలి భారతీయ టాకీ నాయికగా సినీ చరిత్రకెక్కింది. ఆ తరువాత ఆమె వీర్ అభిమన్యు (1931), జరీనా, బుల్ బులే పంజాబ్ (1932), మహాభారత్, ది అన్

టచ్ బుల్ (1933), సేవా సదన్, ననంద బోజై, బీర్బల్ కీ బేటీ (1934), గుల్షన్-ఏ-ఆలం, మా (1936), దేవదాస్, ఔరత్ కీ జిందగీ, కిస్ కీ ప్యార్ (1937) వంటి టాకీలలో నటించారామె. ఆమె చివరగా నటించిన చిత్రం నిర్దోష్ అబల (1949).

ఇవన్నీ సరే జుబేదాకి హైదరాబాద్‌కి ఉన్న సంబంధం ఏమిటంటే ఆమె హైదరాబాదుకి చెందిన మహారాజ్ నర్సింగ్ ధన్ రాజ్ గిర్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆయన హైదరాబాదులో థియేటర్ల ఏర్పాటు చేయడమే గాక హిందీ చిత్ర నిర్మాణంలో పెట్టుబడులు పెట్టేవారు. నానూ భాయ్ వకీల్ తో కలిసి "మహలక్ష్మి సినిటోన్" సంస్థను నెలకొల్పి 1934 నుండి సినిమాలు తీశారు. జుబేదా హిందీలో తీసిన పౌరాణికాలలో ద్రౌపది, ఉత్తర, సుభద్ర పాత్రలకు పెట్టింది పేరుగా కీర్తిగడించారు. పృథ్వీరాజ్ కపూర్, మాస్టర్ విఠల్ వంటి తొలితరం హీరోలతో ఆమెది హిట్ కాంబినేషన్ .బొంబాయిలోని ధనరాజ్ మహల్ ప్యాలస్‌లో తన చివరి రోజులను గడుపుతూ 1988 సెప్టెంబర్ 20న కన్నుమూసిన జుబేదా తొలి భారతీయ టాకీ 'ఆలం అరా'లో నటించిన హైదరాబాదీ కోడలుగా తెలంగాణ సినీచరిత్రలో సమున్నత స్థానాన్ని పొందిన తార.

**లలితా దేవి....**

భారతీయ టాకీల తొలిరోజుల్లో హిందీ చిత్రాలలో నటించిన మరో తార టి. లలితాదేవి. ఈమె హిందీలో సరితాదేవిగా ప్రసిద్ధురాలు. 1916లో హైదరాబాదు నగరంలో ఒక కళావంతుల కుటుంబంలో పుట్టారామె. బాల్యంలోనే సంగీత నాట్యాలు నేర్చుకున్న ఆమె తండ్రి బొంబాయిలో ధనవంతుడు కావడంతో ఆమెకు సినిమా ప్రవేశం సులభంగానే జరిగింది. ఈమె తల్లి సోదరి వీణాధనం, ఈమె కూతురు బాల సరస్వతి కూడా సంగీత, నృత్యకారిణిలు. సరితదేవిగా సినిమాల్లో కాలుమోపిన లలితాదేవి సాగర్ ఫిలిమ్స్, ఇంపీరియల్ ఫిలింస్ వారి స్టంట్ చిత్రాలలో ఎక్కువగా నటించింది. 1935లో వచ్చిన పంజాబ్ మెయిల్, 1940లో వచ్చిన విజయకుమార్ చిత్రాల్లో ఈమెనే హీరోయిన్.

మూకీల కాలంలోనే బొంబాయి వచ్చిన ఎం.ఏ. రెహమాన్ అనే కెమరామెన్ (ఔరంగాబాద్)తో ఏర్పడిన పరిచయం ఆమె జీవితం మలుపు తిప్పింది. ఆయనను వెంటబెట్టుకొని మద్రాసు వచ్చి అతన్ని వివాహమాడి ఇక్కడే స్థిరపడిపోయారు. తెలుగులో రఘుపతి ప్రకాశ్ తీసిన 'చండిక'లో మంత్రి భార్య వీరపత్నిగా నటించి తెలుగు రంగానికి పరిచయమయ్యారు. అదే ఏడాది వై.వి. రావు "విశ్వమోహిని"లో లలితాదేవి హీరోయిన్‌గా నటించింది. దీని తర్వాత

**సరితదేవిగా సినిమాల్లో కాలుమోపిన లలితాదేవి సాగర్ ఫిలిమ్స్, ఇంపీరియల్ ఫిలింస్ వారి స్టంట్ చిత్రాలలో ఎక్కువగా నటించింది. 1935లో వచ్చిన పంజాబ్ మెయిల్, 1940లో వచ్చిన విజయకుమార్ చిత్రాల్లో ఈమెనే హీరోయిన్. మూకీల కాలంలోనే బొంబాయి వచ్చిన ఎం.ఏ. రెహమాన్ అనే కెమరామెన్ (ఔరంగాబాద్)తో ఏర్పడిన పరిచయం ఆమె జీవితం మలుపు తిప్పింది.**

నాలుగేళ్ల తిరిగి బొంబాయిలో హిందీ చిత్రాల్లో చేసిన లలితాదేవి 1944లో వచ్చిన 'భీష్మ'లో, నాగయ్య గారి 'త్యాగయ్య' (1946)లో చాపల వేషంతో మరోసారి ప్రేక్షకులకు చేరువయ్యారు. పిమ్మట మరో మూడు తెలుగు తమిళ చిత్రాల్లో చేశారు. తెలుగు సినీరంగంలో "బొంబాయి లలిత"గా పిలుచుకునే ఈమె 1948 వరకు హిందీలో దాదాపు డజను చిత్రాలలో నాయికగా నటించినట్లు 1948లో వచ్చిన చిత్రకళ అనే గ్రంథంలో ప్రస్తావించారు. అనంతరం ఆమె దోభీగా జమీన్ (1958), బిరాజ్ బహు (1954), దేవదాస్ (1955), సోనేకి చిడియా (1958), కిసీసే కహాథా (1960), ప్రేమపత్ర్ (1962), గబన్ ఆయేదిన్ బహార్ కే (1971), పాకీజా పియా క ఘర్ (1972), హర హర మహదేవ (1974), ఆంచల్ (1980) తదితర హిందీ చిత్రాలలో క్యారెక్టర్ రోల్స్ వేసారు.

లలితాదేవి ఎక్కువకాలం బొంబాయిలో చిత్రరంగంలో ఉండటం వల్ల ఆమె కడపటి రోజుల విషయాలు తెలిసి రావడం లేదు.

**నిగార్ సుల్తానా**

హిందీ చిత్రరంగాన్ని తొలితరంలో ఏలిన తారల్లో ఒకరయిన


నిగార్ సుల్తానా

హైదరాబాదుకు చెందిన నిగార్ సుల్తానా. 1932 జూన్ 21న హైదరబాదు గన్ ఫౌండ్రిలోని సాంప్రదాయ ముస్లిం కుటుంబంలో జన్మించిన నిగార్ సుల్తానా బాల్యంలోనే ఉర్దూ ఆంగ్ల భాషలను ప్రయివేటుగా నేర్చుకుంది. వీటితో బాటు సంగీత నృత్యాలలో శిక్షణ పొందింది. ఇంట్లో సినిమాలపై తన ఆసక్తిని తెలుపగానే అంతా ససేమిరా అన్నారు. అయితే ముంబైలోని బంధువుల్లో ఒకరు ఆమెను ప్రోత్సహించి తల్లితండ్రులను ఒప్పించి అక్కడికి రప్పించుకుంది.

1946లో "రంగభూమి" ఆమె నటించిన తొలిచిత్రం. ఆ తరువాత బేలా, నావ్, షికాయత్ చిత్రాల్లో నటించి హిందీలో స్థిరపడిన నిగార్ సినీ జీవితం స్థిరపడింది రాజకపూర్ "ఆగ్ "తో. అందులోని ముగ్గురు నాయికల్లో ఒకరు

నిగార్ కూడా. తరువాత వచ్చిన 'పతంగా' కూడా మంచిపేరు తెచ్చింది. ఈ సినిమాలో "మేరే పియా గయే రంగూన్" పాపులర్ పాట నిగార్ పైనే చిత్రీకరించారు .ఆ తరువాత దిలీప్ కుమార్ సరసన 'యహూది' (1958), ప్రాణ్ తో శీష్ మహల్ (1950) హైదరాబాద్ హీరో అజీత్‌తో "పతంగా" (1949) 'దామన్' 'దుర్గేశ్ నందిని', భరత్ భూషణ్‌తో "మీర్జా గాలీబ్" శ్యామ్‌తో 'సంగీత్' (1950), చిత్రాలలో నటించిందామె. ఆమెకు నటిగా మంచి పేరు తెచ్చి వెంటనే మనకు గుర్తుకు వచ్చే చిత్రం 'మొగల్- ఎ-ఆజం'. నర్తకి బహార్ పాత్రలో నిగార్ నటన శిఖర స్థాయికి చేరుకుంది. ఆ పాత్రలో నేటికీ మరొకరిని ఊహించుకోలేము. అనార్కలి సలీంల ప్రేమను విచ్ఛిన్నం చేయడానికి అసూయతో కూడిన నటన నిగార్‌కి గొప్ప పేరు తెచ్చిపెట్టింది.

అనంతరం షాన్-ఎ-హింద్, సాయా (1961), నూర్జహాన్ (1967), దో కలియా, మేరే హమ్ దమ్ మేరే దోస్త్ (1968), బస్సీ బిర్జూ (1972) వంటి చిత్రాలలో నటించారామె. అలనాటి ప్రముఖ దర్శకుడు కె.ఎ. అసిఫ్ ను వివాహం చేసుకున్నారామె. అయితే నటి హీనా కౌసర్ ఆమె కుమార్తెనే. తన 68వ ఏట 2000 ఏప్రిల్ 23న బొంబాయిలో తనువు చాలించింది నిగార్. హిందీ తెరపై మూడు తరాల పాటు నటిగా వెలిగిన నిగార్ "హైదరాబాద్ కీ నాజ్నీన్"గా, బాలీవుడ్‌లో భాగ్యనగర సౌందర్య శిఖరంగా నిలిచి పోయింది.

**మాధవి**

సికింద్రాబాద్‌లో పుట్టిన మాధవి అనగానే చాలామందికి ఖైదీ చిత్రం గుర్తుకు వస్తుంది. అందులోని స్నేక్ డాన్స్ గుర్తుకు వస్తుంది. "తూర్పు పడమర" ఆమె తొలి చిత్రం. ఆ తరువాత "ఊరుమ్మడి బతుకులు", మరో చరిత్ర, తరువాత 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య', అమావాస్య చంద్రుడు వంటి చాలా కమర్షియల్ చిత్రాలు తెలుగులో చేశారు. ఇంక మలయాళ, కన్నడ, తమిళ భాషలన్నింటిలోనూ నటించిన మాధవి ఏక్ దూజేకి లియేతో హిందీ రంగంలోకి ప్రవేశించింది. ఆ వెంటనే అమితాబ్‌తో అంధాకానున్‌లో నటించే అవకాశం వచ్చింది. మళ్లీ అమితాబ్‌తోనే గిరఫ్తార్‌లో నటించిన మాధవి, మషాల్, జ్వాలా, లోహా, ప్యార్ కీ మందిర్, జఖ్మ్, శేష్ నాగ్ వంటి చిత్రాల్లో జితేంద్ర, ధర్మేంద్ర, రాజేష్ ఖన్నాలతో కలిసి నాయికగా చేసింది. ఆ తరువాత తెలుగు 'మాతృదేవోభవ' చిత్రంతో తన నట జీవితంలో మరపురాని నటనను ఆవిష్కరించి సినిమాలకు దూరంగా విదేశాల్లో స్థిరపడింది మాధవి.

**"అంకుర్"లో మూగవాడి భార్యగా షబానా నటనకు జాతీయ అవార్డు వచ్చింది. ఆ తరువాత రే, మృణాల్ సేన్, భాసు చటర్జీ, దీపా మెహతా, గౌతమ్ ఘోష్, అపర్నా సేన్ వంటి ప్రఖ్యాత దర్శకుల 120 పైగా చిత్రాల్లో నటించారామె. షత్రంజ్ కి ఖిలాడి, ఏక్ దిన్ అచానక్, సతి, అర్థ్, గాడ్ మదర్, ఫైర్, ధారవి, సాజ్ వంటివి వాటిలో కొన్ని. 'అర్థ్', కాందహార్, పార్, గాడ్ మదర్ చిత్రాలకు వరుసగా జాతీయ ఉత్తమ నటితో బాటు, ఫిల్మ్ ఫేర్, విదేశీ ఫిల్మోత్సవాల సత్కారాలు, పద్మశ్రీ, పద్మభూషణ్, అక్కినేని పురస్కారం, గాంధీ ఇంటర్నేషనల్ పీస్ అవార్డులు ఆమెను వరించి తమ గౌరవాన్ని పెంచుకున్నవి.**

**షౌకత్ అజ్మీ**

షౌకత్ అజ్మీ హిందీ సినిమా, నాటక రంగాలలో ప్రసిద్ధురాలు. ప్రఖ్యాత సినిమా నాయిక షబానా అజ్మీ ఈమె కూతురే. ప్రగతిశీల భావాలున్న కుటుంబంలో హైదరాబాదులో 1928 అక్టోబర్ 20న జన్మించారామె. తండ్రి య్యాహ్యా ఖాన్ నిజాం సర్కారులో ఎక్సైజ్ అధికారిగా పనిచేసేవారు. అరబిక్, ఉర్దూ, ఆంగ్లంతో బాటు తెలుగు భాషను కూడా నేర్చుకున్న షౌకత్ కైఫీ అజ్మీని ప్రేమించి పెళ్లి చేసుకుని బొంబాయి వెళ్లి పోయింది. అక్కడ పృథ్వీ, ఇప్టా సంస్థలలో నాటకాలు వేసింది. గదర్, ఆహుతి, శకుంతల, దీవార్, పఠాన్, కిసాన్, కళాకార్, పైసా నాటకాల్లో ప్రధాన భూమికలు పోషించారు. ఆమె 1970ల్లో సినిమాల్లో చేరి ఎం.ఎస్ సత్యు "గరంహవా"లో తొలిసారి నటించారు. దీని నిర్మాత, కెమెరామెన్ ఇషాన్ ఆర్య హైదరాబాదీ వాడే. అయితే షౌకత్ కి గుర్తింపు తెచ్చిన చిత్రం 'ఉమ్రావ్ జాన్'లోని ఖానమ్ జాన్ పాత్ర. స్వతంత్ర భావాలున్న ఖానమ్ జాన్ లక్నోలో నాట్యకత్తెల నివాసాన్ని నిర్వహించే లోకం పోకడ తెలిసిన స్త్రీ పాత్ర. హైదరాబాదులో వేశ్యా వాటికల్లో స్త్రీల జీవన స్థితి గతులకు దర్పణం పట్టే 'బాజార్' (1982)లోనూ నటించిన షౌకత్ ఆ తరువాత 'లోరీ' (1984), అంజుమన్ (1986) చిత్రాలలో నటించింది. మీరా నాయర్ 'సలాంబాంబే'లో వేశ్యమాతగా షౌకత్‌ని తప్ప మరొకరిని ఊహించలేము. ఇంకా ప్రిన్స్ (1969), హీర్ రాంఝూ (1970), ఓ మైనహీ, జుర్మ్ ఔర్ సజా, ఫాస్లా (1974), ధూప్ చావ్ (1977)లతో బాటు చివరిగా "సాథియా" (2002)లో నటించిన షౌకత్ 'కైఫీ అండ్ ఐ' పేర ఆత్మకథ రాసుకున్నారు. ఆ మహానటి 2019 నవంబరు 22న బొంబాయిలో కాలం చేశారు.

**షబానా...**

భారతదేశం గర్వించదగిన నటి


షబానా

షబానా. హైదరాబాద్‌లోనే పుట్టిందామె. అమ్మమ్మ గారింట్లోనే బాల్యమంతా గడిచింది. పూణే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో శిక్షణ పొంది రాగానే శ్యాం బెనగళ్ "అంకుర్"లో నాయికగా ఎంపికైంది. అదీ హైదరాబాదీ కథ. "అంకుర్"లో మూగవాడి భార్యగా షబానా నటనకు జాతీయ అవార్డు వచ్చింది. ఆ తరువాత రే, మృణాల్ సేన్, బాసు చటర్జీ, దీపా మెహతా, గౌతమ్ ఘోష్, అపర్ణా సేన్ వంటి ప్రఖ్యాత దర్శకుల 120 పైగా చిత్రాల్లో నటించారామె. షత్రంజ్ కి ఖిలాడి, ఏక్ దిన్ అచానక్, సతి, అర్థ్, గాడ్ మదర్, ఫైర్, ధారవి, సాజ్ వంటివి వాటిలో కొన్ని. 'అర్థ్', కాందహార్, పార్, గాడ్ మదర్ చిత్రాలకు వరుసగా జాతీయ ఉత్తమ నటితో బాటు, ఫిల్మ్ ఫేర్, విదేశీ ఫిల్మోత్సవాల సత్కారాలు, పద్మశ్రీ, పద్మభూషణ్, అక్కినేని పురస్కారం, గాంధీ ఇంటర్నేషనల్ పీస్ అవార్డులు ఆమెను వరించి తమ గౌరవాన్ని పెంచుకున్నవి. ఒక రకంగా చెప్పాలంటే మన కాలపు మహా నటి షబానా అజ్మీ.

**హిందీలో ఫాస్లే మొదలుకొని ఇమాందార్, నకాబ్, యతీమ్ వంటి చిత్రాల్లో అనిల్ కపూర్, అమీర్ ఖాన్, సన్ని డియోల్ వంటి హీరోలతో కలిసి 70 చిత్రాల్లో నటించింది ఫరా. ఇక ఆమె చెల్లి టాబూ తెలుగులో చాలా చిత్రాల్లోనే నటించింది. నిన్నే పెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే, అందరివాడు, షాక్, పాండురంగడు, మొన్నటి అల వైకుంఠపురం వరకు.**


టాబూ

**ఫర్హా- టాబూ సిస్టర్స్...**

హైదరాబాద్‌లో పుట్టారు. ఫర్హా తెలుగులో 'విజేత విక్రమ్' చిత్రంలో నాయిక. హిందీలో ఫాస్లే మొదలుకొని ఇమాందార్, నకాబ్, యతీమ్ వంటి చిత్రాల్లో అనిల్ కపూర్, అమీర్ ఖాన్, సన్ని డియోల్ వంటి హీరోలతో కలిసి 70 చిత్రాల్లో నటించింది ఫరా. ఇక ఆమె చెల్లి టాబూ తెలుగులో చాలా చిత్రాల్లోనే నటించింది. నిన్నే పెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే, అందరివాడు, షాక్, పాండు రంగడు, మొన్నటి అల వైకుంఠపురం వరకు. అయితే హిందీలో ఆమె విభిన్న నటిగా మాఛీస్, చాంద్ నీ బార్ చిత్రాల్లో నటించి జాతీయ అవార్డు అందుకున్నది. విరాసత్, భూతూతూ అస్తిత్వ వంటి హిందీ, తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల్లో పేరున్న నటి టాబూ.


అదితీరావు హైదరీ

**అదితీరావు హైదరీ - కిరణ్ రావు**

వనపర్తి సంస్థానం రాజారామేశ్వర రావు కుటుంబీకులు కిరణ్ రావు టెక్నీషియన్‌గా పేరొందారు. ఆమె ప్రముఖ హీరో అమీర్ ఖాన్‌ని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. దర్శకురాలిగా, నిర్మాతగా, స్క్రిప్టు రైటర్‌గా తనదైన ముద్రతో 2011లో ధోబీ ఘాట్ చిత్రాన్ని తీశారు. నిర్మాతగా జానే తూ ఏ యేజానేనా, పీప్లి లివ్, డెల్లీ బెల్లీ, తలాష్, దంగల్, సీక్రెట్ సూపర్ స్టార్ చిత్రాలనే గాక 'రూబరూ రోష్ని' అనే టివి డాక్యుమెంటరీని కూడా తీశారు.

రాజారామేశ్వరరావు మనవరాలు అతిదీరావు హైదరీ. కిరణ్ రావు ఈమెకు మేనమామ కూతురు. తండ్రి ఇషాన్ హైదరీ. తల్లి విద్యారావు. తండ్రి తరపు వారు నిజాం కాలంలో ప్రధానమంత్రిగా పనిచేసి ఉన్నారు. తొలుత ఢిల్లీలో తరువాత ముంబైలో చదువుకున్న అదితి 2006లో 'ప్రజాపతి' మలయాళ చిత్రంతో తెరకు పరిచయమైంది. ఆ తరువాత "ఢిల్లీ 6" చిత్రంతో మొదలుకొని "ఏసాలీ జిందగీ", "లండన్ పారిస్ న్యూయార్క్", రాక్ స్టార్, మర్డర్ 3, బాస్, ఖూబ్ సూరత్, గుడ్డు రంగీలా, వజీర్ హిందీ చిత్రాల్లోనే గాక 'శ్రీరంగం' తమిళం చిత్రంలో కార్తీతో నటించింది అదితి. హిందీ 'పద్మావతి'లో మొహమున్నీసాగా తెరపై మెరిసిందీమె. అమితాబ్, రేఖ, జయాబచ్చన్‌ల ప్రశంస లందుకున్న అదితి తెలుగులో ఇంద్రగంటి మోహనకృష్ణ 'సమ్మోహనం' పరిచయమై తరువాత 'అంతరిక్షం', 'వి' చిత్రాల్లో నటించిందీమె.

ఈ నేపథ్యంలో హైదరాబాదీయులైన దయానా హైడెన్, దియా మిర్జా, పాయల్ రోహత్గి, కీర్తి రెడ్డి, మధుషాలిని, షెర్లిన్ చోప్రా వంటి హీరోయిన్లు బాలీవుడ్ తెరపై తెలంగాణ తారాతోరణంగా వెలుగొందు తున్నారు. వీరంతా బాలీవుడ్ సినీ సౌధానికి భాగ్యనగర్ చెక్కిన నగీషీలుగా మనం గర్వించాలి.

ముఖాముఖి

# “మూడు కథలు, ఆరు కవితలతో” మా ఇల్లు పరిమళిస్తోంది -కోట్ల

**ఉపాధ్యాయుడుగా, కవిగా ఎన్నో అవార్డులు అందుకున్న కోట్ల వెంకటేశ్వర రెడ్డితో మామిడాల రమేష్... ఈ పక్షం ముఖాముఖి**



మామిడాల రమేశ్

మూడున్నర దశాబ్దాలుగా నిరంతరం కవిత్వం రాస్తూ తనదైన ముద్రతో తెలుగు సాహిత్య చరిత్రలో తన స్థానాన్ని పదిలం చేసుకుంటున్న కవి కోట్ల వెంకటేశ్వర రెడ్డి ఉపాధ్యాయుడుగా, కవిగా ఎన్నో అవార్డులు అందుకున్నారు. హాస్యం, వ్యంగ్యం, రాజకీయ కవిత్వంలో అలవోకగా అల్లే కవిగా ప్రసిద్దులు. 2019లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పురస్కారమిచ్చి గౌరవించింది. నిరంతర కవిగా కవితాయాత్ర కొనసాగిస్తున్న శ్రీ కోట్ల వెంకటేశ్వరరెడ్డితో మామిడాల రమేశ్ జరిపిన ఆత్మీయ సంభాషణ ఇది.

**నమస్కారం కోట్ల వెంకటేశ్వర రెడ్డి గారు**

నమస్కారం సార్.

**మీ జీవితానుభవాలు, కవితా సృష్టికి ఎలా దారి చూపాయో వివరిస్తారా?**

నాకు కవిత్వం, జీవితం ఒకటే. కవిత్వ సృజనా, మనిషిగా జీవించడం పూలబాట మీద నడకకాదు. జీవితం అనేక సంవేదనల నిత్యప్రయాణం. కవిత్వ సృజనా అంతే ప్రతి కవిత వేదనా భరిత సృష్టే. దిగువ మధ్యతరగతి, రైతు కూలీ కుటుంబ జీవితం, గ్రామీణ విపత్కర పరిస్థితులు చవి చూసిన కవికి కవిత్వం ఒక అప్రయత్న ప్రకటనే. మా ఊరు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చిన్న



చింతకుంట మండలం దుప్పల్లి గ్రామం. ప్రస్తుతం నాది వనపర్తి జిల్లా. ఒకప్పటి తెలంగాణ గ్రామానికి నిదర్శనం మాగ్రామం. ఇప్పుడు కాదు. నా బాల్యం కూటి కోసమే కాదు నీటికోసమూ అలమటించిన రోజులు. మాది పేరుకే అగ్రవర్ణం, మాకుటుంబంలో అంతా బీడీ కార్మికులే. నేను నాకు నల్గురు చెల్లెండ్రు. వాళ్ళు చదువులుమాని నన్ను చదివించారు. ఇప్పటికీ వాళ్ళలో మా అమ్మను చూసుకుంటాను. ఉద్యోగం వచ్చేదాక బంధువులు, మిత్రుల తోడ్పాటుతో 28 ఏళ్ళు గడిచిపోయాయి. మొదట శాఖాగ్రంథాలయంలో 1986లో లైబ్రేరియన్‌గా జీవితం మొదలు పెట్టాను. ఉద్యోగం చిన్నది బాధ్యతలు పెద్దవి. నలుగురు చెల్లెండ్ల పెళ్ళిళ్ళు చేయాలి. నేనూ బ్రతకాలి, ఉద్యోగం లేనప్పుడు ఎన్నడూ అప్పులు చేయని నేను వచ్చాక అప్పులు చేయాల్సి వచ్చింది. అనేక ఆటుపోట్ల మధ్య లైబ్రేరియన్‌గా విస్తృతమైన అధ్యయనం చేసుకోవడానికి వీలైంది ఆర్థికంగా గ్రామ జీవితం విచ్ఛిన్నమైనదైనా మా ఊరు సాంస్కృతికంగా బాగా సంపన్నమైనది. ముఖ్యంగా రంగస్థల నాటకాలకు, భజన కీర్తనలకు, కబడీ ఆటలకు మాఊరు ప్రసిద్ధి అప్పటికీ, ఇప్పటికీ. ఆ అభిరుచి నన్ను కొంచెం సాహిత్యం వైపు నెట్టిందేమో. డిగ్రీ చదివేరోజుల్లోనే ఒక లిఖిత మాసపత్రికను నడిపాను. వార్షిక సంచికలకు సంపాదకునిగా ఉన్నాను. అభిరుచి అట్లా మొదలై ఎం.ఏ. అర్థశాస్త్రంలో సీటు వచ్చినా ఎం.ఏ.

**అవార్డులు...**

1. తెలుగు విశ్వవిద్యాలయం - కీర్తి పురస్కారం
2. కాళోజి పురస్కారం - రాష్ట్ర ప్రభుత్వం
3. సరసం అవార్డు
4. రంజని - కుందుర్తి అవార్డు
5. శాతవాహన విశ్వవిద్యాలయం - ఉత్తమకవి
6. సిరిసిల్ల వారి - బొవెరా పురస్కారం

ముఖాముఖి

తెలుగులో చేరిపోయాను. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో గొప్ప, గొప్ప ఆచార్యుల దగ్గర చదువుకోవడం, ఆర్ట్స్ కాలేజి నిత్య రాజకీయాల వేదికగా ఉండటం, విద్యార్థి ఉద్యమాలు కొత్త కాంతికి దారి వేసినయి. సినారె కవిత్వ బోధన, బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకుల మార్గనిర్దేశం, ఎస్వీ రామారావు వంటి ఆచార్యుల ప్రోత్సాహం నన్ను కవితా రచన వైపు తిప్పినవి.

**రచయితగా మిమ్మల్ని ప్రభావితం చేసినవారు?**

మా తరానికి శ్రీశ్రీ, దిగంబర కవులు ఆకర్షించారు. ఆవేశాన్ని నింపారు. ఆ తర్వాత కుందుర్తి వచన కవితా మార్గం, శేషేంద్ర మామూలు వస్తువును కవితా వస్తువుగా తీర్చిదిద్దేతీరు నన్ను ఆకర్షించినవి. ఆధునిక మహా భారతం చదివి ఎంతో ఉద్వేగానికి లోనైనాను. ఏకలవ్యశిష్యుడనై తదనంతర కాలంలో ఆ అభిమానంతోనే నా పెద్ద కుమారునికి శేషేంద్ర అని పెట్టుకున్నాను. ఇక మహాకవి సినారె బోధన, కవితా పఠనం, వారి ఆహార్యం నన్ను మంత్ర ముగ్ధున్ని చేసిన అంశాలు. తరగతిలో ఉన్నా ఎన్నడూ దగ్గరగా వెళ్ళి మాట్లాడిన సాహసం చేయలేదు. 1987లో నా తొలిపుస్తకం 'గుండెకింద తడి' అవిష్కరణకు ఆహ్వానించాక వారితో సాన్నిహిత్యం పెరిగింది. మెళుకువలు నేర్చుకున్నాను. ఆ తర్వాత ఆకర్షించింది ఆచార్య ఎన్. గోపిగారే, కె. శివారెడ్డి, ఎన్. గోపి గారలు విస్తృతంగా రాయడం ఎట్లా సాధ్యమని నెవ్వెర







పోయేవాడిని. వాళ్ళలాగా ఎందుకు రాయకూడదని ఆలోచించేవాడిని ఆ ఆలోచనలే నన్ను కవిని చేశాయి.

**కాళోజి పురస్కారం రాష్ట్ర ప్రభుత్వం చేత, సినారె పురస్కారం అందుకున్నారు కదా మీ అనుభూతి ఎలా ఉంది?**

నేను ఎం.ఫిల్ చేస్తున్న రోజుల్లో వరంగల్‌లో ఒక కవి సమ్మేళనంలో కాళోజీ గారిని 1985లో చూశాను. ఆకవి సమ్మేళనంలో 'ఎన్‌కౌంటర్' అనే ఒక ఫన్నీ మినీ కవిత వేగంగా చదివి వేదిక దిగిపోయాను. అధ్యక్షస్థానంలో ఉన్న వారు అరె వీడేదో గమ్మత్తుగ చెప్పాడు. ఒరేయ్ వచ్చి మరోసారి చదువు అన్నాడు. నాకు భలే సంతోషం వేసింది. ఆ ఉత్సాహం వారికి 'నూరు తెలంగాణ నానీలు' అంకితమిచ్చే దాక తగ్గలేదు. ఎంతో ప్రేమతో స్వీకరించి ఆశీర్వదించారు. మూడు దశాబ్దాల కవితా ప్రయాణంలో ఎన్నో అవార్డులు, సత్కారాలు, వచ్చాయి. నా మొదటి కవితా సంపుటికే సరసం (సమతా రచయితల సంఘం) ఉత్తమ కవితా సంపుటి అవార్డు లభించింది. అవన్ని ఒక ఎత్తు సినారె పురస్కారం ఒక ఎత్తు. ఎందుకంటే అది నా హక్కు అనుకుంటాను. కాళోజి వంటి ప్రజాకవి, సినారె వంటి మానవీయ మహాకవి జమిలిగా నాలో ఉన్నారేమో అనిపిస్తుంది.




**పాఠకుల్లో కవిత్వ స్పృహ పెరగడానికి ఏం చేయాలంటారు. మీ అధ్యయనం, మీ రచనా విధానం?**

మిత్రమా! పాఠకుల్లో కవితా స్పృహ ఉంది. మరింత పెరగడానికి మనం చేయాల్సింది వాళ్ళ హృదయ స్పందనల్ని ప్రతిబింబింప చేయాలి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమం పట్ల జరుగుతున్న అణచివేతల్ని ఎండగట్టినప్పుడల్లా వందలాది మంది



ఫోన్లు చేసి అభినందించిన అనుభవం నాకు ఉంది. మీరన్నట్లు కవిత్వానికి పాఠకుల సంఖ్య కొంత పరిమితంగానే ఉంటుంది. కాని వాళ్ళు శ్రేష్ఠులు కూడా. ఇక రచనా విధానానికి వస్తే సినారె అన్నట్లు కప్పిచెప్పడం కవిత్వం. ఒక్కో దృశ్యం వెంటాడుతుంటది. కన్యాశుల్కం సినిమా పాఠ్యాంశంలో భాగంగా 1985లో చూశాను. అందులో సావిత్రి నవ్విన నవ్వు తలుచుకున్నప్పుడల్లా నన్ను వెంటాడుతూనే ఉంటుంది. సినిమా చూసిన వెంటనే 'వెంటాడే దృశ్యం' అని ఆంధ్రప్రభ వారపత్రికలో ఒక కవిత రాశాను. కదిలించినప్పుడు, నేను కదిలినప్పుడు చాలా వేగంగా రాస్తాను.

**ఆధునిక కవిత్వంలో ఎన్నో ప్రక్రియలు వస్తున్నాయి. అయినా అస్పష్టత, సంక్లిష్టత అలాగే ఉన్నాయి. మీరేమంటారు.**

ఆధునిక కవిత్వంలో అస్పష్ట, సంక్లిష్ట కవిత్వం మీరన్నట్లు కొంతకాలం రాజ్యమేలిన మాట నిజమే. అట్లా రాయడం ఒక ఫ్యాషన్‌గా మారిన రోజులు నాకూ గుర్తున్నాయి. దాని ఆకర్షణ తగ్గి చాలా కాలమైంది. జనాలకు అర్థం కాకుండా రాసి ప్రయోజనం ఉండదని కవులు గుర్తించారు. ఇప్పటి తరం గొప్ప భావ శబలతతో సరళంగా, స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారు. వచనమై తేలిపోయిన వాళ్ళు పరిణామ క్రమంలో తెరమరగై పోతారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జలసిరులే కాదు, కవితా ప్రవాహం ఉధృతమై ప్రవహిస్తున్నది. తేటపడాల్సిన సమయం వచ్చింది.

**కాళోజీ అవార్డు గ్రహీతగా, సీనియర్ కవిగా మీ సాహిత్య ప్రణాళికలు ఏమిటి?**

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా కవితాభిరుచి కలిగిన ముఖ్యమంత్రి కెసిఆర్ నన్ను కాళోజీ అవార్డుకు స్వయంగా ఎంపిక చేయడం, అంతకంటే ముందు కొన్ని సంవత్సరాల క్రితం నమస్తే తెలంగాణలో కవిత చదివి ఫోన్ చేసి అభినందించడం మరచిపోని జ్ఞాపకాలు. వర్తమాన పరిస్థితులను ప్రతిబింబించే కవిత్వాన్ని రాయడం నాకు ఇష్టం. బహుశ రాజకీయ పరిస్థితుల మీద నేను ఈ మధ్య కాలంలో రాసినంతగా మరొకరు రాసి ఉండరు. ఒక దీర్ఘ కావ్యం రాసే యత్నం కొనసాగుతున్నది.

**భావజాల పరంగా మీ తొలికవితా సంపుటి 'గుండె కిందతడి' నుండి నేటి వరకు మీ పరిణతిని వివరించండి.**

అభ్యుదయం, మానవీయం, అస్తిత్వ ఉద్యమం వంటి భావాలు నా కవిత్వం నిండా కనిపిస్తాయి. వర్తమాన కవితా రీతులు ఆకళింపు చేసుకొంటూ నిత్య విద్యార్థిగా రచనలు కొనసాగిస్తున్నాను. వస్తువును కవితా వస్తువుగా తీర్చిదిద్దే రసవిద్య నాకు పట్టుబడిందనే భావన నాకు కలిగింది. సాహిత్య అధ్యయనం, కవిత్వ రచననే నా ఇప్పటి వ్యాపకం.

**సంక్లిష్టమవుతున్న సామాజిక పరిస్థితుల్లో కవిత్వ భవిష్యత్తు?**

ఏ పరిస్థితుల్లోనైనా కవిత్వం వేయి కాంతులు వెదజల్లుతుంది. మనిషికి హృదయమూ, మెదడూ ఉన్నంత కాలం కవిత్వం హమేషా నిలిచే ఉంటుంది.

**'మరో బ్రేకింగ్ న్యూస్' మీ నుండి పాఠకులు ఆశించవచ్చా?**

**రచనలు...**

1. గుండెకింద తడి
2. రంగు వెలసిన జెండా
3. రహస్యాలు లేనివాళ్ళు
4. మనిషెళ్ళి పోతుండు
5. నిషేధానంతర నానీలు
6. నూరు తెలంగాణ నానీలు
7. గడపదాటని యుద్ధం (నానీలు)
8. బ్రేకింగ్ న్యూస్
9. తొణకని వాక్యం
10. నాన్నా! నాలా ఎదుగు
11. అంతర్వాహిని
12. హరితస్వప్నం



'హరితస్వప్నం' కవితా సంపుటి ఈ నెలాఖరుకు ఆవిష్కరించుకోవలసి ఉంది. దాని తర్వాత మరో కొత్త సంపుటి తెచ్చే ప్రయత్నంలో ఉన్నాను. ప్రచురణ ఖరీదైంది మిత్రమా!

**నేటి యువ రచయితలకు మీ రిచ్చే సూచనలేమిటి?**

ఇప్పటికే కొంత మంది పుట్టుకతో వృద్ధులున్నారు. మూస పద్ధతిలో కవిత్వం రాస్తున్నారు. అచ్చువేస్తున్నారు. వర్తమాన కవిత్వ అధ్యయనం చేయాల్సి ఉంది. భిన్నంగా చెప్పండి, ఆలోచించండి కవిగా రాణించలేమని గుర్తించుకోవాలి. మీరు గమనిస్తున్నరో లేదో చాలా శతకాలు వస్తున్నాయి. శతక లక్షణాలున్న కొత్తగా చెప్పే అంశాలు కొరవడుతున్నాయి. వేమన, బద్దెన, కరుణ శ్రీ, శ్రీశ్రీ వంటి వాళ్ళూ శతకాలు రాశారు. అభివ్యక్తిలోను, వస్తువులోనూ ఎంతో వైవిధ్యం కనిపిస్తాయి. ఆధునిక కవుల్లో ఆపద్ధతి నాకు కనిపించట్లేదు కొత్తగా చెప్పాలి. అప్పుడే మనం నిలబడతాం.

**మీ 'నూరు తెలంగాణ నానీలు' ఉద్యమ కాలంలో నినాదాలైనాయి. భావజాల విస్తృతికి పనికి వచ్చాయి. అంత ఘాటుగా ఎందుకు స్పందించారు?**

అవును మీరన్నది నిజమే. 'ఇప్పుడు రాకుంటే తెలంగాణ మరెప్పుడు సిద్ధించదు' అన్న కె.సి.ఆర్ మాట జీర్ణించుకున్న. ఆచార్య ఎన్. గోపి గారు అప్పట్లో నేను రాసిన 'రానీలు' (రాజకీయనీతులు) చదివి అభినందించారు. నానీల ప్రక్రియలో విజయవంతంగా రచనలు వస్తున్న కాలంలో ఏకాంశతో నానీలు రాస్తే బాగుంటుందని భావించి 'తెలంగాణ ఉద్యమ' స్ఫూర్తిని అందిపుచ్చుకొని రాసినవి. అమానవీయంగా ప్రవర్తించిన సమైక్య వాదుల పైన నా స్పందన అది.

**మీ 'అరే బేటా కామోష్' కవిత వివాదస్పదమై, చర్చనీయమైందని విన్నాను వివరించండి.**



మీకు ఇంతకు ముందే వివరించాను, శేషేంద్ర నా అభిమాన కవి. ప్రత్యక్షంగా ఆయన్ను చూసింది ఆయన షష్టిపూర్తి రోజునే. వారి స్వగృహంలో. ఆయన జీవితం, ఆయన భావజాలం ఒకటిగా లేవు అనిపించాయి. కవిత్వం ఆయన శ్వాస కాదు. ఒక ఫ్యాషన్ అనిపించింది. కామోత్సవ్ రచన చదివితే ఏదో ఆవేశం నా చేత ఆ కవిత రాయించింది. అది ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చింది. బహుశా శేషేంద్ర కవితా జీవితంలో అంతా డ్యామేజ్ చేసిన పోయెం మరోటి ఉండకపోవచ్చు. వారే స్వయంగా కొంత కాలం కవిత్వ రచన మానుకున్నాను అన్నారు. ఆ కవిత అచ్చు కావడంతో కాంట్రవర్సి మొదలైంది. గాంధీస్మారక సమితి వారు విజయవాడలో నాకవితను పేర్కొంటూ 'కామోత్సవ్'ను ఆపమని కేసు వేశారు. ఆగిపోయింది కూడా. దానితో ఒక గుర్తింపు. అనేక మందలింపులు, బోలెడు పేరు నాకు వచ్చినవి. వారితో మరో కవితా వేదికలో సారస్వత పరిషత్‌లో పాలుపంచుకోవడం జరిగింది. ఆనాటి కవితను వారెంతో మెచ్చుకున్నారు. జీవితం, కవిత్వం ఒకటిగానే ఉండాలనే భావన నాలో బలంగా ఉండే అంశం. ఆనాటి చర్చల్లో అరసం మిత్రులు, ఆవంత్స సోమసుందర్ వంటి ప్రముఖులు నాకు అండగా నిలిచారు. సినారె వంటి వాళ్ళు మందలించారు. అంతా మంచికే జరిగింది. రాయక తప్పని పరిస్థితులు నాకు కలిగాయి.

**వచన కవిత్వంలో ఉద్యమాలు, వాదాలు, ధోరణుల వెంట మీరు నడవక పోవడానికి కారణమేమిటి?**

అట్లా ముద్రాంకితాలు ఏమీ లేవుగాని, నేను స్త్రీ, దళితవాద కవిత్వం బలంగానే రాశాను. అస్తిత్వ ఉద్యమ రచనలు మీకు తెలిసినవే.

**సాహిత్య వాతావరణం మీ ఇంట్లో (వనజాత కథలు, మీరు కవిత్వం) ఎట్లా ఉంటుంది?**

వివాద రహితంగా ఉంటుంది. వనజాత అరుదైన కథకురాలు, ఎన్నో వస్తువులు దగ్గర పెట్టుకుంది. ఉద్యోగరీత్య ఆమె జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, తీరిక ఉండదు. ఆమె నాకు తొలిశ్రోత, నేను ఆమెకు తొలి పాఠకున్ని, నాకు ప్రేరణ కూడా ఆమెనే వివాహానంతరం ఉద్యోగ క్రమంలో బదిలీ పై వరంగల్ వెళ్ళింది. తాను అక్కడ నేను మహబూబ్‌నగర్‌లో టీచర్ను. పిల్లలు హైద్రాబాదులో ఆ ఒంటరితనం, వనజాత సహచర్యలుప్తి నాచేత 'అంతర్వాహిణి' కవితా సంపుటిని రాయించింది. నేను వనజాత గురించి రాసినా, సగటు ఉద్యోగం చేసే మహిళల పరిస్థితి, ప్రాధాన్యతలను వ్యక్తం చేశాను అందులో.

**చివరగా మీ కుటుంబం గురించి చెప్పండి?**

నేను, వనజాత, ఇద్దరబ్బాయిలు. అందరికి వివాహాలు అయినాయి. ఉన్నత చదువులు చదువుకుని ఎవరి జీవితాన్ని వాళ్ళు అనుభవిస్తున్నారు. నన్ను కవిత్వానికి వదిలేశారు. నాకో మనవడు. వాడి కోసం 'మనుమసిద్ధి' కవితా సంపుటిని ప్రకటించాను. 'మూడు కథలు, ఆరు కవితలతో' మా ఇల్లు పరిమళం వెదజల్లుతున్నది.

**ధన్యవాదాలు సార్**

కృతజ్ఞతలు మిత్రమా!

వ్యాసం

# మొదటి ఆఫ్రికన్ అమెరికన్ నోబెల్ సాహిత్య విజేత

సాహిత్యంలో ఎగిసిన కెరటం...



డా॥ బాణాల శ్రీనివాసరావు

విశ్వవిఖ్యాత రచయిత్రి టోనీ మారిసన్ అసలు పేరు చోలే ఆంటోని వాఫోర్డ్. హెరీవార్డులో ఉంటున్నప్పుడు “చోలే” అన్న పేరును ప్రజలు తప్పుగా ఉచ్చరించడం మూలాన టోనీగా మార్చుకుంది.

కానీ తర్వాతి కాలంలో తన పేరును అలా మార్చుకున్నందుకు చాలా పశ్చాత్తాపపడి చివరికి తనకు చోలే ఆంటోని వాఫోర్డ్ అనే పేరంటేనే ఇష్టమని చెప్పింది. టోనీ మారిసన్ ఫిబ్రవరి 18, 1931లో అమెరికాలోని లోరేనేలో జన్మించి అమెరికన్ సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో తనదైన సొంత శైలిలో రచనలు చేసి ఒక unique రచయిత్రిగా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఒక నవలాకారిణిగా, వ్యాసకర్తగా, ఎడిటర్‌గా కాలేజీలో ప్రొఫెసర్‌గా రాణించారు. ఆమె మొదటి నవల ‘The Bluest Eye’ 1970లో ప్రచురించబడింది. ‘Song of Solomon’ అనే రచనతో అంతర్జాతీయ సాహిత్య ప్రియుల మరియు విమర్శకులచే గుర్తించబడి ‘National Book Critics’ అవార్డ్‌ని గెలుచుకుంది. 1958లో Harold Morrisonతో టోనీ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు Slade Morrison. Harold Ford Morrison.



టోనీ మారిసన్ హరోల్డ్ మారిసన్ తో 1964లో విడిపోయింది. టోనీ మారిసన్ రాసిన ముఖ్య మైన రచనల్లో ‘The Bluest Eye’ 1970, ‘Sula’ 1973, ‘Song of Solomon’ 1977, The Beloved 1987. ఆమె అన్నీ రచనల్లో crystalగా కనిపించే అంశం అమెరికాలోని నల్లజాతి మహిళలు తమ రోజు వారి జీవితాల్లో ఎదుర్కొనే రకరకాల సమస్యలు. ఆమె తన రచనలతో వారి జీవితాలను ప్రభావితం చేయాలని, వాళ్ళు తన రచనలు చదివి వాళ్ళ జీవితాల్లో ఎదురయ్యే సవాళ్లను యెదుర్కొనేందుకు వారి గుండెలనిండా ధైర్యం నింపే ప్రయత్నం చేసింది.

ఇంకో ముఖ్యమైన అంశం ఆ నల్లజాతి స్త్రీలు తమ నల్లజాతీయుల గుర్తింపు కోసం యెంత ధృఢ సంకల్పంతో సమస్యలతో పోరాడుతూ ముందుకు సాగుతున్నారో తెలుస్తుంది. ముఖ్యంగా ఆమె ఉపయోగించే భాష ఆమె ఊహాశాలీనత, రకాల మలుపులతో నిండి ఉన్న కవిత్వ శైలి ఆమె రచనలకు వన్నె తెచ్చి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డ్స్ రావడానికి దోహదపడినాయి. ఆమె రాసిన నవల ‘The Beloved’కి 1987 పులిట్జర్ ప్రైజ్ వచ్చింది. అదే విధంగా ఆమె సాహిత్యానికి గుర్తింపుగా 1993లో నోబెల్ ప్రైజ్ దక్కించుకున్న

వ్యాసం

అమెరికన్ 8వ రచయిత్రిగా ఆఫ్రికన్ అమెరికన్ మొదటి రచయిత్రిగా ఆమె సాధించిన ఘనతగా చెప్పుకోవచ్చు. తర్వాత ఆమెకు US presidential Medal of freedom award కూడా దక్కింది. ఒక నల్లజాతి మహిళగా తన తోటి నల్ల జాతి మహిళలు ఎలా సమాజంలో అవమానాలకు గురి అవుతున్నారో అతి దగ్గరగా చూసి రచనలు చేసిన నల్లజాతి రచయిత్రిగా ప్రపంచ సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. తన రచనలన్నీ నల్ల అమెరికన్లకు జరుగుతున్న అన్యాయం గురించి, అక్కడున్న జాత్యహంకారం పోకడలకు వ్యతిరేకంగా నల్ల అమెరికన్ల విముక్తి కోసం రాసినవే.

ఇక ఆమె విద్యాభ్యాసం లోరైనలోని Howard Universityలో 1953లో ఇంగ్లీష్ సాహిత్యంతో B.A చేసింది. 1955లో Cornell University నుంచి Masters degree పొందింది. మారిసన్ చిన్నతనంలో అమెరికాలోని Midwest ప్రాంతంలో పెరగడం వల్ల నల్లవారి జీవితమన్న బ్లాక్ సంస్కృతి అన్నా ఎనలేని మమకారం పెరిగింది. ఆ సంస్కృతిలోని పాటలు పాడడం, కథలు వినడం చెప్పడం, జనపద కథలు వినడం వల్ల ఆమె సాహిత్యాన్ని అంతా ఒరిజినల్‌గా రాయగలిగింది. కొంత కాలం టెక్సాస్‌లో బోధన చేసి Howard University కెళ్ళి అక్కడ 1957 నుంచి 1964 వరకు సాహిత్యాన్ని బోధించారు. 1965 నుంచి ప్రఖ్యాత రాండమ్ హౌస్‌లో Fiction ఎడిటర్‌గా పనిచేసి 1984 నుంచి Albanyలోని State University of Newyorkలో బోదించారు .1989లో Princeton Universityలో పనిచేసి 2006లో రిటైర్ అయ్యారు. టోనీ మారిసన్ ప్రఖ్యాత నవల 'The Bluest Eye'లో ఒక నల్లజాతి యుక్త వయస్సు మహిళతన చుట్టూ ఉన్న తెల్లవాళ్ళ అందాన్ని చూసి తాను అంతా అందంగా లేనని బాధ పడుతుంది. తన కళ్లు కూడా తెల్లవాళ్ళ కళ్ళలాగా నీలంగా ఉంటే బాగుండుననుకుంటుంది .మరో నవల 'Sula' లో రోజురోజుకూ మారుతున్న సామాజిక కట్టుబాట్లను, స్నేహ సంబంధాలను narrate చేస్తుంది. Song of Soloman, identity crisis ఆధారంగా రాయబడింది. 'Beloved' నవలలో ఒక పారిపోయిన బానిస స్త్రీ తన సొంత బిడ్డనే చంపుకుంటుంది. ఎందుకంటే తన కూతురు బతుకు ఈ బానిస బతుకు రొంపిలో పడకూడదని. ఈ నవల 1998లో చలనచిత్రంగా వచ్చింది. Oprah Winfreyలో ప్రధాన పాత్ర పోషించారు. టోనీ మారిసన్ ప్రతిభావంతమైన రచయిత్రే కాక అద్భుతమైన కవయిత్రి కూడా. కవయిత్రిగా రాసిలో తక్కువగా రాసినా వాసిలో మాత్రం ఆలోచనాత్మకమైన కవితల్ని అల్లారు. "Five poems" అనే శీర్షికతో కవిత్వ సంకలనాన్ని వెలువరించారు.

తన జీవిత కాలమంతా అమెరికాలోని తన నల్లజాతివారి కోసం అంకితమై రచనలు చేసిన సాహితీమూర్తి టోనీ మారిసన్. సాహితీ ప్రియులందరు తప్పక చదవవలసిన రచయిత్రి.

---

కవిత

# మాటల కెరటాలు

**ఆచార్య ఎన్వీ సత్యనారాయణ**



ఆడపిల్లల్ని మాట్లాడనివ్వండి
అలలు అలలుగా ఎగిసిపడనివ్వండి
సంకోచాలు లేకుండా
సందేహాలు లేకుండా
సంభాషణా పరిమళాలు వెదజల్లనివ్వండి

అది ఇష్టాగోష్టి సన్నివేశం కావచ్చు
వక్తృత్వ ప్రతిభ పోటీ కావచ్చు
ఊసుపోక కబుర్లే కావచ్చు
ఊకదంపుడు ఉపన్యాసమే కావచ్చు

సందర్భం ఏమిటన్నది కానేకాదు ప్రాతిపదిక
వాళ్ళను వాళ్ళు వ్యక్తీకరించుకోనివ్వండి

ఒక పద్ధతి ప్రకారం మాట్లాడలేదంటారా?
అసలిప్పుడే కదా వాళ్ల నోరు తెరిచింది
తిట్లూ శాపనార్థాలూ పెడుతున్నారంటారా?
ఆగ్రహానికి అక్షరాలు తొడుగుతున్నారేమో!
ఆవేశానికి భాషనిస్తున్నారేమో!

మిత్రులారా!
వాళ్ళ మాటలు ప్రవాహానికి అడ్డుకట్టలు వేయొద్దు
ఆటంక పరచొద్దు మాట్లాడనివ్వండి
శతాబ్దాలుగా కోల్పోయిన అవకాశాల కోసమే కాదు
ఇప్పుడిక కూలిపోతున్న విశ్వాసాల కోసమైనా
వాళ్ళను మాట్లాడనివ్వండి



వ్యాసం

# విద్వన్మణి పి.వి.

పీవీ పాండితీ ప్రభను చెప్పిన వ్యాసం...



డా॥ రేవూరు అనంతపద్మనాభ రావు
విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్

"ఎవరీ పాములవర్తి వంశంలో!
ఇగురొత్తిన చిరంజీవి
ఎవరో కాదు భాషా పరశేష భోగి!
కలములో లేమిలో తలపెంచని,
వంచని కర్మయోగి"

అని డా॥ సి. నారాయణ రెడ్డి పి.వి.నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన సందర్భంలో ప్రస్తుతించారు.

పి.వి. రాజకీయాలలో చాణక్యుడు. ఆయన సాహితీ రచనలు లోకానికి అంతగా తెలియవు. వివిధ సాహితీ ప్రక్రియలలో తలస్పర్శిగా రచనలు చేసి కవి పండితుల ప్రశంసలందుకొన్న విద్వన్మణి. ఛందోబద్ధమైన పద్యం, భావ గర్భితమైన రచన కవిత, సంభాషణాత్మకమైన కథ, సన్నివేశ కల్పితమైన నవలిక.. ఇలా అన్ని ప్రక్రియలలోనూ పి.వి. తనదైన శైలి ప్రకటించాడు.

'జయచంద్రా! హైందవ ధ్వంసకా!" అనే ఛందోబద్ధ కవిత్వాన్ని చిన్నతనం లో ప్రచురించాడు. ప్రేమ- ప్రణయం అనే ఖండకావ్యం అమలిన శృంగార రస సృష్టి. ఆశు కవితా సరళిలో సాగింది. "కఠినునికైన ఆగునే కంట నీరు". అప్పట్లో కాకతీయ వార పత్రికలో 'జయవిజయ' అనే కలం పేరుతో ఎన్నో వ్యంగ్య రచనలు చేశారు. స్వాతంత్ర్యం అర్థరాత్రి వచ్చింది. దీనిని సూచిస్తూ...

'ఆనిద్రాణ నిశీథిని మానిసి మేల్కొంచినాడు' అనే సుదీర్ఘ వచన కవితను శాసనసభ లో స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా 1972 ఆగష్టు లో ముఖ్యమంత్రి గా చదివి వినిపించారు పి.వి.

**పి.వి. శతజయంతి సభ...**

హైదరాబాద్ లో 2020 జూన్ 28న పి.వి. శతజయంతి ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైభవోపేతంగా నిర్వహించింది. ఆ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, స్వయంగా భాషావేత్త అయిన శ్రీ.కె.చంద్రశేఖర రావు పి.వి. బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు. విశ్వనాథ వారి వేయి పడగలు నవల క్లిష్టమైనదనీ దీనిని హిందీ లోకి పి.వి. తర్జుమా చేయడం అనువాదం కాక 'అనుసృజన' అన్నారు. పి.వి. రసజ్ఞత గల వ్యక్తి అని వర్ణిస్తూ ముఖ్యమంత్రి భర్తృహరి సుభాషితాన్ని గుర్తు చేశారు.

'చదువది ఎంతకల్గిన రసజ్ఞత
యించుక చాలకున్న ఆ
చదువు నిరర్థకం - గుణ
సంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటన్"

అంటూ పి.వి. రసజ్ఞత గల వ్యక్తిగా పేర్కొన్నారు.

**భావావేశపూరిత కవిత....**

ఆయన కవిత ను ఆస్వాదిస్తుంటే కవితా సౌందర్యం పురివిప్పి నృత్యం చేసిన వాసంత మయూరం వలె భాసిస్తుంది. ఆయన భావుకుడు పరిణత రాజనీతిజ్ఞుడు, కర్మయోగి, బహుభాషావేత్త. అత్యంత సున్నిత హృదయుడు. స్వాతంత్ర్య రజతోత్సవ శుభ సందర్భంలో వినిపించిన కవితతో ఎన్నో ప్రశ్నలు గుప్పించి వాటికి తానే సమాధానం పలికాడు

"భూమి దీన గ్రహమై పోవ రోదసిని
మధించి
మానవతా వాహనకై పూనుకొన్న
రాజ్యేందిర
జయదుందుభి విని ఉత్తేజము
పొందునా పౌరుడు" అంటూ సమాధానం గా "అవునని, అవునని, అవునేనని జన వాక్యాలు' అని శుభాశంసన.

వ్యంగ్య భరిత కవితా స్ఫూర్తి:- వరంగల్ లో పివి, కాళోజీ ఆత్మీయ మిత్రులు. కాళోజీ షష్టి పూర్తి ని మిత్రులు ఘనంగా జరిపారు. శుభాకాంక్షలు కవితాత్మకంగా పంపారు. పి.వి. అందులో కాళోజీ నిర్మొహమాట ధోరణిని వ్యంగ్యంగా ప్రస్తావించారు.

" సూక్తులు, శాపములును పునరుక్తి
దోహమందకుండ
జగత్తు నభిశంసించుచు
శతవత్సరములు దాటుము"

వ్యాసం

అని శతాయుష్మాన్ భవ అని ఆకాంక్షిస్తూ చివరి పంక్తు లిలా మలచారు.

"బ్రహ్మ నీకు పొరపాటున పాపుల నియమిచ్చు గాక

కాలుడు. అ కాళయ్యను కలకాలము మరచు గాక" అను

పాపీ చిరాయుః అనే నానుడిని గుర్తు చేశారు.

మంగయ్య అదృష్టం: ఇది ఒక సృజనాత్మక నవలిక. ఆంధ్ర ప్రభ వార పత్రిక దీపావళి ప్రత్యేక సంచిక (1999 నవంబరు)లో ప్రచురితమైంది. పి.వి.ఎంతటి గంభీరుడో అంతటి చతురుడు. వ్యంగ్య ధోరణిలో మంగయ్య పాత్ర ను సృష్టించారు. మంగయ్య ఒక నిరుపేద. అనాకారి. దౌర్భాగ్య జీవనుడు. కాలం, కర్మం కలిసి వచ్చాయి. అతడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగాడు.లోక సహజమైన సన్నివేశాలతో పి.వి.కథను మలిచాడు. సాంఘిక ఇతివృత్తానికి పౌరాణిక స్పర్శ కల్పించాడు. బ్రహ్మ దేవుడు మంగయ్య జాతకం లో అదృష్ట రేఖను లిఖించాడు. ఆయనది భాగ్యలేఖన శాఖగా వర్ణించారు. సాధారణంగా ప్రభుత్వోద్యోగాలలో ఒక శాఖ వారిపై మరొక శాఖ వారు కక్ష గడతారు. పీత మనస్తత్వం సహజం. కిందికి దిగలాగడం అలవాటు. మంగయ్య జీవితం లో అదే జరిగింది. బ్రహ్మ మీద మిగిలిన దేవతలందరూ తిరుగుబాటు చేశారు. ఆ వర్గం లో బ్రహ్మ గారి భార్య సరస్వతి కూడా చేరింది. మంగయ్య వ్యక్తిగత జీవన పోరాటం అద్భుతంగా చిత్రించారు పి.వి.

**కథాకథన శిల్పి...**

కాకతీయ పత్రిక సహసంపాదకత్వం నెరపుతున్న రోజుల్లో పి.వి.వయస్సు 28 సంవత్సరాలు. 'విజయ' అనే కలం పేరుతో 1949 ఆగష్టు 15 సంచికలో 'రామవ్వ' కథను పి.వి.ప్రచురించారు. కథ చదివినంత సేపు ఉత్కంఠ భరితంగా సాగుతుంది. మారుమూల కుగ్రామమది. నిజాం పరిపాలన కాలం. ముసలి రామవ్వకు మల్లి అనే మనుమరాలుంది. ఓ అర్థరాత్రి వేళ ఆ అవ్వ యింటి తలుపు చప్పుడయింది. రజాకార్ల ఆగడాలతో భయకంపితులవుతున్న రోజులవి. ఆమె సందేహిస్తూ తలుపు తీయలేదు. కిటికీ గుండా కటిక చీకటి లో ఓ యువకుడు ఇంట్లో జొరబడ్డాడు. మనుమరాలి శీలం చెరచవద్దని అతడి కాళ్లు పట్టుకొంది. అతడు పోలీసులకు భయపడి వచ్చాడు ఆమె అతనికి ఆశ్రయానిచ్చింది.

అతడు అప్పుడే ఇద్దరు పోలీసుల్ని చంపి వచ్చాడు. వీళ్ల గాలిస్తూ రామవ్వ ఇంటి తలుపు తట్టారు. ఆమె అతనికి గొల్లోని వేషం వేయించింది. మల్లిని అతని మంచంపై దగ్గరగా పడుకొని పైన చేయి వేయమంది దీపం ఆర్పి వేసింది. పోలీసులు లోపలికి ప్రవేశించారు. అతడు తన మల్లడనీ, వారిద్దరూ భార్యాభర్తలనీ బొంకి వారిని నమ్మించింది. వీరు వెళ్లిపోయారు. ధైర్య సాహసాలకూ, యుక్తి నైపుణ్యానికీ ప్రతీకగా రామవ్వను పి.వి.చిత్రించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అ యువకుని రక్షించింది ఆసాంతం చదివించే కథనం పి.వి.సొత్తు.

**కళ్లు తెరిపించిన సంఘటన...**

సమాజంలో రకరకాల వ్యక్తులుంటారు. మానభంగాలు, దౌర్జన్యాలకు పాల్పడతారు. మతకలహాలను రెచ్చగొడతారు. వారి కళ్లు తెరిపించే ఒక అద్భుత సన్నివేశాన్ని పి.వి- "బ్లూ షిల్క్ శారీ" అనే ఆంగ్ల కథ

**ఈ** గల్పికలో కూడా ఒక మంత్రి గారి ఛాంబర్ లో జరిగిన ఉదంతాన్ని చిత్రీకరించారు. ఆయన గదిలో గొంతెమ్మ కోర్కెలతో వచ్చిన నాయకులున్నారు. ఒకరు తన కుమారునికి ఇంజనీరింగ్ కాలేజిలో (తక్కువ మార్కులు వచ్చినా) సీటు ఇప్పించమని నిర్బంధించారు. రూల్స్ అంగీకరించవని మంత్రి చెబితే నాయకుడు ఎదురు తిరిగి - ఈ సమాధానం చెప్పడానికి గుమాస్తాలు -మంత్రిగారక్కర్లేదని వాదిస్తాడు. ఇలా రకరకాల వ్యక్తులు మంత్రి పై వొత్తిడి తెస్తారు. నిజ జీవితంలో జరిగే వృత్తాంతాల చిత్రణ ఇది.



వ్యాసం

రాశారు. దానిని 'నీలం సిల్కు చీర' పేరుతో తెలుగులో ప్రచురించారు. ఇందులో పరమ కిరాతకుడైన కథానాయకుడు అక్రమార్జిత విత్తం సంపాదించాడు. అతనికి వ్యభిచార గృహాలకు వెళ్లే అలవాటుంది. ఒక రోజు బొంబాయి 'రెడ్ లైట్' ప్రాంతానికి వెళ్లాడు. పడుపు వృత్తిలో వున్న ఓ యువతిని ఆ రాత్రికి ఎంపిక చేసుకొన్నారు. నీలి రంగు మేలిముసుగు లో వున్న ఆ యువతి అందం అతని నాకర్షించింది. ఇద్దరూ గదిలోకి ప్రవేశించారు. ఆమె నీలం ముసుగు తొలగించింది. ఆమెను చూచిన అతడు దిగ్భ్రాంతి చెందాడు. అమె తన స్వంత చెల్లెలు. కొంత కాలం క్రితం మతకలహాలలో ఆమెను దుండగులు అపహరించుకొని పోయి బొంబాయిలో వేశ్య గృహానికి అమ్మి వేశారు. ఎంతకూ ఇంటికి రాని అమె దుండగుల చేతిలో మరణించి ఉంటుందని కుటుంబీకులు భావించి సరిపెట్టుకున్నారు. ఈ కథలో మానవీయ కోణం ప్రస్ఫుటమవుతుంది.

**అనువాద సరళి...**

విశ్వనాథ వారి వేయిపడగలను సహస్ర ఫణ్ గా పి.వి. అనుసృజన చేశారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద బహుమతి లభించింది. మరాఠీ నుండి హరి నారాయణ ఆప్టే నవలను -అబలా జీవితం- పేర తెనిగించారు. ఆ విధంగా రెండు పెద్ద నవలలను అనువదించడం ద్వారా ఆయన అనుసృజన సాహిత్య లోకంలో ప్రసిద్ధమైంది.

ఆంగ్లానువాదం: జయప్రభ కవిత లను పి.వి. ఆంగ్లంలోకి అనువదించారు. మచ్చుకు ఒక కవిత.

Iam untimely Death campaign
I cannot open the door
Into this abandoned Island
Again in Daytime
Frozen like a sea of snow
Ecsatasy like Shivas dance

ఇందులో వాడిన ఆంగ్ల పదజాలం పి.వి. ఆంగ్ల భాషా పాండిత్యాన్ని వెల్లడిస్తుంది.

తెలుగు నుండి హిందీ, తెలుగు నుండి ఆంగ్లం మరాఠీ నుండి తెలుగు ఇలా అనువాదకుడిగా పి.వి. అగ్రశ్రేణిలో నిలుస్తారు.

**మంత్రుల ఇబ్బందులు...**

ప్రభుత్వంలో పనిచేసే మంత్రులకు రాజకీయ నాయకుల నుండి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రి గా పి.వి. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితం గడిపారు. నిజ జీవితంలో తాను ఎదుర్కొన్న సంఘటనలను - SOR ROWS OF A MINISTER అనే గల్పికలో చమత్కార భరితంగా వర్ణించారు. ఆత్మకథ Insiderలో కూడా ఆయన ఉద్వేగ భరితమైన ఎన్నో చారిత్రకాంశాలను సృజనాత్మకంగా వర్ణించారు.

ఈ గల్పికలో కూడా ఒక మంత్రి గారి ఛాంబర్‌లో జరిగిన ఉదంతాన్ని చిత్రీకరించారు. ఆయన గదిలో గొంతెమ్మ కోర్కెలతో వచ్చిన నాయకులున్నారు. ఒకరు తన కుమారునికి ఇంజనీరింగ్ కాలేజిలో (తక్కువ మార్కులు వచ్చినా) సీటు ఇప్పించమని నిర్బంధించారు. రూల్స్ అంగీకరించవని మంత్రి చెబితే నాయకుడు ఎదురు తిరిగి - ఈ సమాధానం చెప్పడానికి గుమాస్తాలు - మంత్రిగారక్కర్లేదని వాదిస్తాడు. ఇలా రకరకాల వ్యక్తులు మంత్రి పై వొత్తిడి తెస్తారు. నిజ జీవితంలో జరిగే వృత్తాంతాల చిత్రణ ఇది. పి.వి. కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, పద్యకవిగా, అనువాదకుడిగా, బహుభాషావేత్త గా, పత్రికా రచయితగా, బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజకీయాలలో ఎంతటి చతురుడో, సాహిత్యం లోనూ అంతటి చాతుర్యం గల విద్వన్మణి.

---

**కథల పోటీకి చివరి తేదీ పొడగింపు**

ఫిబ్రవరి 16-28, 2021 తంగేడు 9 సంచికలో కథల పోటీ గురించి ప్రకటనవచ్చింది. అందులో పోటీకి కథలు పంపడానికి చివరి తేదీ మార్చ్ 10, 2021 గా ప్రకటించాం. చాల మంది కథా రచయితలు ఈ సమయం పొడగించమని కోరుతున్నారు. ఈ వరకే చాలా కథలు వచ్చాయి అయినా రచయితలంతా ఈ పోటీలో పాల్గొనాలని మా అభిలాష. మీ సృజన చైతన్యానికి పూర్తి అవకాశం ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నాం. కథా రచయితల విజ్ఞప్తి మేరకు ఈ చివరి తేదీని మార్చ్ 25, 2021గా వరకు పొడిగిస్తున్నాం. తరవాత ఎట్టి పరిస్థితిలోను తేదీ తిరిగి పొడిగించడం కుదరదు. గడువు దాటినాక వచ్చిన ఏ కథను పరిశీలించలేం. కథా రచయితలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. అప్పటి ప్రకటనలోని మిగతా విషయాలన్నీ యాథాతథంగా వర్తిస్తాయి.

**- ఎడిటర్**

కవిత

# కాకతీయ వైభవం

డా. సి.వి. జయవీర రాజు

ఆ.వె. తెలుగు గడ్డపై పౌరుషమ్మొలకించు
ఓరుగల్లు జూడ ఒనర నొప్పు
కాకతీయ రాజ క్షత్రియ ధర్మాన్ని
కనగ దెలియు మనకు కాంచు ధీర!

తే.గీ. స్తంభములు వేయి చక్కని సౌధ మందు
వెలసె రుద్రేశ్వరాలయం బిలను జేర
పూజలను గాను వరములు పుణ్యతమున
కాకతీయుల దైవమై కాంచు చుండు

తే.గీ. కుడ్యములపైన నృత్యాల కూర్పునేర్పు
శిల్ప కళలెన్నొ చక్కగా చిత్రమలెరు
నాట్య భంగిమలెన్నియో నాణ్యమెప్పు
కనగ తీరును కోరికల్ కన్నులార!

సీ: ప్రాకారములు జూడ ప్రాభవమ్మును దెల్పు
రాజుల వైభవ రాజ్యమందు
దేవాల యాల్జూడ దైవత్యమెప్పుడు
భక్తి పాటవమున రక్తిగల్గు
సాహిత్య మును జూడ చవులూరు చుండును
సంగీత నాట్యాల సరసమాడ
రాజ్య పాలన జూడ పూజ్యతనే గల్గు
ప్రజల మేలుగలుగ ప్రభుత నిలుచు

కవుల పోషణ కావ్యాల కవనమందు
వృత్తి ధర్మాల నెగడు ప్రవృత్తులందు
తృప్తి గలిగించు జీవన తీరులందు
ఘనత కెక్కిరి కాకాతికైతలందు!

ఆ.వె. ప్రజల క్షేమ మరసి పనులను జేయగా
కాకతీయ రాజ్య ఘనత తెలియ
చూడ నిచ్ఛగించు చూడ్కుల కనువిందు
కనగ వలయు గాని కాంక్ష దీరు



సమాజం

# ఆవుల పిచ్చయ్య కథలో సమాజం

**స్వచ్ఛమైన రచనలో నాటి సాంఘిక స్థితి...**



డా॥ కాంచనపల్లి గోరా

ఆవుల పిచ్చయ్య ఉద్యమకారుడు. పోరాటయోధుడు. రచయిత. కమ్యూనిస్టు రాజ్యం రావడానికి ఇంకెంతో కాలం ఎదురు చూడవలసిన అవసరం లేదు. రష్యా చైనాలాగే మనదేశం కూడా కమ్యూనిస్టు దేశం అవుతుంది, అపుడు సొంత ఆస్తి అంటూ ఎవరికీ ఉండదు. కమ్యూన్లు ఏర్పడుతవి, అందరికీ పని, కూడు గుడ్డ, లభిస్తవి. సుఖశాంతులతో ఉండవచ్చు అని ఆశాభావం వెలిబుచ్చిన స్వాప్నికుడు. (దేవులపల్లి కృష్ణమూర్తి ఆవుల పిచ్చయ్య కవిలె తెలంగాణ పోరాటకతలకు రాసిన ముందు మాట) 1919లో సూర్యాపేటలో తెనుగోల్లు అనే కులానికి చెందిన బీద కుటుంబంలో పిచ్చయ్య జన్మించాడు. ఆంధ్ర మహాసభ నుండి 1944లో అతివాద కమ్యూనిస్ట్‌గా రూపాంతరం చెందిండు. పరిశోధకులకు దొరికినవి కొద్ది కథలే అయినా తెలంగాణ నాటి సమాజాన్ని బలంగా చిత్రించిండు. "వెట్టి చాకిరీ దినచర్య" అనే కథల్లో గ్రామాల్లో సాగిన వెట్టిచాకిరిని రికార్డ్ చేసిండు. నాటి ఊర్లల్లో మాల మాదిగలు కుమ్మరి చాకలి మంగలి వాళ్ళు, దొరలకు, జమీందార్లకు, పోలీస్ పటేల్ మాలీ పటేల్, పట్వారీల వంటి అధికారులకి వెట్టి చేయాలె. వెట్టి పని అంటే ఏ జీతం భత్యం లేకుండా పని చేయడం, సంవత్సరానికి ఒకసారి కళ్ళంలో ధాన్యం మార్పిడి అయినపుడు దొరల గ్రామాధికారుల కొంత ధాన్యాన్ని వెట్టి పనులవాళ్లకు కొలిచేవారు. వాళ్ళ సొంత వ్యవసాయం, మొదలైన పనులను వదలుకొని వెట్టి చేయడమే వాళ్ళ బాధ్యత.

"వెట్టి చాకలి దినచర్య" కథలో వాస్తవ పరిస్థితులను సాదాగా సీదాగా వ్యక్తం చేస్తరు. పిచ్చయ్య నాడు గ్రామాలలో వెట్టి చేసేవాని బతుకు ఎట్లా ఉండేదో చెబుతడు. ఆ ఊరికి అధికారి వచ్చినపుడు చాకలి రంగడు అధికారి తోటి దెబ్బలు తింటడు. పటేల్ తను లేడని చెప్పమంటే నిస్సహాయంగా తలూపుతడు. అధికారిని చివరికి మంచంలో కూచోపెట్టి స్నానం చేయిస్తడు. చివరికి అధికారి తను ఆశించింది జరుగక పోయేసరికల్లా అక్కడ నుండి బయలుదేరుతడు. చాకలికి మాత్రం అశ్రువులు మాత్రమే మిగులుతవి.

చాకలి ఇంటికి చేరేసరికి రాత్రి పది అవుతది. ఆ రోజు వర్షం కొడుతూ ఉంటది. చాకలి గుడిసె లోంచి నీరు బయటకు వెళ్ళడం లేదు. చంటి పిల్లలను పడుకోబెడదామంటే జనాబ్ స్నానం చేయడం వల్ల మంచం తడిచి పోయింది. కడుపుకు తిండి లేదు. చలికి నిదుర లేదు. భార్యభర్తలిద్దరూ ఆలోచించిండ్రు. గిరిదావరికి ఇంటి ముందు కచ్చడం బండి, ఇంటి వెనుక గుర్రం, ఎక్కడిది అది? బీద ప్రజలను పీల్చి పిప్పి చేసి సంపాదించింది. ఖానూను ఒకటి, వాళ్ళు చేసేది ఒకటి, "దేవుడు మన కర్మం గింతే రాసిండు" అని భార్య అంటే, అది మానవుడు చేసింది "కానీ దేవుడు చేసింది కాదు" అంటడు. పిచ్చయ్య కథలన్నిటికీ ఫలశ్రుతి లాంటి వాక్యాలు ఇవి.

ఆవుల పిచ్చయ్య మరో కథ లెవీ ధాన్యం వసూలుకు సంబంధించినది. "లెవీ ధాన్యం" అంటే మిగిలిన ధాన్యం. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిషు ప్రభుత్వం చేసిన ఖర్చు భారత దేశం గ్రామసీమల మీద పడింది. అక్కడి దేశ్‌ముఖులు జమీందార్లు బాగానే ఉన్నారు. వచ్చే అధికారులతో కుమ్మక్కయి తమ పంటలు బాగా పండుతలేవని రాయించుకొన్నరు. బక్క రైతులు మాత్రం బలైతరు. ఈ విషయం ఆవుల పిచ్చయ్య తన "దౌర" కథలో మనముందు జరిగినట్లు చిత్రించిండ్రు.

బక్కరైతులు లెవీ మాఫీ కోసం ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకుంటరు. తహసీల్దార్ ఈ విషయంగా తనఖీ చేసేందుకు దౌర వస్తడు. పోలీస్ పటేల్, మాలీ పటేల్, పనులు వెట్టివాళ్లకు పురమాయిస్తరు. హరిజనులు, చాకలి వారు, మంగలివారు, కుమ్మరివారు, వడ్రంగులు, మొత్తం గుంపులను చావడి వద్దకు పిలిపించి వాళ్ళ వాళ్లకు పని అప్పచెబుతరు. హరిజనులకు "మన గ్రామం రోడ్డుకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. అధికారి తోవ తప్పుతడు. కాబట్టి రోడ్డునుండి మన గ్రామం వైపు రాళ్ళ గుర్తులు వేయాలె", అని పురమాయిస్తరు. ఇంకొందరు హరిజనులను పిలిచి "మన జమీందారు గారు అధికారికి దావతు ఇస్తడో ఏమో? మీరు పోయి మన చెర్లో తుమ్మ చెట్టు నరికి పొయ్యిలోకి కట్టెలు తెండి, అవి పచ్చిగా ఉంటే ఏ రైతు చెలకలో ఎండిన

చెట్టుంటే అది నరికి కట్టెలు తెండి అని పురమాయిస్తరు. చావడికి చుట్టూ మందడి కట్టడానికి తరువాత బాటకు పెట్టిన రాళ్ళకు సున్నం వేయడానికి మంచాలు తేవడానికి చావడిలో పరదాలు కట్టడానికి దుప్పట్లు తేవడానికి పురమాయిస్తరు. మంగలి వాళ్ళకు "కత్తులు సాన బెట్టుకోండి క్షవరాలకు" అని చెబుతరు. కుమ్మరి వాళ్ళకు "అరేయ్, మీరు కుండలు తెండి, ఇప్పుడే ఒక పెద్ద కుండెడు నీళ్ళు పొయ్యెల పెట్టి చల్లార్చండి" అని చెబుతరు. పట్వారి మస్కూరిని పిలిచి "ఏమోయి, మొన్న గొర్రె పిల్ల ముట్టిగాడు తెచ్చాడు కదా, ఈ సారి వంతు ఎవరిదో తెలిసికో, ఒక గొర్రె పిల్ల తీసుకో, కొన్ని కోడిపిల్లలు కూడా సంపాదించు" అని చెబుతడు. "ఈ సారి పాలు పెరుగు ఎవరు పోస్తారో ఇంతేజాం చెయ్" అని పంపుతరు. కోమట్లను పిలిచి "మీదగ్గర సరైన సామానులు ఉంచండి, లేకుంటే బస్తీకి పొయ్యి సామానులు తీసుకురండి, నేను చీటీ పంపితే ఖాళీ చెయ్యొద్దు" అని చెబుతరు.

నాటి కథ కూడా ఉత్తమ పురుషలోకి రావడం విశేషం. రచయితే కథనానికి ప్రత్యక్ష సాక్షిగా ఉంటాడు.

తరువాత తహసీల్దార్ పెళ్లి లాంటి ఊరేగింపుతో ఊరిలోకి వస్తడు. ఒకరోజు విశ్రాంతి. రెండో రోజు జమీందార్ ఇంట్లో దావతు. మూడో రోజు బండ్లో కూచొని పొలాలు తనఖీ చేస్తడు. తహశీల్దార్ బండి పేద రైతు రంగయ్య పొలం దగ్గర నుండి వెడుతుంది. నాలుగు ఎకరాలలో మొదటగా ఉన్నది మాత్రం పచ్చపచ్చగా ఉంది. తక్కినవన్నీ రోగాలు తగిలి ఎండిపోయినవి. "బాగానే ఉంది" అని రాసుకున్నడు. తర్వాత త్రిమూర్తులు పోలీస్ పటేల్, మాలీ పటేల్, పట్వారీ చెరువు కింద జమీందార్ గారి పొలాన్ని చూడడానికి తీసుకెళ్ళారు. చెరువు చివరకు నీళ్ళు రాకుండా ఉన్న పొలాన్ని చూసి "అరెరే ఎండిపోయింది" అని రాసుకున్నడు. బండి దిగలేదు. దేనిని సరిగా చూడలేదు. తరువాత జమీందార్ చేతిలో చేయి కలిపి వెళ్లి పోయాడు.

రైతులు మా పంటలు చూడండని దరఖాస్తులు పెట్టుకుంటే జమీందారు ఇంట్లో విందులు, రాగాలు, భోగాలు. పేద రైతులు లేవీ కట్టవలసి వస్తే జమీందారు లేవీ మాఫీ అయింది. అధికారి పొట్ట నిండింది.

రచయిత కథలో సహజమైన భాష వాడుతడు. ఈ సేకరణలోనే ఊరేగింపు అని మరో కథ ఉంది.

ఇది కూడా ఉత్తమ పురుషలోనే సాగుతుంది. అమరజీవి కొమురయ్య వీర మరణానికి ఆ రోజు ఊరేగింపు జరుగుతుంది. "నేను అక్కడికే వెడుతున్నాను, నీవు కూడా రావయ్యా, అంటూ ఓ వృద్ధురాలు తాను కూడా ఊరేగింపులకు బయలు దేరుతుంది. పొలాల్లో నాటేసే స్త్రీలు, పట్వారి దగ్గర పని చేసే జీతగాళ్ళు, గొర్రెలు కాసే వాళ్ళు, మోట కొట్టేవాళ్ళు, ఇంట్లో అందరూ పాడిపంటలతో చల్లగా ఉండాలని ప్రాణత్యాగం చేసిన కొమురయ్య ఊరేగింపులో పాల్గొనడానికి వెళ్ళారు. కొమురయ్య పేరు మీద పాటలు పాడుతున్నరు. నినాదాలు ఇస్తున్నరు. చివరికి గ్రామాధికారి కూడా ఇట్లా జవాబు చెబుతాడు. "నేను ప్రభుత్వ బానిసను, ఆ ఊరేగింపు రాజకీయ ఊరేగింపు. అక్కడ ఉంటే తప్పక రిపోర్ట్ రాయాలె. వీటన్నిటి కంటే ఈ గ్రామం నుండి వేరే గ్రామ వెళ్ళడం ఉత్తమం అని నిర్ణయించుకొని వెడుతున్నాను".

ఇదే కథలో ఆయన పరిస్థితిని వాతావరణానికి అనుసంధానం చేస్తూ రాసిన పద్ధతి చూడండి.

"శరీరమంతా బురద చల్లుకొని, నాగలిని మెడపై వేసుకొని, మొకాటి లోతున బురద పొలంలో నిలబడ్డ ఎడ్లను చూశాను. పిట్టల కీచుకీచులు వినబడడం లేదు. సన్నని మంచు కురుస్తోంది. ప్రపంచమంతా ఇవ్వాళ్ళ విచారం వెలి బుచ్చుతున్నట్టుగా కనిపించింది. మబ్బుల్లో తల దాచుకొన్న సూర్యుడు కనిపించడం లేదు. నా శరీరం అంతా ఒకేమారు జలదరించింది". "ఈ కథ పిచ్చయ్య ప్రత్యక్షానుభవం నుండే వచ్చిందని" పేర్కొంటారు ముదిగంటి సుజాతారెడ్డి. ఆయన వర్ణించిన ఊరేగింపులు నల్గొండ జిల్లా కడివెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య విసునూరు దొర చేసిన కాల్పుల్లో నేల కొరిగిండు. వేలాది జనంతో ఆయన అంతిమ యాత్ర జరిగింది. ఆయనకు మద్దత్తుగా అనేక గ్రామాలలో అంతిమ యాత్ర జరిగింది. కాబట్టే ఊరేగింపులు అనే బహువచనం.

ఇట్లా కొనసాగే ఈ కథలలో "చప్రాసి" దినచర్య నాటి సమాజాన్ని చిత్రించిన మరో కథ. నాటి చప్రాసుల్లో ఉండే లంచగొండితనం, చిత్రించిండు. కథలో ప్రభుత్వ అధికారులు, వాళ్ళ వైభోగం, పెత్తం దారులు అధికారుల లాలూచీ, కనిపిస్తుంది. "ఈత గింజ ఇచ్చి తాటి గింజ లాగిన జమీందారు" కథ ఈ పరిశోధకులకు పూర్తిగా లభించలేదు. ఆ కాలంలో మీజాన్ పత్రిక తెలుగు విభాగానికి సంపాదకుడుగా పని చేసిన అడవి బాపిరాజు పిచ్చయ్య రచనా వైదగ్ధ్యత గురించి, భాషను భావ గాంభీర్యాన్ని గురించి మెచ్చుకొన్న మాటలు ఈ కథ ప్రారంభంలో ఉన్నాయి.

చితికి పోయిన పేద రైతు దుఃఖం ఇది. షావుకారు రైతు కుటుంబాన్ని పీల్చి పిప్పి చేసి, చివరికి జమీందారు దగ్గరికి తీసుకెడతడు. రైతు గోపయ్య తన దైన్య స్థితి ని వివరిస్తూ అప్పు అడిగితే "నా దగ్గర డబ్బు దొరకదు కాని ధాన్యం ఇస్తా అంటాడు. ప్రకాశకులకు ఈ కథ మొత్తం దొరకక పోవడం వల్ల సగమే అచ్చయింది. కాని స్థూలంగా దీనిలోని సారాంశం పాఠకులకు చేరుతుంది.

ఆవుల పిచ్చయ్య రాసినవి కొద్ది కథలైనా నాటి తెలంగాణ సమాజాన్ని బలంగా చిత్రించిండు. పిచ్చయ్య ను పరిశోధించి తెలంగాణ సమాజానికి అందించిన సంగిశెట్టి శ్రీనివాస్ అభినందనీయుడు. ఈ పుస్తకం ముందుమాట లో కాసుల ప్రతాప రెడ్డి అన్నట్టు గా "సంగిశెట్టి లాంటి వాళ్ళు శూన్యంలో మెరుపు తీగలను చూస్తున్నారు. ఆవుల పిచ్చయ్య లాంటి వాళ్ళ రచనలు తెలంగాణకు సంబంధించిన సమకాలీనతను సంతరించుకొంటున్నాయి. అలాంటి సమకాలీన సందర్భాన్ని గుర్తు చేసే కవిలె పుస్తకాలను అందిస్తున్న సంగిశెట్టికి ఈ తరమే కాదు భావిష్యత్తరం కూడా ఋణపడి ఉంటుంది".

పుస్తక పరిచయం

# వరం మీది కల్పవృక్షం సురవరం

**తెలంగాణలో సాహితీ అన్వేషణకు బీజాలు వేసిన నాటి తెలంగాణ పండిత పరిశోధకుడు...**



డా. అమ్మంగి వేణుగోపాల్

తెలంగాణ వైతాళికుడు జమ్మిచెట్టు మీది అస్త్రం వంటివాడు. శత్రువు చుట్టుముట్టగానే గోవుల వంటి జనాన్ని, అభిమానధనాన్ని కాపాడటానికి కదనంలోకి దూకే పాండవుడవుతాడు. తాండవమాడుతాడు. మరి సురవరం ప్రతాపరెడ్డి (1896-1953) సవ్యసాచి! రెండు ప్రపంచయుద్ధాలు చూసినవాడు. విశాల జగతిని చూసి జీవితగతి సూత్రాలను అర్థం చేసుకున్నవాడు. పాలమూరు జిల్లా బోరవెల్లి గ్రామంలో పుట్టినా కర్నూలు, హైదరాబాదు, మద్రాసులలో చదివి హైదరాబాదును కార్యక్షేత్రంగా మలుచుకున్నవాడు. అయితే ఆయన తిరుగాడిన భౌతిక ప్రపంచం కంటే మధించిన మనోప్రపంచం సువిశాలమైనది. 'జ్ఞానం' - అదీ ఆయన నిక్షేపించుకున్న నిధి. హిందువుల పండుగలు, రామాయణ విశేషములు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, వెయ్యికి పైగా వ్యాసాలు, 24 కథలు - మొదలైనవి ఆ నిధిలో సగం మాత్రమే. విధి శీతకన్ను వేసింది కాని, మిగిలిన సగం అక్షరరూపం పొంది వుంటే భారతదేశంలోని గొప్ప రచయితలలో ఒకరుగా విఖ్యాతి చెంది వుండేవాడు.

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు గారి శుభాకాంక్షలతో, మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిగారి సంపాదకత్వంలో వెలువడ్డ 'సురవరం - తెలంగాణం' అన్న ఉద్గ్రంథం చదివిన తర్వాత ఎవరికైనా పై భావాలు కలుగుతాయి. మనకాలపు గొప్ప వ్యక్తికి నిరంజన్‌రెడ్డి గారు సమర్పించిన నివాళి కూడా గొప్పగానే వుంది. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆచార్య జయధీర్ తిరుమలరావు, డా॥ గంటా జలంధర్‌రెడ్డి, డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ వంటి కార్యదక్షులు సురవరం శతజయంతిని నిర్వహించారు, అనేక గ్రంథాలు ప్రచురించారు. ఇతర సందర్భాలలో నివాళులర్పించారు. సురవరం రాసినవి మామూలు పుటలు కాదు. చరిత్ర పుటలు. ఇన్నేండ్లు గడిచినా వారి 'రామాయణ విశేషములు', 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' వంటి గ్రంథాల మీద సమగ్ర పరిశోధనలు వెలువడలేదన్నది విజ్ఞుల అభిప్రాయం. ఈ గ్రంథంలో సురవరం 'నేను చేసిన కృషిని ఎవ్వరును గమనింపకపోవుట నా దౌర్భాగ్యము' (పుట 98) అని ఆవేదన వ్యక్తంచేశాడు. ఇందుకు చారిత్రక కారణాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడగానే తెలంగాణలోని గొప్ప రచయితలంతా మరుగునపడే దుస్థితి దాపురించింది. మన పండిత పరిశోధకులకు గ్రహణకాలపు సూర్యచంద్రుల గతి పట్టింది.

'సురవరం-తెలంగాణం' గ్రంథంలో - కవిత్వం, సంపాదకీయాలు, వ్యాసాలు, పీఠికలు, ప్రముఖుల లేఖలు, సమకాలీనుల స్మృతి కవిత్వం, సురవరం పై వ్యాసాలు, సురవరంపై నేటితరం, సురవరం బాటలో - అన్న తొమ్మిది విభాగాలున్నాయి.

సురవరం కవిత్వంలో చెప్పుకోదగ్గది 'వెట్టివానిపాట'. ఇది గోలకొండ పత్రికలో 1931 మార్చిలో వచ్చింది. నిమ్నకులాలకు చెందిన వెట్టివాండ్లు కట్టుబానిసలు. సురవరం కవిత ఉత్తమ పురుషలో వెట్టివాడి సహజమైన కులమాండలికంలో హృదయవిదారకమైన జీవితచిత్రణతో కనిపిస్తుంది. ముగింపులో వెట్టివాడు దుర్భరమైన వ్యవస్థమీద తిరుగుబాటు ప్రకటిస్తాడు. శ్రీశ్రీకి కూడా తట్టని కవితా వస్తువిది. 15 సంవత్సరాల ముందే రైతాంగపోరాట పరిణామాన్ని సురవరం ఊహించాడు. సురవరం ఈ కవితను రచించిన రెండేండ్ల తర్వాత ఆంధ్రా ప్రాంతపు కవికొండల వెంకటరావు ఇట్లాంటి ఇతివృత్తంతో 'నక్కాసామిగాడు' (1933) అన్న గేయం రాశాడు. దీన్ని విమర్శకులు ప్రస్తావించారు తప్ప అంతకన్నా ఉత్తమంగా ఉన్న సురవరం రచనను ప్రస్తావించలేదు!

సురవరం 'సంపాదకీయాలు' అసంఖ్యాకాలు. ఎక్కువగా 'గోలకొండ

పత్రిక' పాలిసీని తెలియజేసేవి. ఎవరో ఆంధ్రప్రాంతపు విమర్శకుడు తెలంగాణ భాష 'గ్రామ్యము' అని సంకర స్వభావం కలిగిందని రాస్తే ఆత్మాభిమాన దురంధరుడైన ప్రతాపరెడ్డి కోస్తాంధ్ర ప్రాంతపు భాష ఆంగ్ల భాషాసాంకర్యం పొందలేదా? అని ప్రశ్నించాడు. అక్కడి స్త్రీలు కూడా దైనందిన వ్యవహారంలో వాడే - 'అసలు, కబుర్లు, సరదా, హద్దు, రోజు' వంటి మాటలు ఉర్దూ పదాలు కావా? అని కూడా ప్రశ్నించాడు. కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్లు మొదలైన అన్ని తెలంగాణ జిల్లాలలో అచ్చమైన తెలుగు వ్యవహారికం వుందని తెలియజేశాడు. 1929 లో సురవరం చేసిన ఈ సూత్రీకరణ పునాదిగా ఆ తర్వాతి కాలంలో కాళోజీ వంటివారు "రెండున్నర జిల్లాలదె దండిబాస అయినప్పుడు/ తక్కినోళ్ళ నోళ్ళయాస



**ఆధునిక రచయితలు చాలామంది సురవరం బహుముఖశేముషిని గూర్చి రాశారు. వాటిలో ముఖ్యమైన వ్యాసాలను 'సురవరంపై నేటి తరం' అన్న శీర్షికకింద ప్రచురించటం జరిగింది. సాహిత్య సామాజిక రంగాలకు నిబద్ధతతో సేవలందించిన తెలంగాణ తేజోమూర్తులను గూర్చి వివిధ రచయితలు చేసిన రచనలను 'సురవరం బాటలో' అన్న శీర్షికకింద ప్రచురించారు.**

తొక్కి నొక్కబడ్డప్పుడు / ప్రత్యేకంగా రాజ్యం పాలుగోరడం తప్పదు" అని అన్నారు.

ప్రతాపరెడ్డి వెయ్యికి పైగా వ్యాసాలు రాశాడు. భాష, సాహిత్యం, సంస్కృతి, విజ్ఞానం, రాజకీయం, సమాజం, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అనేక అంశాలమీద విజ్ఞాన సర్వస్వ స్వభావం (encyclopedic nature) వున్న వ్యాసాలు రాశాడు. 'తందానకథలు' అన్న వ్యాసంలో మూలాలలోకిపోయి చారిత్రక నేపథ్యాన్ని వివరించటం కనిపిస్తుంది.

'మార్గ కవిత వచ్చి దేశి కవితను ముంచిపోయింద'ని, అనటమే కాదు, 'సంస్కృతము వలన తెలుగు భాషకు అంతగా లాభము చేకూరలేద'ని కూడా వ్యాఖ్యానించాడు. అధిక సంఖ్యాకులైన పామరజనుల మీద, మాతృభాష అయిన తెలుగు మీద అపారమైన ప్రేమాభిమానాలున్నవాడు మాత్రమే ఇంత నిర్భయంగా చెప్పగలడు. 'దేశింగురాజును, తాండ్రపాపారాయని, బ్రహ్మనాయని, సదాశివరెడ్డిని జనులెంత ప్రేమింతురో అందు సహస్రాంశము కూడా వసురాజును, స్వారోచిషమనువును, నలుని, తుదకు పారిజాతాపహరణములో మెత్తని తన్నులు తినిన కృష్ణుని ప్రేమింపరు' అని వ్యంగ్యోక్తితో ఆగకుండా, జాతిలో - 'సన్నగిల్లుచుండిన ఉత్సాహ శౌర్య ధైర్యములను నిలబెట్టినదేదన తందాన సాహిత్యమే యనవలెను' అంటూ సంస్కృతి జాతి ఔన్నత్యానికి ఎట్లా దోహదం చేయగలదో స్పష్టం చేశాడు. 1921 నాటికి విద్యార్థిగా ఉన్న సురవరం దృష్టి ప్రజాసాహిత్యం, కళల మీద పడింది! భవిష్యత్తులో బిరుదురాజు రామరాజు వంటి జానపద పరిశోధకులకు కొత్త తోవ చూపించింది సురవరం పరిశోధన వ్యాసాలే. అంతేకాదు, వామపక్ష భావాలకు ఆటపట్టయిన అభ్యుదయ రచయితల సంఘం స్థాపన (1943)కు 20 సంవత్సరాల ముందే ప్రతాపరెడ్డి ప్రదర్శించిన ప్రగతిశీల భావాలు ఇతర భాషల్లో చాలా అరుదు.

'మన రాజ్యాంగము' అన్న పీఠికను చదివితే ప్రతాపరెడ్డి బహుముఖ ప్రజ్ఞ తెలుస్తుంది. 1950 జనవరి 26 నుండి అమలులోనికి వచ్చిన భారత రాజ్యాంగానికి హిందీలో వచ్చిన అనువాదాలను చదివాడు. అవి ఆయనకు నచ్చలేదు. అందుకు కారణాల్లో ఒకటి - 'అడ్డదిడ్డిగా హిందీవాదులు సృష్టించిన పదములు సరికానివైన తక్కిన భాషలవారేల స్వీకరింతురు?' అంటూ అవతలివారి నిర్లక్ష్య నిరంకుశత్వాలను తన మాతృభాషాభిమానంతో పరాస్తం చేస్తాడు. తెలుగులో కొన్ని సంస్థలు చేసిన ప్రయత్నాలు ఆయనకు నచ్చలేదు. చివరకు పర్సా వెంకటేశ్వరరావు గ్రంథం ఆయనకు నచ్చింది. ఈ సందర్భంలో దేశదేశాల స్వాతంత్ర్యోద్యమాలను గూర్చి, రాజ్యాంగాలను గూర్చి అనేక అంశాలను ప్రస్తావించి పాఠకులను అబ్బురపరుస్తాడు. దీన్ని ఒకరకంగా జ్ఞానదానం అనవచ్చు.

'ప్రముఖుల లేఖలు' అధ్యాయంలో

పుస్తక పరిచయం

విశ్వనాథసత్యనారాయణ, దీపాలపిచ్చయశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వంటి ఆనాటి గొప్ప రచయితలు ప్రతాపరెడ్డికి రాసిన లేఖలున్నాయి. వీటన్నిటిని చదివితే 1940 దశాబ్దంలో మొత్తం తెలుగుదేశపు సాహిత్యరంగానికి ప్రతాపరెడ్డి కేంద్రబిందువుగా ఉన్నాడనేది అర్థమవుతుంది.

ఆధునిక రచయితలు చాలామంది సురవరం బహుముఖశేముషిని గూర్చి రాశారు. వాటిలో ముఖ్యమైన వ్యాసాలను 'సురవరంపై నేటి తరం' అన్న శీర్షికకింద ప్రచురించటం జరిగింది. సాహిత్య సామాజిక రంగాలకు నిబద్ధతతో సేవలందించిన తెలంగాణ తేజోమూర్తులను గూర్చి వివిధ రచయితలు చేసిన రచనలను 'సురవరం బాటలో' అన్న శీర్షికకింద ప్రచురించారు.

గోలకొండ పత్రికలో 'స్త్రీలకు స్వాతంత్ర్యము అనవసరము'' అన్న వాదం బయలుదేరినప్పుడు యెల్లాప్రగడ సీతాకుమారి నాయకత్వంలో రచయిత్రులు ప్రతివిమర్శలు గుప్పించారంటున్నారు ఇల్లిందల సరస్వతీదేవి (పు.227). అలజడి కొంత చల్లారిన తర్వాత ఆ రెచ్చగొట్టే వ్యాఖ్య తానే చేసినట్లు ప్రతాపరెడ్డి ఒప్పుకొని, 'ఒరిపిడి వల్లనే కదా బంగారానికి మెరుగువచ్చేది' అని జవాబిచ్చాడట! బంగారమంటే స్త్రీలకుండే సెంటిమెంట్ తెలిసిన ప్రతాపరెడ్డి పనిలోపనిగా గోలకొండ పత్రిక సర్క్యులేషన్ కూడా పెంచుకొని ఉంటాడు.

సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిగారి సంపాదకత్వంలో వచ్చిన 'సురవరం - తెలంగాణ' అన్న ఉద్గ్రంథం చిరకాలంపాటు సాహితీ దాహార్తుల పాలిటి జీవనదిగా ప్రవహిస్తుందనటంలో సందేహంలేదు. పనిలోపనిగా ఆయన రచించిన వెయ్యి వ్యాసాలను పుస్తకంగా ప్రచురించే పక్షంలో అది సురవరం మాగేసిన మధురఫలాలను పాఠకులకు అందుబాటులోకి తెస్తుందని ఆశిస్తున్నాను.

కవిత

# ఎడతెగని వాన

**మునాస వెంకట్**



కాళ్ళు జాపుకొని నాత్రి
గుర్రు కొడుతుండగా లేసేది
పచ్చులు లేవకముందే రెక్కలాడిస్తూ...

వట్టి చాపల గంప నెత్తుకొని
పిల్లబాట తీసేది
నీడలు నిన్నటివి మొన్నటివి
ఏండ్ల కితం నీడలు
అమ్మెంట నడుస్తూ మాట్లాడేవి

బర్లని మేకల్ని అల్లిచ్చిందాయే
దుఃఖాన్ని కూడా అల్లిచ్చేది
పెద్దబోయి ఇల్లు అని ఇస్తే
పెద్దబాయిల పడేసినట్టు అయింది

దాసింది లేదు తీసింది లేదు
మెడల నల్లపూస లేదు
పతానం నాటి నల్లపోచెక్క తప్ప

చాపలు జెన ఇడిసినట్టు
బాధలు జెన ఇడిసినయి
గుండె సెడని యుద్ధ భూమి
ఆమె అంతరం
అరికాళ్ళ కింద నేల
మాడమీద ఆకాశం
మోస్తూ నడుస్తూ ఆమె
ఆగని తెడ

అమ్మ బాధల్ని
ఎన్ని చాపలు మొసినయొ
ఎన్ని చెర్లు అలుగెల్లినయొ
ఎంత చీకట్లోనయినా
వెలుగులోనే నడిచేది

ఎట్ల ఈదిందో గాని
సంసారం సాలమ్మ
చెక్కుడు సంచి చేదబాయి
చేతిలోకి పైస రాదు
బొక్కెండ్లోకి నీళ్ళు రావు

కాగులో ఏమి లేకపోయినా
కరువుని కడుపులో దాసుకుంది
ఊరుమీద ఉరిమై ఉరుముతుంటే
మెఖం మొఖం తిప్పుకొనిపోయేది

చేను, చెరువు ఎంటపడి
పరకకు పరిగకు
పడిగాపులు గాస్తే
కన్నీళ్ళు ఇంకిన నిశ్శబ్దమే

కోయిల పాడుతుంటే
ఋతువు మధురంగా ఉంటదనుకుంది
కన్నీళ్ళు తాగే మాయకాలమనుకోలేదు

ఎన్ని ఊర్లు, ఎన్ని అంగళ్ళు
గుండె మారెసరుముంతై
అమ్మే ఆరబెట్టిన పటువై
కుతకుత ఉడుకుతు వచ్చేది

సాలమ్మొ సముద్రమో ఎన్ని తుఫాన్లని
తుమిస్కలని చేసింది
ఆమె ఆమెని మాలోనే చూసుకునేది
అట్ల అమ్మకు మేము ఏడు నిలువుటద్దాలము
అమ్మ మాలోకి చూసినపుడు చెమటలు
పట్టిన ఆమె మొఖం సెంద్రకాంతిలా మెరిసేది
అమ్మ నీడనే సెట్లు సేదతీరేయి

దీపం ఉండేది
కాని అమ్మ వచ్చినంకనే వెలుగొచ్చేది
గొంతు పొరబోయినపుడు
పడమటి గోడపై
అమ్మ మొఖం కనిపిస్తుంది



# జ్ఞాన్ పీఠ్ అవార్డు గ్రహీత
# డా॥చంద్రశేఖర కంబార

కన్నడ రచయిత డా॥ చంద్రశేఖర కంబార, 2010 లో సాహిత్య రంగంలో అత్యున్నత పురస్కారం జ్ఞాన్ పీఠ్ అవార్డుకు ఎంపికయ్యారు. కవిగా, నాటక రచయితగా, పరిశోధకునిగా, సంగీత దర్శకునిగా, జానపద విద్వాంసునిగా డా॥ చంద్రశేఖర కంబార బహుముఖ ప్రజ్ఞ కనబరిచారు. 25కుపైగా నాటకాలు, 17 పరిశోధనా గ్రంథాలు, 6 సీరియల్స్ రాశారు. సంగ్యబాల్య, జోకుమారస్వామి, జై సిద్ధనాయక, ఛలేషా, సిరి సంపిగె, మహామాయి, సాంబశివ ప్రహసన మొదలైనవి బహుళ ప్రజాదరణ పొందాయి. డా॥ చంద్రశేఖర కంబార ఆరు సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'కాడు కుదురె' సినిమాకు 1987లో ఆయన జాతీయ అవార్డు పొందారు.





# నోబెల్ సాహిత్య బహుమతి 2012
# 'మో యాన్'

మో యాన్' పేరుతో రచనలు సాగించి చైనా సాహిత్యంలో గొప్ప కథకుడిగా పేరుగాంచిన గ్వాన్ మొయెకు 2012 లో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి దక్కింది. పేదరికం, ఆకలిని అనుభవాలుగా చేసుకుని తర్వాత కాలంలో తన రచనల్లో వాటిని కళ్లకు కట్టారు 'మో యాన్'. 1987లో 'రెడ్ సొర్గమ్' అనే నవలతో మో పేరు మార్మోగింది. 'హెరాంగ్ గౌలియంగ్ గిజూ', 'గిజూ' సైతం మంచి ఆదరణ పొందాయి. మో రాసిన అనేక నవలలు ఇంగ్లీషులోకి అనువాద మయ్యాయి. ది రిపబ్లిక్ ఆఫ్ వైన్, లైఫ్ అండ్ డెత్ ఆర్ వియరింగ్ మీ ఔట్, శాండిల్‌వుడ్ డెత్, బిగ్ బ్రెస్ట్స్, వైడ్ హిప్స్, పేర్లతో 'మో యాన్' రచనలు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి

కవిత

# ఒకవైపు నుండి ఆడే ఆట

ఏనుగు నరసింహారెడ్డి



పరుగుల పాద విన్యాసంలోనో
పగ్గంలేని బుడితనం గంతుల్లోనో
హక్కుల్లేవని తెలియక లాంగ్
జంప్ బెద్రలు దాటినప్పుడు
నిషిద్ధాక్షరిని ఉచ్ఛరించినట్లు
తాళ్ళుకట్టి లాగబడేది  ఆమె శైశవం

తనే మొదలుపెట్టిన ఆట యేటిలో
బాల్యం కేరింతలు కొడుతూ ఉన్నప్పుడు
అకస్మాత్తుగా మొలిచిన కేకల కొక్కాలకు చిక్కి
ఆమె ఆటలోతుల వికాసం లాక్కుపోబడేది

జ్ఞాన శిఖరాల సోపానాల పంక్తిలో
అధిరోహనాహ్లాదం అరవిరియకముందే
బలవంతంగా దారితప్పించబడ్డ
ఆమె కౌమార్యం
అపరిపక్వ కుటుంబ గానుగకు
ఆసక్తితో నిమిత్తం లేకుండా అర్పించబడేది

తెలియకుండా చేసిన తప్పు
తెలిసి తెలిసీ చేసిన నేరం
రెండూ ఒకవైపే లాగే పాసంగంతో
శిక్షల త్రాసుమొల మొగ్గుతూ ఉంటే
ఆమె యవ్వనం రెప్పల నడిమి కన్నీటి కింద
ఏకపక్షంగా నలిగిపోయేది

ఒకవైపు దారి వికసిస్తా ఉంటే
మరోవైపు తొవ్వల్లో
తీసినకొద్దీ అడ్డంబడే ముళ్ళపొదలు.
ఒక మైదానంలో వెన్నెల విస్తరిస్తా ఉంటే
మరో ఎగుడుదిగుడు నేలల్లో
ఆవరించుకుంటున్న అమావాస్య నిశి.
ఒకవైపు వికాసం కేరింతల
మోసులెత్తుతా ఉంటే
ఇంకోవైపు కుటుంబ గుడారంలో
కుందేటి రూపం విస్తరిస్తూ

రెప్పలకింద కన్నీటిని
అదిమిపట్టలేని అశక్తత
పూడుకుపోయిన గొంతును
ఉగ్గబట్టకుండా ఆపలేనితనం
భ్రూణ హత్యల రహస్యావసరాల సంగతి సరే
భువన హింసను వేరుపరిచే
మానవహంసలే కరువైన దైన్యం
వెంటాడుతూ ఉంటే

ఒక మూల మలుపులో
అన్నా చెల్లెలూ
ఎదురుపడి నివ్వెర పోవలసిందే
ఒక చౌరస్తాలో నిలబడి
అక్కా తమ్ముడూ
దుఃఖపుటేరులో మునగాల్సిందే
అవకాశాలు రెక్కల్ని ఇచ్చినట్టే ఇచ్చి
అదుపాజ్ఞల చట్రాల్ని పరిచినందుకు
మనమంతా వీరంగమేసి
వాళ్ళను పట్టాల్లో మాత్రమే
పరుగెత్తనిచ్చినందుకు
ఇంకా మన తర్వాత మాత్రమే నడిచే
అవకాశాల్ని ఒడుపుగా పరిచినందుకు
ఆట ఒకవైపే ఆడనిచ్చినందుకు

సభలు సమావేశాలు



# పి.వి. శతజయంత్యుత్సవ సందర్భంగా జాగృతి బుక్ క్లబ్ జూమ్ సభ

పి.వి. శతజయంత్యుత్సవ సంవత్సరంలో భాగంగా పి.వి.ని స్మరిస్తూ తెలంగాణ జాగృతి బుక్ క్లబ్ ఫిబ్రవరి 27 తేదీన జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి, విమర్శకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నిర్మించిన చైతన్యం మళ్ళీ ఆరేళ్ళకే విస్మరణకు గురౌతున్నదని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఇంకా సురవరం ప్రతాపరెడ్డి, లక్షణాచార్యలు, ఆదిరాజు వీరభద్రరావు, బుక్కపట్నం సుబ్బాచార్యులు, గడియారం వేంకటశాస్త్రి లాంటి అనేకమంది విమర్శకులు చేసిన దోహదాన్ని ఆయన వివరించారు. సి. రంగాచార్య, రవ్వా శ్రీహరి, మలయశ్రీ, రంగానాథాచార్యల వంటి విమర్శకులను పేర్కొంటూ తదనంతర కాలంలోనే విమర్శను కూడా స్పృశించారు. ఈ కార్యక్రమంలో దాసరి మోహన్, వాసరచెట్ల జయంతి, దేవకీ దేవి, చీదెళ్ల సీతాలక్ష్మి దంపతులు, దాస్యం సేనాధిపతి మొదలైన నలభై మంది సాహితీవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంచాలకులుగా జాగృతి బుక్ క్లబ్ అధ్యక్షులు డా. కాంచనపల్లి గో.రా. వ్యవహరించారు.




# ఎన్నీల ముచ్చట్లు

తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27న పున్నమినాటి రాత్రిపూట 94వ ఎన్నీల ముచ్చట్లు జరిగాయి. ఇటీవల మరణించిన కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖులు వినియోగదారుల మండలి, లోక్ సత్తా ఉద్యమ నేత నరెడ్ల శ్రీనివాస్ మరియు కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత వాసాల నర్సయ్యల చిత్ర పటాలకు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. వారి సేవలను వక్తలు శ్లాఘించారు. కవులు సమకాలీన సమస్యలు ఇతివృత్తంగా రాసిన కవితలను గానం చేశారు. ఈ కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, కందుకూరి అంజయ్య, వారాల ఆనంద్, సంగనభట్ల నర్సయ్య, సి. వి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లక్షెట్టిపేటలో పుస్తాకావిష్కరణ సభ



తండ్రి కొడుకుల పుస్తకాలు ఒకే రోజున ఒక వేడుకగా ఆవిష్కరించుకోవడం సాహితీ చరిత్రలో ఒక అరుదైన ఘటనగా ప్రముఖ సాహితీ వేత్త యక్కలూరి శ్రీరాములు అభివర్ణించారు. సుప్రసిద్ధ చిత్రకారులు శేష బ్రహ్మం తండ్రీకొడుకులను అభినందించారు. ఫిబ్రవరి 28వ తేదీన మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో నూటెంకి రవీందర్ రచించిన 'అతడే అలి గిన్నాడు', అవనీష్ (రవీందర్ కొడుకు) రచించిన ఇన్నొంట్ పుస్తకాలను రచయిత యక్కలూరి శ్రీరాములు ఆవిష్కరించారు. కవులు రచయితలు అన్నవరం దేవేందర్, డా॥ ఉదారి నారాయణ, గోపగాని రవీందర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని సాహితీ వేత్తలయిన తండ్రీకొడుకులను అభినందించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు గోపగాని రవీందర్ అధ్యక్షత వహించారు. పుస్తకాలను ల్యాధాల గాయత్రి, ధవళేశ్వరపు జగదీశ్వరులు విశ్లేషించారు.



**గోసంగిలు ఎవరు**

గనిశెట్టి రాములు

గోసంగి సంక్షేమ సంఘం
వెల.రూ. 50 /-



**నాన్న**

భానుశ్రీ కొత్వాల్

నల్గొండ,
సెల్ : 98668 63913
వెల.రూ.190/-



**దృశ్యం నుండి దృశ్యానికి**

వి.ఆర్. విద్యార్థి

ప్రత్యూష ప్రచురణలు, వరంగల్
సెల్ : 90002 83672
వెల. రూ. 60/-



**కవిత్వ పరామర్శ**

డా॥ సి.హెచ్. సుశీలమ్మ
హైదరాబాద్

వెల.రూ.150/-



**అష్టకాల సత్యాలు**

అష్టకాల నరసింహారామ శర్మ

సెల్ : 9440008863
వెల. రూ. 150/-



**పొలి మేర**

గూడ అంజయ్య

నవోదయ బుక్ హౌస్,
తెలుగు బుక్ హౌస్,
హైదరాబాద్
వెల. రూ. 95/-



**గల్పికా తరువు
104 ఒక పేజీ గల్పికలు**

జ్వలిత

జె.డి. ప్రచురణ, హైదరాబాద్
సెల్ : 9989198943
వెల. రూ. 200/-



**కాలం వెంట కలం**

సుధామ

సెల్ : 98482 76929
వెల. రూ.300/-



**సురవరము ప్రతాపరెడ్డి
జీవితము - సాహిత్యము**

డా॥ ఎల్లూరి శివారెడ్డి

విజ్ఞాన సరోవర ప్రచురణలు
హైదరాబాద్, ఫోన్: 040-29809323
వెల. రూ.150/-

